# నవలానాయకులు

## వ్యాసాలు

- తృష్ణ



శ్రీ కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 89

# విషయసూచిక


| | |
|---|---|
| అడవి బాపిరాజు - నారాయణరావు | 3 |
| శాంతినికేతన్ — రాజా | 8 |
| విశాలనేత్రాలు — రంగనాయకుడు | 12 |
| అతడు ఆమె — అతడు | 17 |
| చిత్రసుందరి — అణ్ణామలై | 21 |
| కీర్తికిరీటాలు — తేజ | 25 |
| మట్టిమనిషి — సాంబయ్య | 29 |
| బారిష్టర్ పార్వతీశం | 33 |
| అల్పజీవి — సుబ్బయ్య | 37 |
| వనవాసి — సత్యచరణ్ | 41 |
| ఛెంఘిజ్ ఖాన్ | 45 |
| చివరకు మిగిలేది — దయానిధి | 51 |

సాహిత్యప్రక్రియలన్నింటిలోనూ లోకప్రియమైనది నవల. సమకాలీన సమాజానికి దర్పణం పడుతూ, రచనాకాలపు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను ముందుతరాల పాఠకులకు అందించగల శక్తి నవలాసాహిత్యానికి ఉన్నది. సామాన్యుడికి అందుబాటులో ఉండటం వల్ల నవలాప్రక్రియకు సామాజిక మార్పులు, వ్యక్తిత్వ మార్పులు కలిగించగల శక్తి ఉంది. అటువంటి శక్తివంతమైన నవలాసాహిత్యంలోని కొన్ని ఉత్తమ నవలలను ఎన్నుకుని, ఆ నవలల్లోని నాయకుల పాత్రలను పరిచయం చెయ్యాలన్నది ఈ వ్యాసపరంపర ఉద్దేశం.

# నారాయణరావు




"**ఆజానుబాహుడు**, అయిదడుగుల పదనొకండంగుళముల పొడవువాడు. బలసంపదకు నెలవైనవాడు. ఉజ్వల శ్యామలుడు. చిన్నవై, తీక్ష్ణమైనలోచనములు తీరై, సమమై కొంచెము పొడుగైన ముక్కు దూరస్థములగు నా కన్నులమధ్య ప్రవహించి, ధనుస్సువలె తిరిగిపోయిన పైపెదవికి నాతిదూరమున నాగింది. అతని నోరు సుందరమైన పద్మినీజాతి లలనా రత్నమునకు వన్నె తెచ్చునట్టిదై యున్నది. ఆ లోపమును ఉత్తమనాయక లక్షణమగు నామ్రచిబుకము ధృఢరేఖాచకితమై ధీరత్వము పుంజీభవింపజేయుచు తీర్చివేసినది." "ఎత్తయిన విశాలమైన యాతని ఫాలము, నల్లని దట్టమైన జుట్టు పొదుపుకొన, కారుమబ్బులాక్రమించిన వెన్నెల తులుకవలె విరిసిపోయినది."

మనోహరమైన ఈ రూపవర్ణన ఆజానుబాహుడైన **నారాయణరావు**ది. అతను తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధిగాంచిన అడివి బాపిరాజుగారి "నారాయణరావు" నవలా నాయకుడు. ప్రజ్ఞాశాలి బాపిరాజుగారికి మారు రూపనిపిస్తాడు నారాయణరావు. బాపిరాజు ఆదర్శాలు, అభిప్రాయాలు, కళానైపుణ్యం, మానవతావాదం, ప్రతిభ అన్నీ కూడా అతడిలో కనబడతూంటాయి.

*నవల రచయిత అడివి బాపిరాజు:*

కవి, చిత్రకారుడు, నాటక కర్త, స్వాంతంత్ర్య సమరయోధుడు, మానవతావాది, లాయరు, ప్రిన్సిపాల్, పాత్రికేయుడు, గాయకుడు, కళా దర్శకుడు, అయిన అడివి బాపిరాజు బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగువారింట జన్మించిన మణిపూస. నవల అయినా, కథైనా, నాటకమైనా, పాటైనా, పద్యమైనా అవలీలగా రాయగల సామర్ధ్యవంతుడైన రచయిత ఆయన. సాంఘికమైన, చారిత్రాత్మకమైన నవలలు

ఎక్కువగా రచించారు. సాంఘికవాది, అభ్యుదయవాది. గాంధేయ సిద్ధాంతాలవల్ల ప్రభావితుడై 1921లో సహాయనిరాకరణోద్యమంలో పాల్గొని జైలుకి వెళ్ళి రాజమండ్రిలోనూ, కడలూరు లోనూ ఓ ఏడాది పాటు కఠినశిక్షను అనుభవించాడు. ఆ జైలు జీవితము తాలుకు అనుభవాలు, విశేషాలు నారాయణరావు పాత్ర ద్వారా నవలలో తెలియపరుస్తాడు బాపిరాజు. సమాజాన్ని, మనుషుల మనస్తత్వాలను సూక్ష్మంగా పరిశీలించినవాడవటం వలన బాపిరాజు రచనలలో పాత్రల చిత్రణ, వారి మానసిక విశ్లేషణ చాలా సహజంగా, పాఠకుల మనసులకు దగ్గరైయ్యేలా ఉంటాయి. ముఖ్యంగా అతని సాంఘిక నవలలు సమకాలీన సమాజానికి అద్దం పట్టేవిగానూ, నాటి ఆంధ్రదేశపు ఆచార వ్యవహారాలను, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులను తెలియజేసేవిగాను ఉంటాయి. అంతేకాక వివిధ విషయములపై ఆయనకు గల జ్ఞానాన్ని తెలుపుతాయి. ఆయన రాసిన ఒక్క నవలలో కొన్ని పేజీలు చదివినా బాపిరాజుకు తెలియని విషయము కలదా అని ఆశ్చర్యం కలుగుతుంది. అంతటి ప్రతిభావంతుడు అడివి బాపిరాజు.

బాపిరాజు రాసిన సాంఘిక నవలన్నింటిలో ప్రముఖమైనది 1934లో వచ్చిన "నారాయణారావు". 'ఆంధ్రకళాపరిషత్తు' తెలుగు నవలల పోటీలో విశ్వనాథ వారి 'వేయిపడగలు'తో పాటు ప్రథమ బహుమతి పంచుకున్న నవల ఇది. నారాయణరావు–శారదల వివాహం, వారిద్దరి కుటుంబాల మధ్యన ఉన్న సాంస్కృతిక బేధాలు వారి దాంపత్యాన్ని ఏ విధంగా ప్రభావితం చేసాయి? చివరికి వారిద్దరూ ఎలా ఒకటౌతారు అన్నది స్థూలకథ. ఈ కథతో పాటూ అప్పటి సమాజ పరిస్థితులు, నాటి జమిందారీ వ్యవస్థ, మానవతావాదం, గాంధేయ సిద్ధాంతాలు, సాధారణ ప్రాపంచిక సమస్యల తాలూకూ సుదీర్ఘచర్చలు నారాయణరావు నవలలో కనబడతాయి. వీటన్నింటి మూలంగా తెలుగుసాహిత్యంలో చెప్పుకోదగ్గ నవలగా **నారాయణరావు** నిలిచిపోతుంది. మళయాళం, పంజాబీ, హిందీ, కన్నడ, బెంగాలీ మొదలైన భారతీయ భాషల్లోకి అనువదింపబడినదీ నవల.

*కథానాయకుడు నారాయణరావు:*

కొత్తపేట నివాసి తటవర్తి సుబ్బారాయుడుగారు ధైర్యస్థైర్యములు కలవాడు. "గోదావరికి అద్దరిని ఇద్దరిని సుబ్బారాయుడుగారి మాటయు, భీష్మని మాటయునొకటే" అనిపించుకున్న గుణవంతులు. ద్రోణుని తలపించు రూపము వారిది. మూడు వందల ఎకరాల మాగాణి, ముప్ఫై ఎకరాల తోటలు, ఇరవైవేల దాకా నికరాదాయం వారిది. వారి భార్య జానకమ్మగారు. వారి సంతానం ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. నలుగురు కుమార్తెలకూ మంచి సంబంధాలు చేసారు. ఈ దంపతుల రెండవ కుమారుడు **నారాయణరావు**. అన్నచెల్లెళ్ళు, తల్లిదండ్రులు నారాయణరావన్న ప్రాణమిస్తారు. "అందానికి అర్జునుడు బలానికి భీముడు" అయిన నారాయణరావు "దేహమెంత వజ్రమో హృదయమంత నవనీతం". ఆదర్శవంతుడు. సంభాషణాప్రియుడయిన మితభాషి అతడు. తన హృదయాన్ని కదిలించు చర్చ వచ్చినప్పుడు పట్టుదలతో, యుక్తులతో ఉపన్యసించగలడు. ఏ విషయమైనా ఉదాహరణలతో సహా అరటిపండు వలిచినట్లు బోధించగలడు. పెద్దలతో మాత్రం గౌరవముగా మెలగుతూ వాదముల చేయడు. చక్కని వ్యక్తిత్వం కలిగి ఎట్టివారి హృదయానికైనా చేరువకాగల గుణవంతుడతను. తీయదనం, గాంభీర్యం కలగలిసిన గొంతు అతనిది. గాత్రం, ఫిడేలు రెండింటిలో విద్వాంసుడు.

సౌందర్యోపాసకుడైన నారాయణరావుకు తోటపని అంటే ప్రాణము. శెలవులకు వచ్చినప్పుడల్లా దొడ్లో ఏవేవో కొత్త పూలమొక్కలు తెచ్చి తోటంటా నాటడం, అంటులు కట్టడం, కొమ్మలు కత్తిరించి కొత్త జాతులను సృష్టించడం మొదలైనవి కాక సుబ్బారాయుడుగారి తోటలో వివిధరకముల ఫలవృక్షములను కూడా తెప్పించి నాటిస్తూంటాడతను. ఈ పనుల వల్ల మిత్రులాతనిని **తోటమాలి** అని కూడా పిలుచేవారు. శెలవులకు వచ్చినప్పుడల్లా ఇంట్లోవారందరికీ ఖరీదైన బట్టలతో పాటూ, రకరకాల చెక్క బొమ్మలు, తంజావూరు బొమ్మలు మొదలైన గృహాలంకరణ సామాగ్రినతడు కొనుక్కువచ్చేవాడు. నారాయణరావు వస్త్రధారణను కూడా రకరకాల సన్నివేశాల్లో ఎంతో

ముచ్చటగా వర్ణిస్తారు రచయిత. లేవెండరు, ఉడుకొలోను మొదలైన సుగంధద్రవ్యాల వాడకం; ఖద్దరు పంచె, లాల్చీ, ఖద్దరు సేలం కండువా ; తెల్ల పొందూరు పట్టుసాలీ, ఖద్దరు లాల్చీలో కుమారస్వామిలా ఉన్నాడని; బరంపురం వంగపండు ఛాయ పెద్ద జరీ రుద్రాక్ష అంచుల తాపితాలు ధరించి ప్రద్యుమ్నుని వలె ఉన్నదని ఓసారీ; క్షీరాబ్ధి దుకూలముల ధరించి మత్తగజ గమనముతో వత్సరాజువలె కనబడుతున్నాడని మరోసారి చెప్తారు.

ఎనిమిదేళ్ళ వయసులోనే మొఖం మీద **వందేమాతరం** అని రాసుకుని, తరగతిలోని తోటిబాలురకు కూడా రాసి, అది చెరపనని ఉపాధ్యాయులతో పేచీకి దిగిన దేశభక్తుడు నారాయణరావు. కానీ ఉపాధ్యాయుడు ఉద్యోగము పోవునని వేడుకొనగా అటువంటి పనులు తరగతిలో చేయడం మానివేస్తాడు. అతడు మొదటి ఫారంలో ఉండగా వచ్చిన నైరోపియా మహాసంగ్రామము సమయంలో ఆంగ్లేయులపై జాలికలిగి, తోటిబాలకులతో కలిసి చందాలు వసూలుజేసి, కలెక్టరు దగ్గరకు నిర్భయంగా వెళ్ళి, యుద్ధమునకు బాలుర చందాయని పోగేసిన డబ్బు ఇచ్చి, బదులుగా నిండుసభలో కలెక్టర్ చేతులమీదుగా సత్కారాన్ని, లాంబ్ రచనయైన "ఎలియా" గ్రంధాన్నీ అందుకుంటాడు. ప్రతి తరగతిలోనూ, ప్రతి పరీక్షలోనూ మొదటివాడిగా ఉత్తీర్ణుడయ్యేవాడు నారాయణరావు. టెన్నిసు, కాలిబంతి, క్రికెట్టు మొదలైన ఆటలు బాగా ఆడగలడు. రాజమండ్రిలో చదివేప్పుడు ఇంటరు నెగ్గిన వేసవిలో మహాత్మాగాంధీ సహాయనిరాకరణోద్యమంలో పాల్గొని జైలుకి వెళ్ళాడు. రెండునెలలు రాజమండ్రి లోనూ, నాలుగు నెలలు కడలూరు లోనూ ఆరునెలలు జైలుజీవితం గడిపాడతడు. బి.ఎస్.సి అనర్సు పూర్తిచేసి, ఎఫ్.ఎ పరీక్ష రాసిన తర్వాత తండ్రి ప్రోద్బలం వల్ల మద్రాసులోని న్యాయ కళాశాలలో చేరతాడు నారాయణరావు. న్యాయకళాశాల విద్యార్థులందరూ అతడిని విద్యార్థిసంఘ కార్యదర్శిగా ఎన్నుకుంటారు.

విశ్వలాపురం జమిందారుగారు శ్రీ తల్లాప్రగడ రాజాలక్ష్మీసుందరప్రసాదరావుగారిది ఆరువేలనియోగి కుటుంబము. హైదరాబాదు నవాబులకు పన్ను కడుతూ వారివద్ద బిరుదులనూ, బహుమతులనూ పొందారు. సదాచార సంపన్నుడు. పాశ్చాత్య విద్యనభ్యసించినాడు. బి.ఎ.సంస్కృత పరీక్షలో ఉత్తీర్ణుడైన భాషా ప్రేమికుడు.

ప్రజలచే వరింపబడ్డ శాసనసభ్యుడు. ఆయన ధర్మపత్ని వరదకామేశ్వరి. ఇద్దరు పుత్రికలు, ఒక పుత్రుడు వారి సంతానం. ప్రధమ పుత్రిక శకుంతలాదేవి. సంగీతసాహిత్యాలు, ఆంగ్లభాష నేర్చినందున గర్వి. ఆమెకు నెల్లూరుజిల్లాలోనొక చిన్న జమిందారుగారి ప్రధమపుత్రుడు విశ్వేశ్వరరావుతో వివాహమౌతుంది. విశ్వేశ్వరరావు ఇంగ్లాండులో ఎం.ఎ పట్టాను పొందిన డిప్యూటీ కలక్టరు. భార్యాభర్తలకు చుక్కెదురు. వారి కాపురము కలహాలకు పుట్టిల్లు. జమిందారీబిడ్డలమన్న అహంకారమిద్దరికీ ఉన్నందున వాదోపవాదాలు, మాట పట్టింపులు, కలహాలతో బ్రతికేవారు. జమిందారుగారి రెండవ కుమార్తెయే **శారద**. పదనాల్గు సంవత్సరముల అందాలబొమ్మ. శాంతమూర్తి. ఏకసంతాగ్రాహి. చక్కని తెలివితేటలు కలిగి నాలుగు భాషలు, ఆంగ్లము నేర్చిన చదువుల తల్లి. కోయిల కంఠం కలిగి గాత్రము, ఫిడేలు నేర్చుకుంది. ఇటువంటి సుగుణాలరాశికి వివాహం చేయ సంకల్పిస్తారు జమీందారు లక్ష్మీసుందరప్రసాదరావుగారు. తన మేనల్లుడు జగన్మోహనరావును శారదకిమ్మని భార్య ఎంత పోరినను, పెద్దకుమార్తె కలహాలకాపురము చూసిన తరువాత మరే జమిందారీ సంబంధమునకూ ఆయన ఇష్టపడరు. చదువు, సంస్కారం, రూపం, గుణం, అన్నవస్త్రాదులకు లోటులేనివాడైన తగిన వరునికై ఆంధ్రదేశములోని నియోగి కుటుంబములన్నీ వెదికిస్తారు.

ఎఫ్.ఎ పరీక్ష రాసి, అంతరంగ మిత్రులైన రాజేశ్వరరావు నాయుడు, వాడ్రేవు పరమేశ్వరమూర్తి, నిడమర్తి లక్ష్మీపతి, ఆలం, రాజారావు లతో రైలులో ఇంటికి వెళ్తుండగా నారాయణరావును చూసిన జమిందారుగారు అతని వివరాలన్నీ అడిగి తెలుసుకుంటారు. నారాయణరావుని చూసినది మొదలు అతనిపై అవ్యాజమైన ప్రేమ ఉత్పన్నమౌతుంది జమిందారుగారికి. అతడే తన శారదకు తగిన వరుడని

నిశ్చయించుకుంటాడాయన. ఆ తర్వాత కలెక్టరు, తహసీల్దారు, రాజమహేంద్రవరంలోని పెద్ద వకీళ్ళు, మేనల్లుడు ఆనందరావు మొదలైనవారందరితోనూ సుబ్బారాయుడుగారింటికి వెళ్ళి నారాయణరావుకి తన కుమార్తె శారదను ఇచ్చేలా సంబంధం ఖాయం చేసుకుంటారు జమిందారుగారు.

శారదను పెళ్ళిచూపులలో చూసినది మొదలు ఆమె తన హృదయాన్నీ, ఆత్మనీ పెనవేసుకుందనీ, సర్వకాలాల్లోనూ అమె ప్రత్యక్ష్యమవుతోందని, ఆమె ఫిడేలు వాయిద్యం, గాన మాధుర్యం తనను తన్మయుణ్ణి చేయగా తాను కూడా ఆ ఫిడేలందుకుని తనకు గల విద్యనంతయు ప్రదర్శించినానని, అంతటి అందగత్తెకు తాను తగునా అన్న సందేహం; జమిందారీ కుటుంబంలో పుట్టిన రాచపట్టి సామాన్యకుటుంబీకులైన తమతో కలవగలదో లేదోనన్న అనుమనం వ్యక్తపరుస్తూ మిత్రులైన పరమేశ్వరానికి, రాజారావుకూ జాబులు రాస్తాడు నారాయణరావు. వారిద్దరి కుటుంబాల మధ్యన ఉన్న సాంస్కృతిక విభిన్నతలను గూర్చి అప్పటికే ఆందోళన కలుగుతుందతనికి. రాజమహేంద్రవరములో శారదా నారయణరావుల వివాహం అత్యంత వైభవముగా జరుగుతుంది. కుటుంబాలతో విచ్చేసిన నారాయణరావు అంతరంగిక మిత్రులందరకూ అతని బావ లక్ష్మీపతి చక్కని అతిథిమర్యాదలు చేస్తాడు. వివాహక్రతువులో ఏదో మహత్తు ఉన్నట్లు, మూడుముళ్ళు పడినప్పటినుండీ ఎక్కడెక్కడో ప్రవహించి వచ్చిన తమ జీవితాలు ఒక ప్రవాహమై కలిసిపోయినట్లు, పెళ్ళి మంత్రములు తామ జీవితాలను ఏకం చేస్తునట్లు, బ్రాహ్మణులు తమ ఇరువురి జీవితాలకు అంటుకట్టి ఏకవృక్షం చేస్తున్నట్లు తోస్తోందని మిత్రునితో చెప్తాడు నారాయణరావు.

పెళ్ళిఊరేగింపు కూడా కన్నులపండుగగా వైభవముగా జరుగుతుంది. కానీ జమిందారు కుటుంబీకులు నాగరీకులు అవుటచేత మగపెళ్ళివారి పల్లెటురితనం వారికి మోటుగా తోస్తుంది. మగపెళ్ళివారి అలంకరణ, పెళ్ళిపాటలు, వారి పెళ్ళి తంతు అన్నీ కూడా చాదస్తాలుగా, మోటుతనంగా తోస్తాయి ఆడపెళ్ళివారికి. శారదను తన మేనల్లునకు ఇవ్వలేదనే అక్కసుతో వరదకామేశ్వరి వియ్యాలవారిని ఆడిపోసుకోవడానికి ఒక్క అవకాశమునీ వదలక, శారద పసిమనసులో అత్తింటివారిపై చిన్నచూపు, అయిష్టత కలిగేలా మాట్లాడి; విముఖతను పెంచుతూ ఉంటుంది. మేనత్త అలుసుతో ఆమె బావ జగన్మోహనరావు కూడా శారదకు దగ్గరవ్వాలనే ప్రయత్నాలు చేస్తూ, ఆమెకు ఏవగింపు మాటలు చెప్తూ ఉంటాడు. భర్త ఔన్నత్యాన్నీ, అత్తింటివారి ఉదాత్తహృదయాలనూ గుర్తించదు ఆమె. గుర్తించేంతటి మానసిక పరిపక్వత ఆమెకప్పటికి రాదు.

పునస్సంధాన మహోత్సవ సమయములో "నాకు ప్రేమ లేదు" అని శారద చెప్పినప్పటి నుండీ లోలోపలే కుమిలిపోతాడు తప్ప ఆ సంగతి ఇతరులకు తెలియనివ్వడు నారాయణరావు. విరక్తితో సంగీత సాహిత్యాలపై మనసు పోక తండ్రి అనుమతి అడిగి, మిత్రుడు పరమేశ్వరమూర్తితో ఉత్తరాది యాత్ర చేసేందుకు బయల్దేరుతాడు. అతడు యాత్రకు తీసుకొనిపోతున్న వస్తువుల జాబితా అతడెంత జాగ్రత్తపరుడో, ముందుచూపు కలవాడో తెలుపుతుంది. యాత్రలో భాగంగా కోణార్క, భువనేశ్వరము, శ్రీకూర్మము, కలకత్తా, బుద్ధగయ, కాశీ, సారనాథ్, ప్రయాగ, అలహాబాదు,లక్నో,హరిద్వారము,హృషీకేశము,ఢిల్లీ, ఆగ్రా,మధుర మొదలైన ఎన్నో పుణ్యక్షేత్రములను అందుగల దేవాలయములను దర్శిస్తారు మిత్రులిద్దరూ. తిరిగి వచ్చాకా కాశీ సంతర్పణ చేయగా జమిందారుగారు సకుటుంబసమేతంగా విచ్చేసి వియ్యాలవారిని ఆశ్చర్యపరుస్తారు. అప్పుడందరికి తమ యాత్రా విశేషాలను, ప్రకృతి అందాలను, భారతీయ, ఆంధ్రదేశ శిల్పకళానైపుణ్యమును గురించీ వర్ణిస్తు ఉపన్యసిస్తారు నారాయణరావు, పరమేశ్వరమూర్తి. యాత్రా విశేషాలనుపన్యసిస్తున్న భర్తను చూచి శారదకు ఆనందం కలుగుతుంది. అక్కగారు శకుంతలాదేవి మాటలు కూడా ఆమె మనసును కదుపుతాయి. ఆమెలో భర్తకు చేరువయి ప్రేమించగల పరిపక్వత ఎలా వచ్చింది అనేది మిగిలిన కథలో తెల్పుతారు బాపిరాజు.

అత్తవారింట జమిందారుగారొక్కరే నారాయణరావుతో అత్యంత ఆత్మీయంగా వ్యవహరిస్తారు. నారాయణరావు వ్యక్తిత్వం, అతని గుణగణాలు, ధీరత్వమే మెల్లమెల్లగా ఆ ఇంటిలోనివారికి అతడి పట్ల మమకారానురాగాలు కలిగేలా చేస్తాయి. హేళన చెయ్యాలని అతని జైలు జీవితం గురించి వివరాలడిగిన అతని తోడల్లుడు విశ్వేశ్వరరావుకు నారాయణరావు శూరత్వము గురించి విన్నాకా అతనిపై గౌరవము ఏర్పడుతుంది. జ్వర తీవ్రతతో మంచాన పడ్డ అతని అత్తగారు అతని సేవలవలన కోలుకుని అల్లుని ఔదార్యం తెలుసుకుంటుంది. భార్యకు తనయందు ప్రేమ లేదని మధనపడుతున్నా, ఆమెలో పరివర్తన కలుగుతుందని ఎదురుచూస్తాడు నారాయణరావు. శారదనెంతగా ప్రేమిస్తున్నాడో ఆమెకు తెలియనివ్వకుండా చెల్లెలు సూరీడుకీ, భార్యకూ చదువు కూడా చెప్తాడతను. అతని సరళమైన బోధనావిధానాన్ని చూసి ఆనందపూర్ణురాలౌతుంది శారద. శ్యామసుందరీదేవి వంటి సుందరీమణి, విద్యాపారంగతురాలు, సంగీతజ్ఞురాలు పరిచయమైనప్పుడు ఆమెను సోదరిగా ప్రేమిస్తాడే తప్ప ప్రలోభపడి తప్పుదోవ పట్టడు నారాయణరావు. అంతటి నిగ్రహపురుషుడతను. కొత్తపేటలో ఇళ్లంటుకున్నప్పుడు నారాయణరావు ప్రాణాలొడ్డి జనులను కాపాడిన సాహసం అతనిలోని సేవాతత్పరతను, సామాజిక బాధ్యతను తెలుపుతుంది. ఆ సంఘటనే శారదలో మార్పుని వేగవంతం చేస్తుంది.

గాడితప్పబోయిన తన అక్కచెల్లెళ్ల జీవితాలను సరిచేయడంలో నారాయణరావు సమయస్ఫూర్తి, శక్తిసామర్థ్యాలు కనబడతాయి. ఆఖరి చెల్లెల్లు సూర్యాకాంతమ్మ భర్త రామచంద్రరావు ఉన్నత చదువులకని ఎవరికీ చెప్పకుండా రంగూన్ వెడతాడు. వారిద్దరి అనుబంధం బలహీనపడకూడదని భార్యాభర్తలిరువురూ ఉత్తరప్రత్యుత్తరాలు, ఛాయాచిత్రాలూ ఒకరికొకరు పంపుకునే ఏర్పాటు చేస్తాడు నారాయణరావు. భర్త పాశ్చాత్యదేశాల నుండి వచ్చేసమయానికి చెల్లెలు కూడా పాశ్చాత్యవిద్యలలో ప్రవీణురాలు కావాలని ఆమెకు గురువును నియమించి, చదువుకొనసాగేలా చేస్తాడతను. రెండవ అక్కగారు సత్యవతి భర్త వీరభద్రరావు కఠిన హృదయుడు. అందగత్తె అయిన భర్యను ఎప్పుడూ అనుమానిస్తూ, నిందిస్తూ, చావబాదుతూ ఉంటాడు. నారాయణరావు ఒకమారు పెద్దాపురం వెళ్ళి ఎంతో ఓర్పుతో బావకు హితబోధ చేసి అతనిలో మార్పు తేవ ప్రయత్నిస్తాడు. కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ అక్కగారిని భర్త సృహతప్పేలా కొట్టాడని తెలుసుకుని ఉగ్రుడై మరల అక్కగారి ఊరు వెళ్ళి చిన్న నాటకమాడి బావగారికి రెండు దెబ్బలు తగిలించి, భయపెట్టి, అతనికి గౌరవమిస్తూనే బుద్ధి తెచ్చే ప్రయత్నం చేస్తాడు.

నారాయణరావు విషయపరిజ్ఞానం మరియు ప్రజ్ఞాపాటవాలు అన్నీ నవలలో అక్కడాక్కడా జరిగే చర్చల ద్వారా పాఠకులకు తెలుస్తూ ఉంటాయి. క్రీడలు, ఆంగ్ల సాహిత్యం, ఆంగ్ల చిత్రాలు, ఆంగ్ల నటీనటులు, చిత్రలేఖనం, సంగీతం, నాట్యం మొదలైన కళాత్మక విషయాల గురించిన అవగాహనే కాక, మిత్రుడు రాజారావుతో వేదాంత చర్చలు; ఇతర మిత్రులతో, జమిందారుతో రైల్వేల పనితీరు గురించి; స్త్రీపురుష సంబంధాలు, హిందూ వివాహవ్యవస్థ ప్రాశస్త్యం, స్వేచ్ఛాజీవనం వల్ల కలిగే అనర్థాల గురించీ ; 'ఆంధ్ర నవకవి సమితి' సభలో శిల్పకళానైపుణ్యమును గురించిన ఉపన్యాసం; బిచ్చగాళ్ళు, వారితో అంతరించిపోతున్న కొన్ని యాచక కళలు మొదలైన విభిన్నమైన అంశాలపై జరిపే చర్చలు నారాయణరావుకు గల ప్రాపంచిక జ్ఞానాన్ని తెలిపి మనల్ని అబ్బురపెడతాయి.

నారాయణరావు పాత్రచిత్రణలో ఎటువంటి లోపాలనూ అందివ్వలేదు బాపిరాజు. లోపాలెంచలేని ఉత్తమపురుషుడతడు. నవలానాయకుడికి మంచితనము, ఉత్తమ విలువలతో పాటుగా కొద్దిపాటి లోటుపాట్లు, బలహీనతలు ఉంటేనే పాఠకుల మనసులకతడు దగ్గరగా రాగలడు అన్న సిద్ధాంతాన్ని మార్చివేస్తూ, తాను చిత్రకారుడు కాబట్టి ఎంతో జాగ్రత్తగా వేసుకున్న పరిపూర్ణమైన చిత్రంలా నారాయణరావు పాత్రను బాపిరాజు మలచడం ప్రశంసనీయం.

# శాంతినికేతన్ - రాజా




తను కాలేజీలో ఉండగా ఓ సీరియల్ చదవడానికి వారం వారం 'ఆంధ్రప్రభ వారపత్రిక' కోసం ఎలా ఆత్రంగా వేచి ఉండేవారో.. పత్రిక కొనగానే అక్కడే అరుగు మీద కూచుని గబగబా కథ ఎలా చదివేసేవారో.. ఈ కథని సినిమాగా తీస్తే బావుంటూందని ప్రతి పాత్రకూ ఏ నటీనటులైతే నప్పుతారో అని మిత్రులతో జరిపిన చర్చలు.. మొదలైన కబుర్లన్నీ కథలు కథలుగా చెప్పేవారు నాన్న చిన్నప్పుడు. అంత ఇష్టంగా ఉండేదిట ఆ సీరియల్ ఆ రోజుల్లో వాళ్ళందరికీ! పత్రికలోని సీరియల్ తాలూకూ పేపర్ కట్టింగ్స్ నాన్న భద్రంగా దాచి ఉంచితే, తర్వాత అవన్నీ బౌండ్ చేయించి పుస్తకంలా దాచి ఉంచింది అమ్మ. ఈ వ్యాసంలోని చిత్రాలు ఆ పుస్తకం లోనివే! అవి కూడా బాపూ వేసినవి. ఇప్పటి త్రీడీ చిత్రాల్లా డెప్త్ కనిపించేలా ఉండేది ఆ చిత్రాల్లోని బాపూ ఫ్రేమింగ్. అలా పుస్తకాల షెల్ఫ్ లో ఉండే "శాంతినికేతన్" నవల నాకు చిన్నప్పుడు పరిచయమైంది. తర్వాత ఓ వేసవి సెలవుల్లో పరిచయమయ్యారు శాంతి, రాజా కూడా! వాళ్ళే కోడూరి కౌసల్యాదేవి రచించిన "శాంతినికేతన్"లో నాయికానాయకులు.

అరవైల్లో తెలుగు నవలా సాహిత్యంతో పరిచయమున్నవారిలో "కోడూరి కౌసల్యాదేవి" పేరు తెలియని పాఠకులు అరుదుగా కనిపిస్తారు. "కోడూరి" ఇంటిపేరు ఆవిడ వివాహమయ్యాకా "ఆరికెపూడి" అయ్యింది. అప్పుడు రచనలపై "ఆరికెపూడి(కోడూరి) కౌసల్యాదేవి" అని వచ్చేది. కౌసల్యాదేవి నవలల్లో కొన్ని సినిమాలుగా కూడా వచ్చాయి. వాటిలో **ప్రేమ్ నగర్, డాక్టర్ చక్రవర్తి, శంఖుతీర్థం** బాగా ప్రజాదరణ పొందాయి. ఆవిడ నవలల్లో ముఖ్యంగా కనబడేవి బలమైన స్త్రీ పాత్రలు, వ్యక్తులను అధిగమించి జీవితాల్ని మార్చివేసే విధి విలాసాలు. చిత్రమైన విధి మనుషుల జీవితాల్ని ఎక్కడ నుంచి ఎక్కడికి తీసుకెళ్లగలదు, ఎన్ని మలుపులు తిప్పగలదు అనే సత్యమే కోడూరి నవలల్లో అంతర్లీనంగా కనబడే నేపథ్యం. ఆవిడ రచనల్లో నాకు బాగా నచ్చేవి **శాంతినికేతన్, శంఖుతీర్థం**. కౌసల్యాదేవి గారి నవలల్లో స్త్రీ పాత్రలు చాలావరకూ ఉదహరించతగ్గట్టుగా, ఉత్తమ లక్షణాలు కలిగిఉంటాయి. "శాంతినికేతన్" నవలలో మాత్రం నాయకుడు "రాజా" నాయిక శాంతితో సరిసమానమైన ఉత్తమ వ్యక్తిత్వం కలిగి, ఓ దశలో శాంతి కన్నా ఎక్కువగా ఓ మెట్టు ఎదిగి, పాఠకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంటాడు.

నవల చివరి భాగం కాస్తంత నాటకీయంగా అనిపించినా కౌసల్యాదేవి చేసిన పాత్రల చిత్రణ చాలా బావుంటుంది. భార్యాభర్తల అనురాగబంధాన్ని చూపిస్తూనే ఓ కొడుకు కోడలు ఇలా ఉండాలని తెలియచెప్పేలా ఉంటాయి పద్మ-శ్రీధర్ల పాత్రలు. ఉమ్మడికుటుంబాల్లో ఆప్యాయతానురాగాలతో పాటూ, తల్లిదండ్రులు పిల్లల పట్ల ఎలా వ్యవహరించాలో బలరామయ్యా-లక్ష్మీదేవిల పాత్రల ద్వారా చెప్తారు కౌసల్యాదేవి. శాంతి, రాజా అయితే చదివిన ప్రతిసారీ ఆప్తబంధువుల్లా అనిపిస్తారు నాకు. నే కాలేజీలో ఉండగా మేము కలకత్తా

వెళ్ళినప్పుడు "దక్షిణేశ్వర్" చూస్తూ.. ఇక్కడే కదా శాంతిని రాజా మొదటిసారి చూసినది.. అనుకోవడం, **శాంతినికేతన్** చూస్తున్నప్పుడు పుస్తకంలో శాంతి చెప్పిన కబుర్లు, సంఘటనలు గుర్తుకుతెచ్చుకోవడం.. మరచిపోలేని ఊసులు! అసలా పుస్తకం ద్వారానే నాకు టాగూర్ మీదా, శాంతినికేతన్ మీద ప్రేమ మొదలైయ్యాయి. ఈ కథను "టివీ సీరియల్ "గా చేసే సాహసం చేసారు. కానీ ఒకటి రెండు ఎపిసోడ్స్ తరువాత నచ్చక మేము చూడటం మానేసాము. అసలు ఊహల్లో ఉన్న పాత్రలలో తెరపై మరో వ్యక్తులను చూడటానికి మనసు అంగీకరించదు ఎందువల్లో. ఆ సీరియల్ మధ్యలో ఆగిపోయినట్లు గుర్తు.

**రాజా:**

"రాజా" పూర్తి పేరు రాజశేఖరం. పొడగరి, చక్కని రూపురేఖలున్న అందగాడు. చూపరులను సమ్మోహనపరిచే చిరునవ్వొకటి అతని పెదాలపై ఎల్లప్పుడూ నాట్యం చేస్తూ ఉంటుంది. అతని మాట మెత్తన, హృదయం నవనీతం. జన్మత: సంస్కారి! **నా** అన్నవాళ్ళు లేని అతడిలో ఉన్న కలుపుగోలుతనమే అతడిలోని అదనపు ఆకర్షణ. వీలయినంత ఇతరులకు సాయపడగలగాలే తప్ప తనవల్ల ఇతరులకు ఏ కష్టం రాకూడదు అనుకునే మనస్తత్వం అతనిది. కథలో మనకు పరిచయమయ్యే సమయానికి ఎమ్మేస్సీ చదివి కలకత్తాలోని ఓ లేబొరేటొరీలో స్టాటిస్టీషియన్ గా పనిచేస్తూ ఉంటాడు. అతడి క్లాస్మేట్, ప్రాణస్నేహితుడు శ్రీహరి.

కలకత్తా చూడటానికి వచ్చిన తన చెల్లెలు శాంతికి శ్రీహరి ఊరు చూపిస్తూండగా దక్షిణేశ్వర్ లో అనుకోకుండా రాజాను కలుస్తాడు. అక్కడ మొదటిసారి "చెక్కిట చెయ్యి జేర్చి, కాటుక దిద్దిన విశాల నేత్రాలను మరింత విశాలం చేసి, ప్రతిమలలో ఒక ప్రతిమగా కనబడుతున్న శాంతిని" చూస్తాడు రాజా. అన్నగారి స్నేహితుడని తెలిసాకా శాంతి కూడా అతనితో ఎంతో స్నేహంగా మెలుగుతుంది. తనలాగానే ఆమె కూడా చిత్రకారిణీ అని తెలిసి తానింతకాలంగా ఎదురుచూస్తున్న కలలరాణి ఆమేనేమో అని ఆశపడతాడు రాజా. ఎంతో ప్రేమగా తన హృదమంతా నింపి చిత్రీకరించిన అందమైన శాంతి చిత్రాన్ని , అంతవరకూ ఎవరికీ ఇవ్వకుండా దాచుకున్న అపురూపమైన రవీంద్రుడి చిత్రాన్నీ శాంతికి బహుకరిస్తాడు. అతని ఆసక్తి గమనించి, వారిద్దరికీ వివాహం జరిగితే బాగుండునని అభిలషించి, రాజా అంగీకరం తెలుసుకుని అప్పటికప్పుడు తల్లిదండ్రులను రప్పిస్తాడు శ్రీహరి. రాజాను చూసి, కుమార్తెకు తగ్గ ఈడూజోడూ అని శ్రీహరి తల్లిదండ్రులు కూడా ఎంతో సంతోషిస్తారు.

అయితే ఈ సంగతులన్నీ తెలియని శాంతి పెళ్ళి విషయం వినగానే ఉలిక్కిపడుతుంది. తన అంగీకారం అడగకుండా అంతా కుట్ర పన్నారని ఆగ్రహపడుతుంది. ఆమె ఆలోచనలే వేరు! తండ్రి గారంతో అల్లారుముద్దుగా పెరిగి, ఇంటి వద్దనే ఆంగ్లో ఇండియన్ టీచర్ ద్వారా చదువుకుంటుంది ఆమె. వారింట్లో ఆమె నిర్ణయాలకు ఎదురు లేదు. తన ఆంగ్లో ఇండియన్ టీచర్ రవీంద్రునిపై చెప్పిన పాఠాలు విని, ఆయన రచనల గురించి విని, గురుదేవులపై అత్యంత అభిమానం పెంచుకుని, శాంతినికేతన్ లో ఆయన స్థాపించిన విశ్వభారతిలో చేరి చిత్రలేఖనం అభ్యసించాలని కలలు కంటుంది ఆమె. చదువు, సంస్కారం, మంచి వ్యక్తిత్వం ఉన్నా ఇంకా పరిపక్వతకు రాని మనసామెది. అందువల్ల ఉన్నత మనస్కుడైన రాజానీ, అతడి ప్రేమనీ గుర్తించలేకపోతుందామె. తనకింకా పెళ్ళి మీద ఆసక్తి లేదనీ, అసలా ఉద్దేశమే లేదనీ, తనమానన తనని వదిలేయమని ఇంట్లో వారిని వేడుకుంటుంది. రాజాని కలిసి, అసంకల్పితంగా తానాతనికి ఆశలేమైనా కలిగించి ఉంటే

క్షమించమని, ఒక మంచి స్నేహితుడిలా మాత్రమే రాజాను చూసాననీ చెప్తుంది శాంతి. ఊహించని ఈ తిరస్కారానికీ, ఆమె నిర్ణయానికీ ఉలిక్కిపడతారు ఆమె తల్లిదండ్రులు. రాజా అయితే నిరాశతో కృంగిపోతాడు.

శాంతి ఇంట్లో అంతా శాంతి నిర్ణయానికి వ్యతిరేకులై, నిరసన తెలిపినా రాజా మాత్రం ఆమెతో స్నేహంగానే మసలుతాడు. శాంతి కోరిక ప్రకారం ఆమెను శాంతినికేతన్ లో చేర్పించడానికి శ్రీహరిని ఒప్పిస్తాడు. తాను కూడా శ్రీహరితో వెళ్ళి శాంతిని అక్కడ దిగబెట్టి అన్నిరకాల జాగ్రత్తలూ చెప్పి వస్తాడు రాజా. రాజా వ్యక్తిత్వంలోని ఉదాత్తత మొదటిసారిగా ఈ సందర్భంలో పాఠకులకు తెలుస్తుంది. తన వ్యాకులతను పైకి కనబడనీయకుండా ఔన్నత్యంతో తమకు సహాయపడిన మిత్రుడితో బంధుత్వం కలుపుకోలేనందుకు శ్రీహరి లోలోపలే కుమిలిపోతాడు. పైకి మామూలుగా కనబడ్డా, శాంతి తిరస్కారం రాజాలో ఎంతో మార్పుని తెస్తుంది. చలాకీతనం పోయి గాంభీర్యం, ఉదాసీనత చోటు చేసుకుంటాయతనిలో. వ్యాకులపడి భగ్నప్రేమికుడైపోతాడతను.

భవిష్యత్తులో కూడా వివాహానికై విముఖత తెలియజేసిన శాంతి నిర్ణయం ఆమె తల్లిదండ్రులను కదిలించివేస్తుంది. అనుకూలవతి అయిన తన భార్య పద్మని దిగులుతో ఉన్న తల్లిదండ్రులకు తోడుగా పంపించి, రాజా కోరికపై తన నివాసాన్ని అతడింటికి మారుస్తాడు శ్రీహరి. ఓ నిజమైన మిత్రుడిలా శాంతి యోగక్షేమాలు కనుక్కుంటూ, ఆమెపై ఆగ్రహంతో ఉన్న శ్రీహరికీ శాంతికీ మధ్య వారధిలా నిలబడతాడు రాజా. కానీ ఎప్పుడూ పెదాలపై ఉండే చిరునవ్వును మరిచి, రాత్రిళ్ళు ఒంటరిగా దు:ఖించే రాజాను, అతడు పడుతున్న వేదనను చూసి భరించలేకపోతాడు శ్రీహరి. తనవల్ల స్నేహితుడికి ఇంత మనోవేదన ఎదురైందనే బాధతో అతడికి దూరంగా ఉంటే శాంతిని మరువగలడేమో అని భావించి, స్వస్థలానికి దగ్గరగా ఉద్యోగం వెతుక్కుని వెళ్ళోతాడు శ్రీహరి.



విశ్వభారతి చల్లనినీడలో, మనోరమ అనే సహృదయ స్నేహంతో నెమ్మది నెమ్మదిగా ప్రపంచాన్ని తెలుసుకోవడం మొదలెడుతుంది శాంతి. అప్పటిదాకా పూమొగ్గలా ఉన్న ఆమె హృదయం వికసించడం మొదలుపెడుతుంది. అయితే ఏమరుపాటులో తప్పటడుగు వేసి గోవిందరావనే ధూర్తుడిని ప్రేమిస్తుంది. విషయాన్ని అర్థంచేసుకున్న రాజా ఏమాత్రం అసూయపడక ఆమెకు అభినందనలు తెలుపుతూనే ఎన్నో జాగ్రత్తలు చెప్తాడు. గోవిందరావు దుశ్శీలతని కనిపెట్టినవాడై, ఒంటరిగా ఉండాల్సివచ్చినా ఎన్నడూ తొందరపడవద్దని శాంతి వద్ద మాట తీసుకుంటాడు. ఈ విషయంలో ఏమాత్రం అసూయపడని రాజా సంస్కారాన్ని చూసి ఆశ్చర్యపోతుందామె! సదా తన క్షేమం కోరే ఆ స్వచ్ఛమైన మానవుణ్ణి చూసి శాంతి చలించిపోతుంది. రాజాలోని ఔన్నత్యం మరోసారి బయటపడుతుంది.

ఇంటివద్ద అందరినీ గోవిందరావుతో తన వివాహానికి ఒప్పించి కోటి ఆశలతో అన్నతో పాటుగా కలకత్తా చేరిన శాంతికి గోవిందరావు నిజస్వరూపమూ, తిరస్కారం ఎదురవుతాయి. యాదృచ్ఛికంగా అక్కడ వారిని రాజా కలుస్తాడు. విషయం గ్రహించి, ఖిన్నుడైన శ్రీహరికీ, విచలితురాలైన శాంతికీ అండగా నిలిచి ఓదారుస్తాడు. రాత్రికి రాత్రే శాంతినికేతన్ వెళ్ళి గోవిందరావు వివరాలు సేకరించుకువస్తాడు.

వివాహానికి పూర్వమే అతని నిజస్వరూపం తెలిసినందుకు శాంతి అదృష్టవంతురాలని చెప్పి వారికి ఊరట కలిగిస్తాడు. ఆవేదనతో కృంగిపోవద్దని ధైర్యాన్ని నూరిపోస్తాడు. తాను రాజాని తిరస్కరించినప్పుడు అతనెంత బాధపడి ఉంటాడో మొదటిసారిగా అవగాహనలోకి వస్తుంది శాంతికి. అతని వంటి ఆప్తమిత్రుడిని పొందినందుకు ఆనందపడుతుంది. వాళ్ళని ఊరికి పంపేసాకా రాజా ఇక ఆ ఊళ్ళో ఉండలేక ఉద్యోగం వదిలి వెళ్ళిపోతాడు. విషయం తెలిసి రాజా ఆచూకీ కోసం ప్రయత్నిస్తారు అన్నాచెల్లెళ్ళు. అతని క్షేమాన్ని కోరే తన మనస్థితిని గ్రహించుకో ప్రయత్నిస్తుంది శాంతి. కొద్దిరోజులకు శ్రీహరి మిత్రుని ద్వారా రాజా వివరం తెలిసి చాలా సంతోషిస్తుందామె. శాంతి స్నేహితురాలు మనోరమ తన భర్త శేఖర్ కు శాంతి గురించి రాజా రాసిన ఉత్తరాన్ని శాంతికి పంపిస్తుంది. అది చూశాకానే రాజా సహృదయత, అతని మంచితనం ఇంకా బాగా అర్థమవుతాయి ఆమెకు. ఎన్నోఆశలతో అతనికి జాబు రాస్తుంది కానీ రాజా నుండి జవాబు రాకపోయేసరికీ తనను స్వీకరించడం అతనికి ఇష్టం లేదేమో అని చిన్నబుచ్చుకుంటుంది.

అహంకారి అయిన శాంతి చిన్నవదిన శ్యామల ప్రవర్తన ఆ కుటుంబంలో కల్లోలం రేపుతుంది. ఆదర్శవంతమైన ఆ కుటుంబం చీలిపోతుంది. చాదస్తురాలనుకున్న పెద్దవదిన పద్మ నిండుకుండ అని అప్పటికి అర్థంచేసుకోగలుగుతుంది శాంతి. శాంతి వ్యక్తిత్వంలో, ఆలోచనల్లో ఎంతో మార్పు వస్తుంది. రాగద్వేషాలకు అతీతంగా నిర్మలంగా మారిపోతుందామె. ఈ కలతలు రేగిన సమయంలో శ్రీహరి మాట మన్నించి రాజా మరోసారి వారింటికి వస్తాడు. చిక్కిపోయి, రూపురేఖలు మారిపోయిన రాజాను చూసి కలతపడతాడు శ్రీహరి. అనుకోకుండా అక్కడ ప్రత్యక్ష్యమైన శ్రీహరి మామగారు అతని మరదలు జయను రాజాకు అడగమని కోరతారు. చెల్లెలిలో మార్పుని గమనిస్తున్న శ్రీహరి మామగారి మాటను కాదనలేక, సందేహిస్తూనే పెళ్ళిప్రస్తావన చేస్తాడు రాజా వద్ద. విచిత్రంగా రాజా పెళ్ళికి ఆంగీకరిస్తాడు! ఈ వార్త అశనిపాతంలా తాకినా.. నవ్వుతూ వెళ్ళి అభినందనలు తెలుపుతుంది శాంతి. అంతటి స్థిరచిత్తం ఏర్పడుతుందామెలో. ఆ సమయంలోనే అనుకోకుండా గోదారొడ్డున దొరికిన ఏకాంత క్షణాల్లో శాంతి, రాజా మాట్లాడుకోవడం జరుగుతుంది. తమ ఉత్తరాలు ఒకరికొకరివి అందలేదనీ.. అదే రాజాలో అపార్థానికి తావైందని తెలుసుకుని విచారపడుతుంది శాంతి. అపార్థాలన్నీ తొలగిపోయేలా ఆ పవిత్రహృదయాలు తమతమ వ్యథలన్నీ పంచుకుని, భారమైన మనసులతో వీడ్కోలు చెప్పుకుంటారు.

ఉత్తరాల గల్లంతుకు చిన్నవదిన శ్యామల కారణమన్న శాంతి ఊహ నిజమౌతుంది. తన వద్దనున్న శాంతి ఉత్తరాన్ని జయకు చూపి, ఆ పెళ్ళి వద్దని జయ పేచీపెట్టడానికి కారణమౌతుంది శ్యామల. ఆ రాద్ధాంతం, కేకలు విని వికలమనస్కుడై రాజా అక్కడ నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోతాడు. గతాన్ని దృష్టిలో ఉంచుకుని రాజాతో ఉత్తరప్రత్యుత్తరాలు జరపవద్దని శాంతిని వారిస్తాడు శ్రీహరి. అడుగడుగునా ఎదురౌతున్న ఈ అవాంతరాలనూ, ఒడిదొడుకులనూ తట్టుకుని నిలబడుతుంది శాంతి. దానికి కారణం రాజా ఇచ్చిన మనస్థైర్యమే అంటుందామె. శ్రీహరి కుటుంబంలో రేగిన కలతలు దూరమౌతాయా? తన మనసునే శాంతినికేతన్ గా మార్చిన రాజాని శాంతి చేరుకోగలిగిందా? అడ్డంకులు తొలగి ఎప్పటికి శాంతి, రాజాలు ఒకటౌతారు? మొదలైన ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే.. మరి నవల చదవాల్సిందే!

ఈ విధంగా శాంతి జీవితంలో ప్రవేశించింది మొదలు ఆమె క్షేమాన్నే కాంక్షిస్తాడు రాజా. తనను తిరస్కరించినప్పటికీ, తనలో తాను కుమిలిపోతాడు తప్ప శాంతిని పల్లెత్తుమాట అనడు. అన్నాచెల్లెళ్ళిరువురితో తన స్నేహధర్మాన్ని కాపాడుకుంటూ అడుగడుగునా

ఆపదల నుండి శాంతిని రక్షిస్తాడు. శాంతి గోవిందరావునిష్టపడినా ఏమాత్రం అసూయపడడు. ఆమె మోసపోయినప్పుడు కూడా ఆత్మీయుడిలా ధైర్యాన్నందిస్తాడు. ఆమెలో మార్పు రాగలదనే ఆశతో ఉంటాడు. **శశి** అనే స్త్రీ ద్వారా తనపై కొన్ని అపవాదులు పడినా, తానే ఉద్యోగం వదిలి వెళ్ళోతాడు తప్ప శశి తప్పిదాలను తూలనాడడు. స్త్రీలకు అతనిచ్చే గౌరవం అటువంటిది. తన ఉత్తరానికి శాంతి జవాబు రాయలేదనే కోపంతో జయతో పెళ్ళికి ఒప్పుకుంటాడు. నిజమూ, శాంతి మనసూ తెలిసాకా బాధపడినా అదే విధి నిర్ణయమేమోనని సరిపెట్టుకుంటాడు. జయ పెళ్ళివద్దని రాద్ధాంతం చేస్తున్నప్పుడు బయటనుండి విని మౌనంగా నిష్క్రమిస్తాడు తప్ప అక్కడ చర్చల్లోకి దిగడు. తన వ్యక్తిత్వాన్నో, మంచితనాన్నో నిరూపించుకోవాలని ప్రయత్నించడు. అంతటి సంస్కారి.

నవల చదివి ఎన్నేళ్ళైనా శాంతి–రాజాలను మర్చిపోలేము! సహృదయతకూ, నిష్కల్మషమైన మనసుకూ, సంస్కారవంతమైన వ్యక్తిత్వానికీ ప్రతీకైన "రాజా" వంటి స్నేహితుడుంటే బాగుండుననో... ఇటువంటివారు నిజజీవితంలో కూడా తారసపడకూడదూ.. అనో నవల చదివిన ప్రతి ఒక్కరికీ అనిపించకుండా ఉండదు. అలా అనిపించటమే 'రాజా' పాత్రలోని ఔన్నత్యం.




# విశాలనేత్రాలు: రంగనాయకుడు

కార్తీక పూర్ణిమ నాడు ప్రొద్దుటే సరిగంచు కంచి ఉత్తరీయం వల్లెవాటుగా వేసుకుని, కుడి ముంజేతికి శ్రీరంగం – మల్లయుద్ధ ప్రవీణులు అతడిని మెచ్చుకుని బహూకరించిన సింహతలాటంతో మెరుస్తున్న పైడి కడియం – కొంచెం బిగువుగా ధరించి; పూజా ద్రవ్యాలతో, వివిధ పుష్పాలతో నిండిన బంగారు పళ్ళెంలో మొక్కుబడి కానుకలు అయిన 'పైడితిలకము, సువర్ణ విలోచన యుగళి' పట్టుకుని, ఎండపొడకి పూజాపుష్పాలు వాడకుండా పందుమొగలి రేకులతో, లేత లేత తాటి మొవ్వుల ఆకులతో, శ్రీచందనం చేవకామతో తయారుచేయించిన పెద్ద గొడుగు ఎడమ చేతితో పట్టుకుని శ్రీరంగం వీధిలో నడక సాగిస్తాడు రంగనాయకుడు. అతని అడుగులలో అడుగులు వేస్తుంది హేమసుందరి. లేత చిలకపచ్చ మధుర పట్టుచీర కట్టి, లేత ఊదా రంగు రవిక తొడిగి, రకరకాల ఆభరణాలు ధరించి, సుదీర్ఘమైన శ్రీచూర్ణ తిలకానికి ఆధారంగా, కమ్మ కస్తూరి కద్దిన కుంకుమ రేఖ చిన్నరి నెలవంక ఆకారంలో దిద్దుకుని, రంగనాయకుడు పట్టుకున్న గొడుగు అంచులకున్న మువ్వల సవ్వడితో తన కాలి అందెల ఘలఘలలు కలసిపోతూండగా అతని అడుగుజాడల్లో ముందుకు సాగుతుంది హేమసుందరి.

ఈ సన్నివేశం తాలూకా మనోహరమైన దృశ్యమే శ్రీ పిలకా గణపతి శాస్త్రి రచించిన నవల "విశాల నేత్రాలు" ముఖచిత్రంలో ఉన్న బాపూబొమ్మ. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్న ఈ నవల మొదట ఆంధ్రపత్రికలో 1965,66 ప్రాంతాల్లో బాపూగారి మనోహర చిత్రాలతో ధారావాహికంగా వెలువడి అసంఖ్యాకులైయిన పాఠకుల మన్ననలు అందుకుంది. తాను రచించిన ఈ

చారిత్రాత్మక నవలను "లైఫ్ ఆఫ్ రామానుజ" అనే ఆంగ్ల గ్రంధం, మరికొన్ని సంస్కృత, ఆంగ్ల గ్రంధాలను పరిశీలించి రచించినట్లు "ముందు మాట"లో గణపతి శాస్త్రిగారు చెప్తారు. వారు సంస్కృతం, తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలలో పండితులు. కథకులు, నవలా రచయిత, అనువాదకులు, పత్రికా సంపాదకులు కూడా. ఈ "విశాల నేత్రాలు" నవలలో కథానాయిక హేమసుందరి, కథానాయకుడు రంగనాయకుడు!

**రంగనాయకుడు:**

క్రీస్తుశకం 11వ శతాబ్ది ఉత్తరార్ధంలో, దక్షిణ భారతంలో, న్యాయమైన ప్రజాపాలనలో ప్రసిద్ధి కెక్కిన కాంచీరాజ్యంలోని నిచుళానగరంలో "విశాల నేత్రాలు" కథ ప్రారంభం అవుతుంది. నిచుళానగర పొలిమేరలో నివసిస్తున్న ఓ చిన్న భూస్వామి వెంకటనాయకుని మూడవ కుమారుడు రంగనాయకుడు. ఇంకా ఇరవై ఐదో ఏడు నిండకపోయినా బలిష్ఠ దేహంతో, మూడు పదులు నిండీ నిండనట్లు కనబడతాడు. 'విశాలమైన నెన్నుదురు, కొనలు తేరిన కనుదోయితో, కొంచెం లేతరంగు ఎర్రమన్ను పైపూతతో మెళవించిన శరీరచ్చాయతో' ఏ ఆడపిల్లనైనా ఇట్టే ఆకట్టుకోగల రూపం రంగనాయకుడిది. చదువుసంధ్యలబ్బకపోయినా, చిన్ననాటి నుండీ నేర్చుకున్నందువల్ల సాముగారడిలో మంచి నైపుణ్యం సంపాదిస్తాడతను. విలువిద్యలో కూడా ప్రవేశం ఉంది. తండ్రి ఉపేక్ష, తల్లి గారాబం వల్ల మొండితనం అలవడి తనకెంత తోస్తే అంత చేయడమే తప్ప ఇతరులమాట చెవికెక్కించుకునే స్వభావం లేదతనికి. ఇద్దరన్నల వలే తమ పొలంపనుల వైపు శ్రద్ధ పెట్టమనే తండ్రి పోరు పట్టించుకోడు అతగాడు. అతనికెంత సేపూ సాముగారడీలే అరాధ్యదైవాలు. దుందుడుకు చేష్టలే తప్ప బరువుబాధ్యతలు పట్టని స్వేచ్ఛావిహారి అతడు. ఇలాగ, కథా ప్రారంభంలో ఏ విధమైన ఉత్తమ లక్షణాలూ లేని సామాన్య మానవుడిలా పరిచయమౌతాడు రంగనాయకుడు.

కథాగమనంలో చౌర్యం, మధ్యపానం, చెడు స్నేహాలే కాక హత్యాపాతకాన్ని కూడా నెత్తినవేసుకున్న ఈ అజ్ఞుడికి విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించిన శ్రీమద్రామానుజుల అపారానుగ్రహం, శ్రీరంగనాథుని సుదీర్ఘ విశాల విలోచనాల దర్శన భాగ్యం, అష్టాక్షరీ మంత్రోపదేశం మొదలైనవి ఎలా సంక్రమించాయి? రంగనాయకుడి వంటి అజ్ఞుడు జ్ఞానిగా మారగలడా? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్తుంది "విశాల నేత్రాలు" నవల.

నిచుళానగరంలోని గోపాలస్వామి ఆలయ కల్యాణమహోత్సవంలో హేమసుందరితో పరిచయం కలుగుతుంది రంగనాయకునికి. ఆ ఊళ్ళో ప్రసిద్ధికెక్కిన వేశ్య శృంగారమంజరి వద్ద పెరిగిన హేమసుందరి ఆమె కన్న కుమార్తె కాదు. మాణిక్యవల్లి, హేమసుందరి లను అక్కచెల్లెళ్ళలా చిన్నతనం నుంచీ పెంచి పెద్ద చేస్తుంది శృంగారమంజరి. వారిద్దరికీ కాంచీరాజ్యంలో ప్రసిద్ధికెక్కిన నృత్యాచార్యుల వద్ద నృత్యం, వీణా వేణు మృదంగాలలో, గాత్ర సంగీతాలలో చక్కని నైపుణ్యాన్ని నేర్పిస్తుంది. అయితే ఇద్దరిలోనూ హేమసుందరి అందంలో మిన్న. ఇంచుమించుగా ఇరవై నిండిన పైడిబొమ్మ లాంటి హేమసుందరిని ఎవరైనా ఒక మహారాజు ఒద్దికలో ఉంచాలని, వందల కొద్దీ సువర్ణ నాణాలు గుమ్మరింపించుకోవాలని శృంగారమంజరి ఉవ్విళ్ళూరుతుంది. అయితే హేమసుందరిని చూసినది మొదలు కర్ణాభరణాలవరకూ విస్తరించిన ఆమె విశాల విలోచన యుగళికి దాసుడౌతాడు రంగనాయకుడు. అనుక్షణం ఆమె దర్శన భాగ్యానికే తపించిపోతాడతడు. ఆ పై వారిద్దరికీ ఒకరిపైనొకరికి ప్రగాఢమైన అనురక్తి ఏర్పడుతుంది.

ఒకానొకరోజు రాత్రిపూట హేమసుందరిని కలవటానికి శృంగారమంజరి భవంతిలోకి దొంగతనంగా అడుగుపెడతాడు

రంగనాయకుడు. ఆ సుందరి విశాల నేత్రాల లోతులలో మునిగి బాహ్యప్రపంచాన్ని విస్మరిస్తాడు. ఆ మైమరపులో కావలివాళ్ల కంట పడ్డా చాకచక్యంతో వారికి దేహశుద్ధి చేసి చీకట్లో తప్పించుకుంటాడు. అతడు నల్లరంగు పులుముకున్నందున ఆతడెవరైనదీ కనుగొనలేకపోతారు కానీ ఆ గొడవ చిలికి చిలికి గాలివానై నగరమంతా పెద్ద దుమారాన్ని రేపుతుంది. రంగనాయకుని సాహసం ఆ నోటా ఆ నోటా హేమసుందరిని దక్కించుకోవాలనుకునే తిరుమలరెడ్డికి తెలిసి, హేమసుందరి దక్కదేమోనన్న ఉక్రోషంతో తిరుమలరెడ్డి అతనిపై హత్యాప్రయత్నం చేయిస్తాడు. నగర తలవరి ద్వారా రంగనాయకుని ఇంట కూడా అతని ఆగడాలు తెలిసి అది పెద్ద రభసగా మారుతుంది. తండ్రి నిరాదరణ, తరువాత జరిగిన కొన్ని సంఘటనలు, అడుగడుగునా ఎదురౌతున్న ఆటంకాల నేపథ్యంలో హేమసుందరితో కలిసి ఆ ఊరినుంచి పారిపోవాలనే నిర్ణయానికి వస్తాడు రంగనాయకుడు. స్నేహితుని అండా, చేతిలో చిల్లిగవ్వ లేని నిస్సహాయ స్థితిలో శ్రీరంగస్వామిని మనసారా స్మరించుకుని, హేమ తన ఇంట కాలుపెట్టాలనే తన కోరిక నిర్విఘ్నంగా నెరవేరిన పక్షంలో స్వామివారికి "పైడి కనుదోయి, బంగారు తిలకము" కానుకలుగా సమర్పించుకోగలనని మొక్కుకుంటాడు రంగనాయకుడు.

పథకం ప్రకారం ఓ రాత్రిపూట తిరుమలరెడ్డి కాలుకీలు విడదీసి, అతని ఇంట సొమ్ము దొంగలించి, హేమసుందరితో పారిపోతాడు రంగనాయకుడు. కావేరితీరం దాటి శ్రీరంగనగరం చేరుకుంటారు ఇద్దరూ. సూర్య కిరణాల తేజస్సులో తళతళలాడుతున్న శ్రీరంగనాధుని దేవాలయ శిఖరాల కాంచన కలశాలు, ఏడు ప్రాకారాల్లోనూ ఏపుగా పెరిగిన ఉద్యానవనాలను చూసి రంగనాయకుని మనసు సంతోష పారవశ్యాలతో పులకరిస్తుంది. హేమాంబ, ధనుర్ధానులుగా పేర్లు మార్చిచెప్పి, నగర మధ్యలో ఒక చిన్న భవంతి అద్దెకు తీసుకుని అందులో ప్రవేశిస్తాడతను. వివాహపు ఏర్పాట్లు చేస్తున్న రంగనాయకుని సంకల్పాన్ని హేమసుందరి ప్రోత్సహించదు. వారకాంత వివాహానికి తగదని ఆమె నిశ్చల అభిప్రాయం. ఈ సందర్భంలో గతంలో తల్లి బలవంతం మీద ఒక సామంత ప్రభువుతో హేమసుందరికి కలిగిన అనుబంధం గురించి విని మండిపడి, నిచుళాపురం వెళ్ళిపొమ్మంటాడామెను. కానీ ఆమె దు:ఖాన్ని చూసి చలించి, తన కఠినప్రవర్తనకు గానూ క్షమాపణ కోరతాడు. ఎంత గొడవ పడినా, మళ్లీ పాలునీళ్ళలా ఇట్టే కలసిపోయే ముచ్చటైన అన్యోన్యత వారిది.

**రంగనాయకుడిలో మార్పు.. :**

ఒకరోజు రంగనాయకుడు కావేరీ తీరంలో అంతర్మథనంలో మునిగి ఉండగా తిరుమలరెడ్డి బంటు సింహాచలం అతనిపై మరోమారు హత్యాయత్నం చేస్తాడు. తానను తాను రక్షించుకునే ప్రయత్నంలో అతడు కొట్టిన దెబ్బలకు ప్రాణాలు విడుస్తాడు సింహచలం. భయంతో మృతశరీరాన్ని కావేరిలో కలిపేసి ఇంటికి వెళ్తాడు రంగనాయకుడు. పశ్చాత్తాపంతో కుమిలిపోతూ జబ్బుపడిన రంగనాయకుడికి ఎంతో జాగ్రత్తతో పరిచర్యలు చేసి మామూలు మనిషిని చేస్తుంది హేమసుందరి. జ్వర తీవ్రతలో కాంతామణి అనే వారకాంత గురించిన కలవరింతలు విని, ఆమె వద్దకు వెళ్ళి హృదయభారాన్ని తగ్గించుకోమని రంగనాయకుడిని ప్రాధేయపడుతుంది హేమసుందరి. సామంత ప్రభువు విషయంలో తాను ఆమెను అవమానించినా, ఈనాడామె తన ఆనందాన్ని కోరుకోవడం, ఆమె పరిచర్యలు, ఆమెకు తనపైగల అసూయారహితమైన గాఢానురాగానికి రంగనాయకుడు చలించిపోతాడు. ఆమె అడుగుజాడలలో నిలబడటానికి అర్హత ఉందా అన్న సంశయానికి వస్తాడు...!శ్రీరంగనాధుని కరుణవల్లనే అటువంటి "సాధ్వీమణి" తనకు లభించిందని ఎంతో ఉప్పొంగిపోతాడు. ఇక ఆలసించకుండా తన మొక్కుబడి తీర్చుకోవాలని నిశ్చయించుకుంటాడు. రంగనాయకుడు తన అసూయాద్వేషాలను జయించిన తరుణం అది.

సింహాచలం మరణం వల్ల రంగనాయకుడిలో పశ్చాత్తాపం, కరుణ జనిస్తాయి. తిరుమలరెడ్డికీ, తనకీ ఉన్న గొడవ వల్ల ఓ మూడో వ్యక్తి బలైపోయాడు.. అదీ తన వల్ల అనే వేదన అతడిని నిలువనీయదు. స్నేహితుడి ద్వారా సింహాచలం కుటుంబానికి అవసరమయ్యే సొమ్ము పంపించిన తరువాతే అతని ప్రాణం కుదుటపడుతుంది. ఆ తర్వాత నుంచీ కూడా సింహాచలం కుటుంబావసరాలన్నింటికీ ఎల్లకాలం ధనసహాయం అందే ఏర్పాటు చేస్తాడు రంగనాయకుడు. ఈ సంఘటన రంగనాయకుడిలోని మానవత్వాన్ని తెలుపుతుంది.

ఓ శుభముహుర్తాన రంగనాయకుడు రంగనాథుడికి తన మొక్కు చెల్లించుకునేందుకు బయలుదేరినప్పటి దృశ్యవర్ణనే మొదట రాసిన వాక్యాలు. హేమాంబ ధనుర్ధాసులన్న కొత్త పేర్లతో, తండ్రి గోత్రంతో తమ ఇద్దరి పేరా స్వామికి సహస్రనామార్చన చేయిస్తాడు రంగనాయకుడు. ఆ విధంగా ఆ క్షణాన స్వామివారి సన్నిధిలో తమ వివాహకార్యక్రమం పరిసమాప్తి అయ్యిందని రంగనాయకుడు సంతోషిస్తాడు. హేమ కనుదోయి కొలతలతో చేయించిన స్వామివారి కానుకలు చక్కగా అమరినందుకు వారిద్దరు ఎంతగానో సంతోషిస్తారు. ఇంటికి తిరిగివెళ్ళే దారిలో అయిదారుగురు కాషాయాంబరధారులైన యతీశ్వరులు వారికెదురౌతారు. వారిలో ఆజానుబాహుడైన ఒక యతీశ్వరునడు నిశ్చల విశాల నేత్రాలతో, చిరునవ్వుతో రంగనాయకుని పరిశీలిస్తూ కనబడతారు. రంగనాయకుని ఆడుగులు రెండు,మూడు నిముషాలు ఆగిపోతాయి. హేమ కళ్ళ కన్నా సువిశాలమైన, ఠీవి, రాజసం నిండిన ఆ సుదీర్ఘమూర్తి గంభీరదృష్టి అతడిని ఆశ్చర్యపరుస్తుంది. తమని దాటిపోయాకా కూడా వెనుదిరిగి తనను పరిశీలిస్తున్న ఆ నిశ్చల దృషిని అతను అవగాహన చేసుకోలేకపోతాడు. ఆ తర్వాత ఆయనే "శ్రీమద్రామానుజ యతీంద్రులు" అని తెలుసుకుని ఆశ్చర్యపోతాడు. ఆ రోజు సాయంత్రం ఇంటికి చేరేసరికీ వీధి అరుగు మీద తనకోసం "శ్రీమద్రామానుజుల మఠం" నుంచి వారు తనను చూడాలంటున్నారని వచ్చిన ఒక బ్రాహ్మణ బ్రహ్మచారి చూసి మరింత కలవరపడిపోతాడు రంగనాయకుడు. అది అనుగ్రహమా, ఆగ్రహమా అనే సందిగ్ధంలో పడతాడు. రామానుజయతీంద్రుల మఠానికి వెళ్ళాలో వద్దోనని సందేహిస్తూనే మరొక రోజు గడిపిన అతడికి మర్నాడు ఇల్లు చేరేసరికీ మళ్ళీ అరుగు మీద "దాశరధి" ఎదురౌతాడు. ఇక తప్పనిసరిగా అతనితో మఠంలోకి అడుగు పెడతాడు రంగనాయకుడు. అతడు భక్తిమార్గంలో ప్రవేశించే తరుణం అది.

అనేక సందేహాలతో మఠంలోకి అడుగుపెట్టిన రంగనాయకునికి "వచ్చావా నాయనా! ఇన్నాళ్లనుంచీ నీకోసమే ఎదురు చూస్తున్నాను !" అన్న రామానుజుని ఆప్యాయమైన పలకరింపు విద్దూరంగా తోస్తుంది. "ఇంతకు ముందు నువ్వు కని విని ఎరుగనంతటి పెద్ద పెద్ద కన్నులున్నవి. చూపించనా?" అనీ అడుగుతారు. ఈ కొంటె ప్రశ్నకు నిర్ఘాంతపోయిన రంగనాయకుడు తనకా జన్మకు ఇంకేమీ అవసరం లేదనీ, వేరొకరివైపు కన్నెత్తి చూడదలచలేదనీ చెప్తాడు. ఎంతటి ఆత్మీయులతోనైనా ఎనాడూ ప్రసంగించని మౌనమూర్తి ఆవేళ ఒక సామాన్య మల్లునితో చిరకాల మిత్రునితో మాట్లాడినట్లు సంభాషించటం ఆశ్రమవాసులందరికీ విచిత్రమనిపిస్తుంది. తరువాత నాలుగైదు రోజులకొకసారి, ఆ పై ప్రతిరోజూ రామానుజుని సందర్శించటం మొదలుపెడతాడు రంగనాయకుడు. ఈ రాకపోకలు హేమసుందరిలో అంతులేని ఆవేదనని రేపుతాయి. అటు రంగనాయకుని ఎడల ఆచార్యునికెక్కువౌతున్న మక్కువ మఠవాసులలోనూ అలజడి రేపుతుంది. రామానుజుని ప్రధాన శిష్యులందరూ వ్యాకరణ,వేదాంత, చతుర్వేదాలలో విద్వాంసులు. వారెవరికీ రంగనాయకుని మీద సదభిప్రాయం ఉండదు. సామాన్య రైతు కుమారుడు, ఒక వెలయాలిని వెంటబెట్టుకుని శ్రీరంగం వచ్చి నివసిస్తూ, మద్యపానం, సాముగారడీలు తప్ప భక్తిశ్రద్ధలేమాత్రం కానరాని అతని పట్ల ఆచార్యులకేందుకంత అనుగ్రహ వాత్సల్యాలో వీరెవరికీ అంతుపట్టదు. శ్రీరంగేశుని దేవాలయానికి

వెళ్ళేప్పుడు "దాశరధి" భుజం మీద ఆనించే యతీశ్వరుని చెయ్యి రాను రానూ రంగనాయకుని భుజం మీదకు తిరిగేంతటి పరమాత్మీయ దృష్టిని చూసి కలవరపడతారు శిష్యులు.

ఒకరోజు దేవాలయంలో రామానుజ శిష్యులు పఠిస్తున్న ద్రవిడ వేదపారాయణ దేవాలయం నలుమూలలా మారుమ్రోగుతున్న వేళ తన్మయంతో పులకించిన రంగనాయకుని నోటి వెంట అప్రయత్నంగా ద్రవిడ వేదపాశురం వెలువడుతుంది. అమృతగళం కాకపోయినా ఆ గొంతులో పలికిన మాధుర్య భక్తిభావాలందరినీ ఆశ్చర్యపరుస్తాయి. పారవశ్యంలో అతడు రామానుజుడ్ని "సుదీర్ఘ విశాల విలోచనాల దర్శన భాగ్యం" ప్రసాదించమని అడుగుతాడు. మరునిముషమే రామానుజుని గొంతులో పలికిన ద్రావిడ వేద పాశురాల పరంపర, అ వెంఠనే అర్చకుల శ్రీసూక్త పురుషసూక్తాలతో దేవాలయం ప్రతిధ్వనిస్తుంది. "అటు చూడమన్న" రామానుజుని నిర్దేశంతో రంగనాధుని నేత్ర యుగళిని దర్శించిన రంగనాయకునికి అపూర్వానుభూతితో అతిలోక విశాలమైన స్వామివారి రమణీయ విలోచన యుగళి కనబడుతుంది. తన్మయత్వంలో మూర్ఛపోతాడతను. స్వామివారి దివ్యనేత్రాల సందర్శన భాగ్యంతో తన జన్మ ధన్యమైందని భావిస్తాడు. అంతటి తాదాత్మ్యంలో కూడా హేమ ఈ దర్శనభాగ్యానికి నోచుకోలేదని వాపోతాడు. ఆనాటినుంచీ అతని జీవితమే మారిపోతుంది. మద్యపానం, చెడు సావాసాలూ క్రమక్రమంగా సడలిపోతాయి.

రంగనాయకుడి జీవితం ఇక్కడి నుండీ మరో మలుపు తిరుగుతుంది.

సంపాదనంతా వైష్ణవ మఠానికి ధారపోస్తున్న రంగనాయకుడిని చూసి హేమసుందరి కలవరపడుతుంది. సన్యాసం స్వీకరించి తనని వదిలివేస్తాడేమోనన్న ఆందోళన ఆమెది. మొదట్లో గొడవపడినా, మఠానికి వెళ్ళి రామానుజుడిని కలిసిన తర్వాత ఆమె కూడా భక్తిమార్గంలో పడుతుంది. కానీ రంగనాయకుని పూర్వవృత్తాంతం ఆ నోటా ఆనోటా తెలుసుకున్న నగర ప్రముఖులు అతనికి మఠంతో పెరుగుతున్న అనుబంధం నచ్చక మఠానికి విరాళాలివ్వడం మానుకుంటారు. అందువల్ల మఠంలో నిత్య నైవేద్యాలకు కూడా కొరత ఏర్పడుతుంది. అటువంటి సమయంలో వృద్ధ శిష్యులెవరికీ దక్కని "అష్టాక్షరీ మంత్రోపదేశం" చెయటానికి రామానుజులే స్వయంగా రంగనాయకుని ఇంట అడుగు పెడతారు. యఙ్ఞమూర్తి అనే ప్రధాన శిష్యుడు ఇదంతా సహించలేకపోతాడు. పరమేశ్వర సాక్షాత్కారం భక్తి, ఙ్ఞాన, కర్మ యోగల ద్వారానే సాధ్యమన్న సత్యాన్ని మారుస్తూ, ప్రగాఢమైన మోహావేశాలు కూడా భగవంతుని సాక్షత్కారానికి పెద్ద మెట్టుగా తెలుపుతున్న రామానుజుని ప్రసంగాన్ని విని విద్దూరపడినా సమర్ధించలేకపోతాడు. మఠంలోని మరో ప్రధాన శిష్యుడు గోవిందయతి ద్వారా రామానుజుని పురాతన గాధలన్నీ విన్నాకా అతడికి రామానుజుని అపార కరుణాదృష్టి అవగతమౌతుంది.

జయవిజయుల తపన లాగనే అనన్య సామాన్య మైన ఎడతెగని తపన వలన రంగనాయకునికి శ్రీరంగేశుని కృప కలిగి స్వామి సహజ దివ్య విశాల నేత్రాల సాక్షాత్కారం లభించిందని రామానుజులు యఙ్ఞమూర్తికి చెబుతారు. అలానే అనాయాస అష్టాక్షరీ మంత్రోపదేశానికి కారణం "హేమ-రంగనాయకుల పరస్పర తపన, ప్రేమానురాగాలు, మల్లవిద్యపై రంగనాయకునికి గల ఏకాగ్రత, వివాహితులు కాకపోయినా పుణ్యదంపతులవలే జీవించిన వైనం, ఒకరి తప్పిదాలనొకరు క్షమించుకున్న వారి అన్యోన్యత , ఎన్ని కష్టాలొచ్చినా సడలని వారి ప్రేమానుబంధం " అని యతీశ్వరుని ముఖత: విని యఙ్ఞమూర్తి ఆశ్చర్యపోతాడు.

నవల చివరలో శ్రీవైష్ణవ పీఠాధిపత్యాన్ని రంగనాయకుడికి ఇవ్వజూపినప్పుడు, అతడు రామానుజుని వద్దకు వెళ్ళి తానా పదవికి అనర్హుడినని ప్రాధేయపడినప్పుడూ; జీత భత్యాలు లేకుండా స్వామి సేవకు అనుమతిచమని ధర్మకర్తను వేడుకున్నప్పుడూ; ఇప్పుడున్న స్థితికీ,తన శ్రీరంగప్రయాణానికీ మూలకారకులైన తల్లిదండ్రులు,తిరుమలరెడ్డి మొదలైనవారి పట్ల క్రోధ-ద్వేషాలు పోయి ఆర్ద్రదృష్టి కలిగినప్పుడూ.. రంగనాయకుడి వ్యక్తిత్వ ఎదుగుదలనూ, ఎదిగిన కొద్దీ అతడిలో పెరిగిన ఒదిగే స్వభావాన్నీ మనం గమనించవచ్చు. ఇలా ఓ సామాన్య మానవుడి స్థాయి నుండి వందనాలందుకునే మహనీయుని స్థాయికి ఎదిగిన రంగనాయకుడి పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది..!

# అతడు - ఆమె : అతడు

కేవలం ఉత్తమ లక్షణాలున్న నాయకులనే కాకుండా విభిన్న వ్యక్తిత్వాలున్న నవలా నాయకులను పరిచయం చెయ్యాలన్నదే ఈ వ్యాసపరంపరల ఉద్దేశం. చదువరులకు.. 'నాయకుడు ఇలా ఉంటే బావుంటుంది' అనుకోవడంతో పాటూ ' ఇలా కాకుండా ఉంటే లేదా ఫలానా లక్షణాలను వదిలేస్తే.. బాగుంటుందేమో' అనిపించాలన్నది నా అభిలాష. అందువల్ల ఈసారి డాక్టర్ ఉప్పల లక్ష్మణరావు గారి **'అతడు – ఆమె'** నవలానాయకుడైన **శాస్త్రి** పాత్రచిత్రణ గురించి రాయాలని సంకల్పించాను. నవలలో 'అతడు, ఆమె , అతడు , ఆమె.. ' అంటూ ఇద్దరు వ్యక్తుల డైరీ పేజీలనూ, ఒకే విషయం గురించి వారిద్దరి అభిప్రాయాల్లో కనబడే తేడాలనూ చూపిస్తుంటారు రచయిత. అందువల్ల ఈ నవలానాయకుడికి అసలు పేరును కాక "అతడు" అనే పేరునే శీర్షికగా ఉంచాను.

ఎవరతడు? అతడి పూర్తి పేరు వల్లభజోస్యుల చిదంబర శాస్త్రి! భార్య "ఏమోయ్..శాస్త్రీ" అని పిలుస్తూంటుంది. మహిళలను ఆకట్టుకోగల స్ఫురద్రూపి, బుధ్ధిమంతుడు, తెలివైనవాడు అతడు. స్వాతంత్ర్యోద్యమనాటి కాలంలో సీమలో బారిస్టరీ చదువుకుని వచ్చి చెన్నపట్నంలో ప్రాక్టీసు పెడతాడు అతడు. అర్ధశాస్త్రం చదువుకుని క్వీన్స్ కాలేజీలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న శాంతం పరిచయం అవుతుంది అతడికి. అది స్నేహంగా మారి, అభిప్రాయాలు అభిరుచులు కలిసి, అవన్నీ ప్రేమగా మారి మూడేళ్ళ సావాసం తరువాత ఇద్దరూ రిజిస్టర్ పెళ్ళి చేసుకుంటారు. త్యాగరాజ కీర్తనలు పాడుకుంటూ, షికార్లూ చేసుకుంటూ కులాసాగా హాయిగా కాలం గడిపేస్తారు కొంత కాలం. రాన్రానూ వారిద్దరి అభిప్రాయాల్లో ఎన్ని భిన్నాలున్నాయో గమనిస్తూ ఆశ్చర్యపోతారు. తమది ఒకటే మనస్సు, ఒకటే దేహం కాదు.. దృక్పథాలే వేరుగా ఉన్నాయి అని తెలుసుకుంటారు. మొదట్లో సర్దుకుపోతారు కానీ కాలం గడిచేకొద్దీ చికాకు పెరిగి కీచులాటలూ, వాగ్యుధ్ధాలూ ఎక్కువవుతాయి. ఇద్దరి మధ్యనా దూరాన్ని పెంచుతున్న ఈ అగాధాలు తామిద్దరినీ ఏ దరికి చేరుస్తాయోనని బెంగపడుతూంటారిద్దరూ! భార్యాభర్తలిద్దరూ రాసుకునే డైరీల ద్వారా వారి అభిప్రాయాలు, వాటిలో మార్పులూ మనకు తెలుస్తుంటాయి. డైరీ అనేది మనిషి మనసుకు సరైన అద్దం కాబట్టి రచనలో కనబడే నిజాయితీ మనల్ని ఆకట్టుకుంటుంది.

**"అతడు – ఆమె" రచయిత – డాక్టర్ ఉప్పల లక్ష్మణరావు :**

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, తర్వాత ఎన్నో దేశాలు తిరిగి, స్విస్ వనితను వివాహమాడి, మాస్కోలో తెలుగు అనువాదకుడిగా పనిచేసి, సుమారు నలభై గ్రంధాలను తెలుగులోకి అనువదించిన ఘనత డాక్టర్ ఉప్పల లక్ష్మణరావుగారిది. చివరి రోజుల్లో

స్వస్థలమైన బరంపురంలో ఉంటూ, అభ్యుదయ రచయితల సంఘంలో చేరి ఎన్నో రచనలు చేసారు. 'బతుకు పుస్తకం' అనే ఆత్మకథను రాసారు.

ప్రేమ వివాహం చేసుకున్న ఓ భార్యాభర్తల అనుబంధాన్ని స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంతో సృజించి, ఆ ఉద్యమం ప్రభావం వారి వైవాహికజీవితాన్ని ఏ దరికి చేర్చింది? ఆనాటి జనజీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన స్వాతంత్ర్యోద్యమం వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు తెచ్చింది.. వారిద్దరి మానసిక సంఘర్షణ ఎలాంటి పరిణామాలకు దారి తీసింది.. మొదలైన అంశాలను రచయిత చాలా ఆసక్తికరంగా "**అతడు – ఆమె**" నవలలో చిత్రీకరించారు. కథను ఆటోబయోగ్రఫికల్ టెక్నిక్ ద్వారా నడిపిస్తారు రచయిత. మొదట రచయిత స్వస్థలమయిన బరంపురంలో వెలువడిన ఓ లిఖితపత్రికలో ధారావాహికలా ఇది ప్రచురితమైంది. తరువాత వారి తల్లిగారి సలహాపై స్వాతంత్ర్యపోరాటం నేపథ్యంతో 1950లో మళ్ళీ కథను తిరగరాసారుట లక్ష్మణరావుగారు. కొన్నేళ్ళ తరువాత మిత్రుల ప్రోత్సాహంతో ఈ నవలను పొడుగిస్తూ మిగతా భాగాలు రచించగా, మొత్తం నాలుగు భాగాలతో అందుబాటులోకి వచ్చిందీ నవల. స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, సమాజంపై వ్యక్తులపై స్వాతంత్ర్యోద్యమ ప్రభావం, ఆనాటి కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి, క్విట్ ఇండియా ఉద్యమం, కమ్యూనిజం, స్త్రీ పురుషుల అనుబంధాలూ, వైవాహిక సంబంధాలు, స్నేహాలు, స్త్రీ స్వాతంత్ర్యం, మానసిక సంఘర్షణ మొదలైన ఎన్నో అంశాలను స్పృశిస్తుందీ నవల. లక్ష్మణరావుగారి విస్తృత పరిజ్ఞానం, అభ్యుదయ భావాలూ, పాకశాస్త్ర ప్రావీణ్యం, వివిధ ఆసక్తులూ, కళాభిరుచి మొదలయినవాటి గురించిన అవగాహన కూడా కల్పిస్తుందీ నవల.




**'అతడి' స్వభావం:**

"నీ ప్రేముంటే లక్ష్మీ సరస్వతులున్నట్టేగా" అనే శాస్త్రికి భార్య శాంతం అంటే ఎంతో ప్రేమ. పురిటినెప్పులు పడుతున్న భార్యను చూసి స్త్రీ జాతి మొత్తం ఇంత యాతన పడవలసినదేనా? అని అల్లల్లాడిపోతాడు. ముద్దులు మూటగట్టే కూతురిని చూసి కొడుకు పుట్టలేదన్న బాధను మర్చిపోతాడు. ఆ పాపాయిని ప్రాణంలా చూసుకుంటాడు. భార్యాబిడ్డల కోసం ఏమన్నా చెయ్యగలడతడు. భార్యకు ఒంట్లో బాగోలేకపోతే పరిచర్యలు చేసి కాళ్ళు కూడా పడతాడు. ఒక సగటు భారతీయ భర్తకు సరైన ఉదాహరణ అతడు. చాలాసార్లు పురుషాహంకారం అతని మంచితనాన్ని కప్పేస్తుంది. భార్య దినపత్రిక చదువుతానిమ్మనగానే ఇది చాల్లే మీ ఆడవాళ్ళకంటూ సినిమాలూ, వాణిజ్యప్రకటనలున్న భాగాన్ని ఆమెకిచ్చి మెయిన్ పేపరు తాను చదువుకునేంతటి పురుషాహంకారం అతనిది. ఆడపిల్లలకీ మొగపిల్లలకీ పెట్టిన కాలేజీలో ప్రొఫెసరు పనికి ధరఖాస్తు పెడతానంటుంది శాంతం. కాలేజీ కుర్రాళ్ళు, తోటి ఉపాధ్యాయుల చూపులూ శాంతం మీద పడడం ఎందుకనిపిస్తుంది శాస్త్రికి. ఆమె ఉద్యోగం చెయ్యడం తనకు ఇష్టం లేదనేస్తాడు. "ప్రాణనాథా నీ ఆజ్ఞ" అంటుంది శాంతం. ఓల్గా నవల "స్వేచ్ఛ" లోని అరుణ, ప్రకాశం పాత్రలకు ప్రేరణ శాస్త్రీ, శాంతం అయి ఉంటారని ఈ నవల చదువుతూంటే అనిపిస్తుంది.

ఓసారీ ఒక కేసు విషయం తనకన్నా ముందర 'లేడీ అయ్యంగారు'కి చెప్పాడని ఆమె వల్లే తెలిసి శాంతం బాధపడితే, "భర్తనేవాడు చిన్నాపెద్దా అబద్ధాలు ఆడవచ్చు. ఆడవాళ్ళు మాత్రం తెల్లారితే లక్షాతొంభై అబద్ధాలు ఆడరూ.." అని తన తప్పిదానికి డిఫెన్స్ చెప్పుకుంటాడు. చదువుకునే రోజుల్లో జరిగిన విషయమొకటి శాంతం చెప్తే విని ఉద్రేకపడిన మనిషే తాను మాత్రం లేడీ అయ్యంగారు, ఊర్వశి, లీలావతమ్మ మొదలైనవారితో కబుర్లాడితే, సరసాలాడితే తప్పులేదంటాడు. పరాయి స్త్రీలని చూస్తే, వారితో కబుర్లాడితే తప్పేముంది? బొత్తిగా మరొకళ్ళతో మాట్లాడకూడదని ఆంక్ష వేస్తే ఎలాగా... అని చిర్రుబుర్రులాడతాడు.

కొన్ని సంగతులు గురించి తన పెళ్ళాం అజ్ఞానంలో ఉండడమే ఇష్టం అంటాడు శాస్త్రి. భార్య అభిప్రాయాలు సరైనవే అయినా తన అభిప్రాయాలతో భిన్నంగా ఉన్నందున వాటిని అంగీకరించలేకపోతూ ఉంటాడతను. సగటు భర్తలాగ తన పెళ్ళాం అజ్ఞానంలో, అమాయకత్వంతో ఉండడమే ఇష్టం అంటాడతడు. బయట ఎందరు ఆడవాళ్ళు ఏం మాట్లాడినా శాంతంతో వాదనకు దిగినప్పుడు ఆమె నోటమ్మట కొన్ని మాటలు విన్నా, ఆమెకు కొన్ని సంగతులు తెలుసని అర్థమైనా పాము కుట్టినట్లుంటుందంటాడు శాస్త్రి. ఇద్దరం చదువుకున్నవాళ్లం అవ్వడం వల్లనే తంటాలేమో అన్నది అతని అభిప్రాయం.

శాస్త్రి గడుసువాడైనా ఇతరులను గుడ్డిగా నమ్మేసే అలవాటు వల్ల సంపాదించిన సొమ్మంతా నష్టపోతాడు. ఇదీ సంగతని భార్యకు చెప్పలేక బెంబేలెత్తిపోతూంటే ఆమే అడిగి తెలుసుకుని ధైర్యం నూరిపోస్తుంది. తన ప్రావిడెంట్ ఫండ్, పెళ్ళికి భర్త తనకు కొనిపెట్టిన నగల జాబితానూ చెప్పి అతనిని స్థిమితపరుస్తుంది. బంగళా నుండి చిన్నింటికి మారిపోవచ్చనీ, పెద్ద కారు అమ్మేసి చిన్న కారు కొనుక్కోవచ్చనీ, మరో నాలుగు పెద్ద కేసులు వాదిస్తే మునుపటికంటా ఎక్కువే సంపాదిస్తావనీ ధైర్యం చెబుతుంది. చిన్నింటికి మారాకా కూడా అన్ని సమయాల్లోనూ శాంతం అతడికి అండగా నిలిచి, ఇంటిపనంతా ఒక్కర్తీ చేసుకుంటూ కాలం నడుపుకొస్తుంది. అలా తన సర్వస్వాన్నీ తన కోసమే అర్పించిన శాంతం అంటే అతనికి వల్లమాలిన ప్రేమ. ఆమె ప్రేమను పొందగలిగినందుకు తనంతటి అదృష్టవంతుడు ఈ ప్రపంచంలో ఉండడనీ, ఎన్ని జన్మలకీ శాంతం ఋణం తీర్చుకోలేనని చెప్తూ ఆమె ప్రేమకు ముగ్ధుడయిపోతాడతడు.

అతడి భోజనప్రియత్వాన్ని గురించి ఓ వ్యాసమే రాయవచ్చు. పొద్దున్నే పళ్ళు తోమగానే కాఫీ పడకపోతే వారం రోజులై ఆకలితో మలమల మాడుతున్నట్లు బాధపడిపోతాడు. కాఫీలో ఒక్కచుక్క పంచదార ఎక్కువైనా తక్కువైనా తాగలేడు. పదిగంటల భోజనంలో పెరుగుబిళ్ల కాస్త పలుచగా ఉంటే పస్తుండటమే నయమంటాడు. పెరుగుపచ్చడిలో ఒక్క నీటిచుక్క ఎక్కువైతే రాచ్చిప్ప పళాంగా గిరాటు వేస్తాడు. పోపులో మినబ్బద్ద మాడిందంటే పీట మీంచే లేచిపోతాడు. రాత్రి భోజనం తరువాత తాంబూలంలో ఏలగ్గింజలు లేకపోతే సణుగుడే! భర్తపై ప్రేమతో శాంతం మాత్రం ఓపిగ్గా అతడి చికాకుల్ని భరిస్తూ అతడికి ఇష్టమయ్యే విధంగా వండిపెడుతూంటుంది. ఇక వంటవాడితో పప్పు ఎలా చేయించాలో కూతురికి వివరిస్తాడు "పేరుకున్న నెయ్యి పూస ఉసిరికాయంత పప్పు ఉడుకువచ్చాక వేస్తే, పప్పు పొంగదు కమ్మగా ఉంటుంది" అని! ముద్ద కూరలూ, ఇంగువ చారు, ఉప్పుడు పిండి, వాసినపోలీ వంటి రుచులే మర్చిపోతున్నాం.. అని వాపోతాడొక సందర్భంలో! ఇంకా ఓమాటు మీటింగుకని పొరుగూరు వెళ్తూ వెళ్తూ ఆవకాయ కోసం చెట్టు మీద మామిడికాయలు దెబ్బ తగలకుండా ఎలా దింపించాలో, వెల్లుల్లి ముక్కావకాయ, బెల్లపావకాయ, మెంతికాయ, వేపగింజలు వేసి మాగాయ చేయించడం మర్చిపోవద్దంటూ కూతురికి జాగ్రత్తలన్నీ మరీ మరీ చెప్పి వెళ్తాడు. అవన్నీ చదువుతుంటే ఇతగాడు వంటచేయడంలో కూడా భీముడేనేమో అనిపించకమానదు.

ఏ పని చేసినా, ముందు స్వలాభాన్ని చూడడం అలవాటతడికి. ఈ గుణం వల్లే పోగొట్టుకున్న డబ్బుకి మూడింతలు మళ్ళీ సంపాదించగలుగుతాడు. ముప్ఫై రెండేళ్ల పిన్న వయసుకే గవర్నమెంట్ ద్వారా అడ్వకేటు జనరలుగిరీ సంపాదించుకున్న ప్రఖ్యాత బారిష్టరవుతాడతడు. ఆంగ్లప్రభుత్వానికంతటి విధేయుడు కాబట్టే భార్య కాంగ్రెస్ లో చేసి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, ఖద్దరు కట్టడం ఎంతమాత్రం నచ్చదతనికి. కానీ స్వాతంత్ర్యం వచ్చాకా భార్య ద్వారా కాంగ్రెస్ లో చేరి, ఆమె సిఫారుసుతో ఎన్నికల్లో నిలబడి మంత్రి అయిపోవాలని అతని అభిలాష. తానంటే ఎంత ప్రేమ ఉన్నా, జైలుకెళ్ళొచ్చిన ఉద్యమకర్తగా భర్త స్వార్థాన్ని సహించలేకపోతుంది శాంతం. ఇన్నాళ్ళుగా జమిందారుల కేసులు వాదించి, గెలిచి, వెలకొద్దీ రైతుకుటుంబాలకు అన్యాయం చేసి డబ్బు గడించినవాడు మంత్రి అయి ప్రజలకు ఏం న్యాయం చేస్తాడన్నది శాంతం వాదన. "నా కుటుంబం కోసం, నా పొట్ట కూటి కోసం యమయాతన పడుతుంటే; చేసేదంతా అధర్మం..చెప్పేదంతా అశ్లీలం.. పలికేది అబద్ధం.. నీ బ్రతుకే అనర్థం.. అని శాంతం అనడాన్ని సహించలేకపోతాడు అతడు. ప్రపంచ మహాప్రవాహంలో నేనొక నీటిబొట్టుని.. నేనేమన్నా శాస్త్రకారుణ్ణా?" అన్నది అతడి వాదన. ధనార్జన పెరిగిన కొద్దీ అతడిలో పెరుగుతూ వస్తున్న స్వార్థపూరిత ఉద్దేశాలను మార్చాలని సంకల్పించుకుంటుంది చివరికామె. "ఎంత సేపూ నీ ఖ్యాతీ, నీ గొప్పా, నీ మర్యాదా, నీ స్వార్థం చూసుకోవడమేనా? ఒకరికి ఉపకారం చేద్దాం అని అక్కరలేదూ?" అని ఆమె వాదిస్తుంది. అతడిలోని ఊసరవిల్లి మార్పులు వేదన పెడుతున్నాయనీ, అతడిపై ప్రేమ ఉన్నది కాబట్టే మార్పుని కోరుకుంటున్నాననీ, అతడిలో స్వార్థం తగ్గిన నాడు మళ్ళీ వస్తానని చెప్పి నెలల పిల్లనూ, కూతురిలా పెంచుకుంటున్న శుభను తీసుకుని ఇంట్లోంచి వెళ్ళిపోతుంది శాంతం. ఆమె తిరిగి వస్తుందా? ఇద్దరూ మళ్ళీ కలుస్తారా? అతడిలో మార్పు వస్తుందా? మొదలైన ప్రశ్నలకు తరువాయి కథే సమాధానం!

**అతడిలో మెచ్చదగిన అంశాలు:**

సీమలో చదువుకున్నందువల్ల శాస్త్రికి ఇంగ్లీషువారన్నా, ఇంగ్లాండన్నా అభిమానం. అతని హృదయంలో భారతీయత ఉన్నా మేధస్సులో అంతా పాశ్చాత్యమే. ఉదయం జంధ్యం వేసుకుని శాస్త్రోక్తంగా తద్దినం పెట్టీ, బారిష్టరీ చేస్తూంన్నందువల్ల సాయంత్రం "సర్" భోజనానికి పిలిచారంటూ క్లబ్బుకీ వెళ్తాడు. జనాలు తెలుగు రుచులు మర్చిపోతున్నారు, తెలుగు భాష మర్చిపోతున్నారని బాధా పడతాడు, మళ్ళీ భార్యకు ఇంగ్లీషులోనే ఉత్తరాలూ రాస్తాడు. అయితే, భారతీయులను గురించి అతడు చెప్పిన జోశ్యం నిజమైందని మాత్రం ఆశ్చర్యం కలిగింది నాకు. "ఇంగ్లీషువాళ్లకు పోటీగా మనవాళ్ళు హిందూ ధర్మం, హిందూ సాంప్రదాయం అంటూ నెట్టుకు వస్తున్నారు గానీ మనకు స్వాతంత్ర్యం వచ్చాకా ఇంగ్లీషు వాడిని పంపించివేసినా మన దైనందిక జీవితం లోనూ, వేషభాషల్లోనూ చివరికి నైతిక జీవనం లోనూ కూడా పూర్తిగా పాశ్చాత్య నాగరికత అవలంబించేస్తాం. రాజకీయంగా జాతీయత ఉంటుంది కానీ సాంఘికంగా ఇంగ్లీషు దొరల్లాగైపోతాం. మనం ముందుకు రావాలంటే ఇంగ్లీషువాడిని అనుసరించి తీరాలి. వాడికీ మనకీ పుస్తెముడే. రేపు ఏ విప్లవమో వచ్చి అది జారుముడి కావచ్చు. కానీ... ఆ ముడి ముడిలాగే ఉంటుంది. దాన్నెవడూ విప్పడు. మనమే విప్పనీయం కూడా. అది మన మెడకే ముడి అని మన కుర్రాళ్ళు అరిచినా ఇంగ్లీషువాడికీ, మనకీ ఆ కొంగుముడి ఆచంద్రార్కం స్థిరం.." అంటాడు అతడు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా ఈ మాటల్ని మనం కాదనగలమా?!

మరోమారు కళ గురించి చర్చ వచ్చినప్పుడు కళ కళ కోసం కాదు అందులో ఒక ఆదర్శం ఉండాలి అంటుంది శాంతం. కవినీ, చిత్రకారుణ్ణీ,గాయకుడినీ వాళ్లమటుకు వాళ్లని వదిలెయ్యాలి. కళ పూనితే రాస్తారు లేకపోతే లేదు. స్వేచ్ఛ ఇస్తేనే కళ పుడుతుంది.. ఈ కవిత ఇలా రాయి, ఈ పాట ఇలా పాడు అంటే కళాకారుడికి ఎలా కుదురుతుందీ అని ప్రశ్నిస్తాడు శాస్త్రి. ఇటువంటి భావాలు వ్యక్తపరచినప్పుడు పాఠకులకు అతడిలో ఒక కొత్త శాస్త్రి కనిపిస్తాడు .

ఓసారి ఇంగ్లాండు అనుభవాల గురించి చెప్తూ అక్కడ తనకు పరిచయమైన దొరసానుల స్నేహాలను గురించి శాంతానికి చెప్తాడు శాస్త్రి. వేరా జాన్ స్టన్, మెడ్జి మెకార్మిక్, జీన్ బ్రాడ్ఫర్డ్, ఏడ్నా బెన్నెట్, హెన్నీ సల్లివన్ మొదలైనవారితో స్నేహాలూ, అవెంత దూరం వెళ్ళాయో ఆ కథలన్నీ చెప్తాడామెకు. ఒకసారి హెన్నీ తనపై మనసుపడిన సంగతి, బ్రహ్మచర్యాన్ని నిలబెట్టుకోవడం కోసం ఆ రాత్రి తానెంత నిగ్రహంతో మెలిగాడో చెప్తాడు. నిగ్రహంతో తన ధర్మాన్నెలా నెలబెట్టుకోగలిగాడో చెప్తున్నప్పుడు అతడిలో నిజాయితీ, మనోబలం ఎంత గొప్పవో తెలుస్తాయి.

చివరలో ఓచోట "నీ అపరచాణక్యం చూసి నవ్వాలో.. ఏడవాలో కూడా తెలీకుండా వుందోయ్!" అని శాంతం అంటే, "నువ్వు నన్ను చూసి ఏడవనూవద్దు.. నవ్వావద్దు. ఎప్పటిలాగానే ప్రేమించు నన్ను!" అంటాడు శాస్త్రి. శాంతం పట్ల అతడికి ఉన్న ఈ వల్లమాలిన ప్రేమే శాస్త్రిలోని ప్రత్యేకమైన సుగుణం. మరో సందర్భంలో "సౌమ్యు నాదైతేనేం అసలు నేనే నీవాడిని.." అంటాడు. ఈ ఒక్క మాటా విన్నప్పుడూ శాంతం లాగనే మనమూ అతడిలోని లోపాలన్నింటినీ క్షమించేయచ్చేమో అనిపిస్తుంది నాకు.

# అఖిలన్: చిత్ర సుందరి - అణ్ణామలై




చిదంబర మేస్త్రీ, మీనాక్షి దంపతులకు లేక లేక చాలా కాలానికి పుట్టిన సంతానం అణ్ణామలై. ఉంగరాల జుట్టు, దట్టమైన కనుబొమలు, పొడవైన ముక్కు, ఏవో స్వప్నలోకాల్లో విహరించే కళ్ళు కలిగిన అతడిది ఆడపిల్లలు కన్నార్పకుండా చూసే అందం. అతని తల్లి తరచూ ప్రొద్దుపోయిన తర్వాత కాలుతున్న కొబ్బరి చిప్పతో దృష్టి తీస్తుంది కూడానూ. స్ఫురద్రూపంలో తల్లి పోలికే అయినా తండ్రి పట్టుదల, ఆవేశం కూడా అతడి వ్యక్తిత్వంలో మిళితమైపోయాయి. నల్లనివన్నీ నీళ్ళు, తెల్లనివన్నీ పాలు అనుకునేంత అమాయకుడు, సౌమ్యుడు. కపటం, దురాశ, మోసం లాంటివి ఎరుగని నిష్కల్మషమైన పసిపాప మనస్తత్వం అతనిది. పిరికితనంతో పాటూ అణ్ణామలైలోని మరొక ముఖ్యమైన బలహీనత ఏమిటంటే ఇతరుల అభిప్రాయాల పట్ల తనకు ఏకీభావం లేకపోయినా వాటిని కరాఖండీగా ఖండించే గుణం అతడికి లేదు. చిత్రలేఖనం అతడి ఆరో ప్రాణం. కళాకారుడుగా తన సంతృప్తి కోసం చిత్రలేఖనాన్ని వృత్తిగా చేపడతాడు తప్ప ఆదాయానికి ప్రలోభపడి ఎటువంటి చిత్రాలనైనా గీయడానికి అతని మనసొప్పదు. అతడికి జీవితంలో కావాల్సినవి ప్రేమాభిమానాలు, ప్రోత్సాహం మాత్రమే. కానీ అవి తనకు ఎవరివద్ద లభిస్తాయో గుర్తించలేక జీవితంలో తప్పటడుగు వేసి, అందుబాటులో ఉన్న మణిని పోగొట్టుకుని తీరని దు:ఖాన్ని కొనితెచ్చుకుంటాడు. అతడి వ్యక్తిత్వంలోని అసమర్థతలే అతడిని పాఠకులకు చేరువ చేస్తాయి. ఉన్నత వ్యక్తిత్వం గల పాత్రలను ఆదర్శవంతమైనవిగా భావించి ఎంతగా అభిమానిస్తామో అంతే ఇదిగా ఎన్నో బలహీనతలున్న అణ్ణామలై పాత్రను కూడా మనం అభిమానించకుండా ఉండలేము. ఎందుకంటే, మనలో

ఉండే దౌర్బల్యాలు, అసమర్థతలూ అతడిలోనూ ఉన్నాయి కాబట్టి. మనలా ఉన్న వ్యక్తులే మనకు ప్రియమైనవాళ్ళవుతారు కాబట్టి.

**"చిత్రసుందరి" రచయిత అఖిలన్:**

నవలాకారుడు, కథా రచయిత, స్వాతంత్ర్యసమరయోధుడు, విమర్శకుడు అయిన ప్రఖ్యాత తమిళ రచయిత అఖిలన్ (http://en.wikipedia.org/wiki/Akilan) పిల్లల కోసం కూడా ఎన్నో రచనలు చేసారు. గాంధేయవాది అయిన ఆయన రచనల ముఖ్యోద్దేశ్యం సమాజోద్ధరణ. దాదాపు 45దాకా ఉన్న ఆయన రచనలు అన్ని భారతీయ భాషలలోకీ అనువదింపబడ్డాయి. కొన్నయితే జర్మన్, చైనీస్, రష్యన్, చెక్, పోలిష్ మొదలైన అనేక విదేశీ భాషలలోకి కూడా అనువదింపబడ్డాయి. ఏ మనిషయినా ఆలోచించటానికి కుడా వెనుకాడే కొన్ని యదార్థాలు ఆయన రచనలలో కనిపిస్తాయి. అదే ఆయన ప్రత్యేకత. "..రచయిత అనేవాడు పాఠకులు ఏది అడుగుతారో అది రాయకూడదు...పాఠకులు ఏమి తెలుసుకోవాలో అది రాయాలి" అంటారు ప్రఖ్యాత తమిళ రచయిత అఖిలన్. ఆఖిలన్ రాసిన "చిత్తిరపావై"('చిత్రంలోని సుందరి' అని అర్థం)1975లో ప్రతిష్ఠాత్మకమైన భారతీయ **జ్ఞానపీఠ్ అవార్డుని** అందుకుంది. ఆ నవల 1967లో ఓ తమిళ వారపత్రికలో సీరియల్ గా వచ్చింది కానీ ముగింపు అప్పట్లో ఎన్నో విమర్శలను ఎదుర్కొన్నా కూడా ఎంతో ఉత్తమమైనదిగా ప్రశంసలందుకుంది. నవలను తెలుగులోకి "చిత్రసుందరి" పేరుతో **శ్రీ మధురాంతకం రాజారాం** ఎంతో చక్కగా అనువదించారు. 1983లో కమలా పబ్లిషింగ్ హౌస్ వారు దీనిని ప్రచురించారు. సమకాలీన సామాజిక పరిస్థితులను ప్రతిబింబించే ఈ నవల అనేక భారతీయ భాషలలోకి కూడా అనువదించబడింది.భార్యాబిడ్డల కన్నా, బంధుమిత్రుల కన్నా, ఆప్తుల కన్నా డబ్బే ముఖ్యమనుకునే కొందరూ, ఇంకా కొన్ని స్వానుభవాలూ కలగలిసి ఈ నవల ఇతివృత్తం తయ్యారయ్యిందని అఖిలన్ తన ముందుమాటలో చెప్తారు.

**చిత్రసుందరి కథ:**

అణ్ణామలై అనే చిత్రకారుడి జీవితం చూట్టూ కథ అల్లుకుని ఉంటుంది. ఆదర్శప్రాయమైనది, ఆరాధింపతగినది, స్త్రీత్వానికి సజీవ వ్యాఖ్యానంలాంటి అణ్ణామలై ఇష్టదేవత **ఆనంది** ఈ నవలానాయిక. వీరిద్దరి మధ్యన చిగురించిన అనురాగం వారు గుర్తించేలోపే సమసిపోతుంది. తండ్రి దగ్గర పెట్టుకుని, పెంచి పెద్దచేసిన అన్నగారి వంటి **మాణిక్యం**, తన ప్రేయసిని తెలివిగా తనకు దూరం చేసి వివాహమాడేసిన కుతంత్రాన్ని పసిగట్టలేని అమాయకుడు అణ్ణామలై. పెద్దల ప్రోద్బలంతో అనాలోచితంగా సుందరిని వివాహమడతాడు కానీ ఆమె కోరుకున్న ఆశలను, జీవితాన్ని అందించలేకపోతాడు. తన తొందరపాటు, దూకుడు స్వభావం, అహంకారాల వల్ల భర్తకు, తనకూ మన:శాంతిని పోగొట్టి, చివరికి తన జీవితాన్నే కోల్పోతుంది సుందరి. ఇక దయ, దాక్షిణ్యం, సేవానిరతి, త్యాగశీలత మొదలైన దివ్యగుణాలకు కాణాచిగా ఒక ఆదర్శమహిళ పాత్ర ఆనంది స్నేహితురాలు **శారద**ది. మాణిక్యం ఎత్తులు, అణ్ణామలై తప్పిదాలు ఈ ముఖ్యపాత్రల జీవితాలను ఏ దరికి చేర్చాయన్నదే చిత్రసుందరి కథ.

**అణ్ణామలై:**

ఇంటరు పరీక్ష మరోసారి ఫెయిలయి, తండ్రితో ఘోరమైన తిట్లు తిని, ఇంటి నుండి బయటపడిన కుర్రవాడిగా అణ్ణామలై మనకు పరిచయమౌతాడు. పరీక్ష పోయిన బాధ అతడిలో లేశమాత్రమైనా కనబడదు. అతడి లోకంలో అతనుంటాడు. ఇంటికి దగ్గర్లో ఉన్న కపాలేశ్వరుడి గుడికెళ్ళి అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ కార్యక్రమాలు ఆసక్తిగా గమనిస్తూంటే, మట్టిముద్దతో, వెండి బంగారు రేకులతో శిల్పులు తయారు చేస్తున్న రకరకాల శిల్పాలపై అతడి దృష్టి నిలిచిపోతుంది. ఇటువంటి కళాఖండాలను, రమణీయమైన ప్రకృతి లేదా కొందరు మనుషులను చూసినప్పుడు అతడిలో నిద్రాణమై ఉన్న కళాభిరుచి ఒళ్ళువిరుచుకుంటుంది. బీచ్ రోడ్డు మొదట్లో చింకి బట్టలతో ఉన్న బిచ్చగత్తె రూపం అతడిని కల్లోలపరుస్తుంది. సముద్రతీరంలో పరిసరాలను మరచి బొమ్మ గీస్తున్న అణ్ణామలైను చూసి దగ్గరకు వెళ్ళి ఆ చిత్రాన్ని

చూస్తారు ఓ తండ్రి, కూతురు. "ధర్మదేవత కొలువుకూటంలో" అని పేరు పెట్టి, బిచ్చగత్తెను ఎముకలగూడులాగ, తల్లి కంట్లోంచి జారిన కన్నీటిబొట్టు ఆమె బిడ్డ పెదవిపై పడి చెదిరిపోతున్నట్లు, ఆ వెనుక ఒకవైపు ఎత్తైన కట్టడాలు, మరో వైపు ఒరుగుతున్న గుడిగోపురం చిత్రీకరిస్తాడు అణ్ణామలై. ముసలాయన అడిగిన ప్రశ్నలకు, తన బొమ్మకూ వివరణ అందించి సంతృప్తి పరుస్తాడు. తన చిత్రాన్ని చూడగానే ఆయన కుమార్తె ఆనంది కళ్ళల్లో కదలాడిన కాంతికి అతడు పులకిస్తాడు. ముసలాయన "స్కూల్ ఆఫ్ ఆర్ట్స్" లో పనిచేసిసి రిటైరైన కదిరేశన్ గారని తెలిసి ఆనందిస్తాడు. ఇంటర్ పరీక్ష గురించి మరచి స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ లో చేరవలసిందని, అప్పుడప్పుడు మెలకువలు నేర్చుకోవడానికి వారింటికి రమ్మన్న ఆహ్వానాన్ని కూడా అందుకుంటాడు.

సౌందర్యవతి కాకపోయినా ఆనంది కళ్ళలోని మాటలకందని సమ్మోహనశక్తి, పూలతీవెలాంటి ఆమె సహజ సౌకుమార్యం అణ్ణామలైని ఆకట్టుకుంటాయి. పరీక్షలో ఓటమి వలన అప్పటిదాకా అతడిలో ఉన్న దిగులు, ఆందోళన ఆమె నిశ్చలమైన చూపుల వల్ల తుడిచిపెట్టుకుపోతాయి. కానీ ఆ మార్పును గుర్తించేంత పరిపక్వత అతడికి లేకపోయినా తన హృదయం ఉత్సాహంతో ఉరకలేస్తోందని మాత్రం గమనిస్తాడు. ఇదే సమయంలో మాణిక్యం కూడా అణ్ణామలై ను వెతుక్కుంటూ అక్కడికి వచ్చి తండ్రీ కూతుళ్ళిద్దరికీ తనను తాను పరిచయం చేసుకుంటాడు. అది మొదలు కలిసిన ప్రతిసారీ తానెంత ప్రయోజకుడో, సమర్ధవంతుడో కదిరేశన్ గారికి తెలియపర్చేలా ప్రసంగాలను చేస్తుంటాడు మాణిక్యం.

అణ్ణామలై తండ్రి చిదంబర మేస్త్రీ పల్లెటూరి నుండి చెన్నపట్నం వచ్చి స్వయంకృషితో పైకి వచ్చిన మనిషి. కొడుకుని ఇంజనీరుని చెయ్యాలనే ఆశ అతనిది. కొడుకు పట్టుదల వల్లా, దండపాణి ప్రోత్సాహంతోనూ అయిష్టంగానే అణ్ణామలైను స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ లో చేర్పిస్తాడు మేస్త్రీ. అణ్ణామలైకు మేనమామ వరుసైన దండపాణి పేరుమోసిన షావుకారు. అణ్ణామలై తో స్టూడియో కట్టించేసి, సినిమా బేనర్లు అవీ గీయించేసి, అతడి సాయంతో డబ్బు గడించేయాలని ఆశపడటమే కాక తన కూతురు సుందరినిచ్చి వివాహం చేసేయాలని ఉవ్విళ్ళూరుతూ ఉంటాడు. అందగత్తె అయిన సుందరి పట్ల ప్రేమ లేకపోయినా విముఖత మాత్రం ఉండదు అణ్ణామలైకి. చిత్రకారుడు సౌందర్యారాధకుడు అన్నట్లుగా ఆమెను మోడాల్ గా కూచోపెట్టి ఓ చిత్రం కూడా గీస్తాడు. అతడిపై మనసున్న కారణంగా సుందరి కూడా అందుకు ఒప్పుకుంటుంది.

"స్కూల్ ఆఫ్ ఆర్ట్స్" ఎంట్రన్స్ పరీక్షలో అతడు గీసిన బొమ్మ చూసిన ప్రిన్సిపాల్ గారి కళ్లలో ఆనాడు బీచ్ లో తన చిత్రాన్ని చూచాకా ఆనంది కళ్ళలో కనబడ్డ ఉత్తేజాన్ని చూస్తాడు. ప్రిన్సిపాల్ నేరుగా అతడిని మూడవ సంవత్సరపు క్లాసులో కూచోబెట్టి ట్రిబుల్ ప్రమోషన్ ఇస్తాడు. క్లాసులో ఆనంది స్నేహితురాలు శారద పరిచయమౌతుందతనికి. అన్ని ఇబ్బందుల్లోనూ చివరికంటా అతనికి అండగా నిలబడి స్నేహానికో కొత్త నిర్వచనాన్ని ఇస్తుంది శారద.

చిత్రకళలో మెలకువలు నేర్చుకోవడానికి అడయారులో ఉన్న కదిరేశన్ గారి ఇంటికెళ్ళిన అణ్ణామలైని ఆ ఇల్లు, ఇంటి చూట్టూ తోట, ప్రహరీ గోడ దాపున ఉన్న నాగమల్లి చెట్టు, నాగమల్లి పూల తాలూకూ మధురమైన పరిమళం మంత్రముగ్ధుడ్ని చేస్తాయి. ఆ పరిసరాలతో పాటూ కళారాధనలో జీవిస్తున్న ఆ తండ్రీ కూతుళ్ల సాన్నిధ్యం అతడిలో ఆనందాన్ని నింపుతుంది. అణ్ణామలై హృదయం పువ్వులు పూచి, కోయిలలు పాడి, నెమళ్ళు ఆడే సుందరారామంగా మారిపోతుంది. కదిరేశన్ గారింటికి వెళ్ళే సాయంత్రాల కోసం ఎదురు చూడ్డం, వెళ్ళివచ్చాకా అక్కడి విషయాలు మననం చేసుకోవడంతోనే అణ్ణామలై కాలం గడిచిపోయేది. ఆనందితో స్నేహం కూడా ప్రవర్ధమానమవుతుంది. ఆమె మాటలో, ఆలోచనలో, ప్రవర్తనలో, ఆమె ప్రతి చర్యలోనూ ఒక ఔచిత్యం కనబడేదతనికి. కుమారుడి ముఖంలో వికాసం, కళ్ళలో కొత్త కాంతి, నడకలో ఉత్సాహం, మాటలో కొత్త ఉద్వేగం మొదలైన మార్పులని ముందుగా తల్లి గమనిస్తుంది కానీ తనలో

వస్తున్న మార్పుని తెలుసుకోలేకపోతాడు అణ్ణామలై. తను గీసిన ఆనంది చిత్రాన్ని చూసి మాణిక్యం "నువ్వా అమ్మాయిని ప్రేమిస్తున్నావా?" అనడిగినప్పుడు కూడా నాకటువంటి ఉద్దేశమేమీ లేదని స్పష్టపరుస్తాడు. కానీ వాళ్ళిద్దరి మధ్యా పెరుగుతున్న సాన్నిహిత్యాన్నీ ఓర్వలేక ఆనందితో సుందరి విషయం చెప్పి ఆమె మనసుని కలతపెట్టేస్తాడు మాణిక్యం. కదిరేశన్ గారి ఆస్తి మీద కన్నేసిన మాణిక్యం వాళ్ళ పాత ఇంటిని రీమోడల్ చేసే మిషతో అక్కడక్కడే మసలుతూ తానో గొప్ప ప్రయోజకుడిననే అభిప్రాయాన్ని ఆయనకు కలిగిస్తాడు. మేస్త్రీ తో పెళ్ళి ప్రస్తావన దాకా వెళ్తాడు. ఆనందిని ఏకాంతంలో ఇబ్బంది పెట్టి తప్పనిసరిగా ఆమె వివాహానికి ఒప్పుకునేందుకు కారణమౌతాడు. చిన్నన్నటి నుండీ తన ఇంట అన్నగారిలా పెరిగిన మాణిక్యం దురాశను, కుతంత్రానీ గమనించలేకపోతాడు అణ్ణామలై. మాణిక్యం మాటల వల్ల వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారనే నమ్ముతాడు.

ఆనంది నిర్ణయంలో ఏదో బలవంతం ఉందన్న శారద మాటలు విని ఆనంది దగ్గరకు వెళ్ళిన అణ్ణామలై సందేహాలను కొట్టిపడేస్తుంది ఆనంది. మాణిక్యం ఎత్తులే కాకుండా, సుందరిని మోడల్ గా చేసి అణ్ణామలై గీసిన చిత్రం కూడా ఆనంది అనురాగాన్ని మొగ్గ తొడగనివ్వదు. అమాయకుడైన అణ్ణామలై పట్ల జాలి, కరుణ, పసిపాప వంటి స్వచ్ఛమైన అతడి చిత్తప్రవృత్తి పట్ల ఆమెకున్న అమితమైన ప్రేమను ఆమె దాచిపెట్టేస్తుంది. స్వయంకృతాలే కాక విధి కూడా వారి కలయికకు ఆటంకమై నిలుస్తుందనిపిస్తుంది. అప్పటికి అభినందనలు తెలిపి వెళ్ళిపోతాడే గానీ తెలియని వేదన ఏదో అణ్ణామలైను ఆ ఊళ్ళో నిలువనీయదు. సహవిద్యార్థులతో శిల్పకళాక్షేత్రాల సందర్శనకు వెళ్ళోతాడు. ఆ వేదనలోనే సుందరితో వివాహానికి సమ్మతం తెలుపుతాడు. అతడిపై అన్నివిధాలా ఆధిపత్యం వహిస్తూ తన అందానికి దాసుడ్ని చేసుకుంటుంది సుందరి. కొన్నాళ్ళు ఆనందంగా సాగినా సుందరి మూర్ఖత్వం, మంకుతనం వారి దాంపత్యానికి పరీక్షలై కూచుంటాయి. ఆనంది ఎంతో ఓపిగ్గా ఒకట్రెండుసార్లు వారిద్దరికీ సమన్వయం కూడా కుదురుస్తుంది. అహంకారంతో అణ్ణామలై స్నేహితురాలైన శారదను కూడా అనుమానించి అవమానిస్తుంది సుందరి. చివరికి భర్తకూ తనకూ కూడా మన:శ్శాంతి లేని స్థితికి వెళ్ళి తన జీవితాన్ని చేజేతులా బలిచేసుకుంటుంది. సుందరి మరణానికి పరోక్షంగా తానే కారణమేమో అని కృంగిపోతున్న అణ్ణామలైకు శరవణన్ గారు చేతినిండా పని కల్పిస్తారు. చిత్రలేఖనంలో మునిగిపోయి అతడు బాహ్య ప్రపంచాన్ని, తన వ్యధలనూ మర్చిపోతాడు. అతడిలోని చిత్రకారుడు మళ్ళీ మేల్కొంటాడు.

లాభాల ఆశ చూపి కదిరేశన్ గారి ఆస్తితోపాటూ, చిదంబర మేస్త్రీ ఆస్తిని కూడా తాకట్టు పెట్టిస్తాడు మాణిక్యం. మాణిక్యం మోసం వల్ల ఇల్లుని పోగొట్టుకున్న మేస్త్రీ ప్రాణాలను కూడా కోల్పోతాడు. డబ్బే సర్వస్వం అయిన మాణిక్యానికి చేరదీసి, పెంచి పెద్ద చేసిన మేస్త్రీ పట్ల, అతని కొడుకు అణ్ణామలై పట్ల ఇసుమంతైనా సానుభూతి ఉండదు. అణ్ణామలై, ఆనందిల మధ్యనున్న పవిత్రబంధాన్ని ఓర్వలేని అతడు ఆనంది ద్వారా అణ్ణామలైని రప్పించి ఓ ష్యూరిటీ సంతకం చేయించుకుంటాడు. తండ్రి మరణానికి పరోక్షంగా కారకుడని తెలిసినా మాణిక్యంపై అనుమానపడక సంతకం పెట్టేస్తాడు అణ్ణామలై. ఉద్దేశపూర్వకంగానే మాణిక్యం తన బాకీ ఎగ వేసి అతడ్ని పూర్తిగా అప్పుల్లో ముంచేస్తాడు. ఆనంది విషయంలో మోసపోయినంత అమాయకంగానూ ఆస్తి విషయంలో కూడా మరోసారి దెబ్బతింటాడు అణ్ణామలై.

సుందరి మరణం, ఆనంది కాపురం సుఖమయంగా లేదన్న సత్యం బోధపడ్డాకా తీవ్రమైన మానసిక వత్తిడికి లోనౌతాడు అణ్ణామలై. తనని వివాహమాడమని శారదని అడుగుతాడు. అతడి మనోవ్యధని అర్థం చేసుకున్న స్నేహితురాలిగా శారద అతడిని కోప్పడకుండా ధైర్యం చెప్పి మరెప్పుడూ అలాంటి ప్రస్తావన తేవద్దని చెప్తుంది. శరవణన్ గారి గ్రామానికి తోడుగా రమ్మన్న ఆహ్వానాన్ని కూడా తమ స్వచ్ఛమైన స్నేహానికి అపవాదు రాగలదని హెచ్చరించి మెత్తగా తిరస్కరిస్తుంది. తాను వెళ్ళిన పల్లెలో ప్రమాదవశాత్తూ జారిపడి ప్రాణాలతో బయటపడతాడు. ఆసుపత్రి పాలై ఇంటికి వచ్చిన అణ్ణమలై కుడి చేతికున్న బ్యాండేజీ తీసివేసి, ఇంకా తగ్గని నొప్పిని

లెఖ్ఖచెయ్యకుండా తదేకదీక్షతో తన ఇష్టదేవత వర్ణచిత్రాన్ని వేయడం మొదలుపెడతాడు. తెల్లవారగానే కోర్టునోటీసుతో ఆస్తి జప్తు చేయడానికి వచ్చిన షావుకారుతో గొడవ పడకుండా తాను అప్పటిదాకా ప్రాణప్రదంగా చిత్రించిన ఆనంది వర్ణచిత్రాన్ని తప్ప ఏది తీసుకువెళ్ళినా అభ్యంతరం లేదని చెప్తాడు. అదే సమయంలో వాళ్ళింటికి వచ్చిన శారద వాచిపోయిన అతని చేతిని చూసి భయపడ్డా, జీవకళ ఉట్టిపడుతున్న ఆనంది చిత్రాన్ని చూసి పులకించిపోతుంది. "ఆమె బొమ్మనైనా మిగుల్చుకోవాలి గదా..." అని కళ్ళనీళ్ళు పెట్టుకున్న అణ్ణామలై చూసి ఖిన్నురాలౌతుంది. ఈ సంఘటన జీవితంతో పోరాడి అలసిన ఓ కళాకారుడి దీనస్థితిని మన కళ్ళముందుంచుతుంది.

మాణిక్యం దౌర్జన్యాలకీ, దురాగతాలకూ ఆనంది ఎలా ఎదురు తిరిగింది? చివరికి అణ్ణామలై కథ ఏ మలుపు తిరుగుతుంది అన్నది మిగిలిన కథ. 563 పేజీల ఈ నవల పూర్తయ్యాకా తన పిరికితనం వల్ల, పొరపాటు వల్ల తనతో పాటూ మరో ఇద్దరు యువతుల జీవితాలు తలక్రిందులు చేసిన వ్యక్తిగా కాక, ఒక అమాయకుడైన చిత్రకారుడిగానే అణ్ణామలై మన జ్ఞాపకాల్లో మిగిలిపోతాడు. ఈ పాత్రలకూ, కధకి మౌనసాక్షి అయిన నాగమల్లి చెట్టు, ఆ పూలు మన స్మృతులలో చాలా కాలం వరకూ తిరుగాడుతూ ఉంటాయి.

# తేజ : కీర్తికిరీటాలు




"మనకి ఏం కావాలో మనం తెలుసుకున్నప్పుడు మన ప్రపంచం మనం సృష్టించుకోగలుగుతాం. మన వ్యక్తిత్వం, తెలివితేటలు, మన సామర్థ్యం బట్టి దాన్ని విస్తృతపరుచుకోగలుగుతాం. ఈ చిన్ని ఊరిలో నాది అనే ప్రపంచాన్ని నేను సృష్టించుకున్నాను. నా ఆనందం, నా ఏకాగ్రత, నా తృప్తి దాని మీద కేంద్రీకరించుకున్నాను. ఈ ఊరికి నేను అంకితం అని కొందరంటారు. కానీ, ఈ ఊరిని నేనే స్వంతం చేసుకున్న సంగతి ఎవ్వరికీ తెలియదు." అంటాడు ఇరవైఎనిమిదేళ్ళ తేజ. తండ్రి స్ఫురద్రూపాన్నీ, తల్లి గాత్రమాధుర్యాన్నీ పుట్టుకతోనే పొందిన తేజ వారి సాంగత్యాన్ని మాత్రం పొందలేకపోతాడు. బాల్యంలో ఎన్నో ఆటుపోట్లు అనుభవించి, తల్లిదండ్రులకు దూరమై భయంకరమైన ఒంటరితనంతో పోరాడి, ఎనిమిదేళ్ళ నుండీ తాతయ్య దగ్గర పెరిగి పెద్దవుతాడు తేజ. ఏ కాలేజీలూ, విశ్వవిద్యాలయాలూ నేర్పలేని సంస్కారాన్ని తాతయ్య వద్ద నేర్చుకుంటాడతను. మనిషి చదువు వల్ల పొందాల్సింది మానవత్వం, మంచితనమే కానీ ఆడంబరం, అహంకారం కాదన్నది అతని అభిప్రాయం. ఆవేశం, ఆ ఆవేశానికి తగ్గ ఆలోచన, మంచి చెడుల విచక్షణ కలిగిన వివేకవంతుడైన యువకుడతను. ఆంధ్రుల అభిమాన రచయిత్రిగా పేరుగాంచిన **యద్దనపూడి సులోచనారాణి** రచించిన "కీర్తికిరీటాలు" నవలానాయకుడు **తేజ**.

**రచయిత్రి : యద్దనపూడి సులోచనారాణి**

1939, ఏప్రిల్ 2న కృష్ణాజిల్లాలో జన్మించారు సులోచనారాణి. 1956లో ఆంధ్రపత్రికలో ఆమె రాసిన మొదటి కథ ప్రచురితమైంది. ఆ తర్వాత అరవై దాకా కథలనూ, ఎన్నో నవలలనూ రచించి 70s-80s లో ఎంతో ప్రఖ్యాతి గడించారు యద్దనపూడి. మొదటి నవల

"సెక్రటరీ" తరువాత దాదాపు డెభ్భైకి పైగా నవలలు రచించారు. ఆవిడ రచించిన కొన్ని నవలలు రేడియో లో ధారావాహికలుగా వస్తే, కొన్ని సినిమాలుగా వచ్చాయి. ప్రేమ, కుటుంబ గాథలు, మానవ సంబంధాలు మొదలైనవి యద్దనపూడి నవలల్లో ముఖ్య ఇతివృత్తాలు. మధ్యలో ఆపకుండా చివరిదాకా చదివించే పట్టు ఉండేది యద్దనపూడి రచనల్లో. ఆ కాలంలో, ముఖ్యంగా మహిళలను బాగా ఆకట్టుకున్న రచయిత్రిగా యద్దనపూడి పేరుపొందారు. తన రచనలకు గానూ ఎన్నో అవార్డులనూ, సత్కారాలనూ పొందారు. ఆవిడ ప్రఖ్యాత నవలల్లో ఒకటైన "కీర్తికిరీటాలు" నవల ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకుందని పుస్తకంలో రాసారు గానీ ఏ సంవత్సరమో రాయలేదు.

మా ఇంట్లో యద్దనపూడిది "సెక్రటరీ" నవల ఒక్కటే ఉండేది. ఇంటర్, డిగ్రీ చదివే రోజుల్లో సెలవులకు పెద్దమ్మ, పిన్నమ్మల ఊళ్ళు వెళ్ళినప్పుడు వారి వద్ద ఉన్న యద్దనపూడి, యండమూరి, మల్లాది మొదలైనవారి రచనలు నాకు కాలక్షేపంగా ఉండేవి. మొత్తం యద్దనపూడి రచనల్లో దాదాపు పాతిక,ముప్పై దాకా నవలలు చదివాను నేను. ఒకే రచయిత రాసిన అన్ని రచనలు చదవడం అదే మొదలు, ఆఖరు కూడానూ. నే చదివిన యద్దనపూడి రచనల్లో **మీనా, జీవనతరంగాలు, స్నేహమయి, కీర్తికిరీటాలు, గిరిజా కల్యాణం** నవలలు నాకు బాగా ఇష్టం. కుటుంబపరమైన కథానేపథ్యంతో, బలమైన స్త్రీ పాత్రలతో, పలురకాల వ్యక్తిత్వాలనూ, మానవ సంబంధాల లోతులను తాకే ఈ ఐదు నవలలూ నాకెప్పటికీ గుర్తుండిపోయాయి. ఆంగ్ల రచనల ప్రేరణతో రాసినవి, స్వప్నలోకాల్లో విహరింపజేస్తాయి, వాస్తవానికి దూరంగా ఉంటాయి అన్న విమర్శలను ఎదుర్కున్నా కూడా నా అభిమాన రచయిత్రులల్లో ముఖ్యంగా యద్దనపూడి పేరు తప్పక చెప్పుకుంటాను నేను. ఎందుకంటే సమాజోద్ధరణ, చారిత్రక అవగాహన సాహిత్యానికి ముఖ్యమైన ఉద్దేశాలుగా చెప్పబడినా, ఏ సాహిత్యానికైనా అంత్యోద్దేశం ఆనందం కూడానూ. నిత్యం పలురకాల సమస్యల్లో సతమతమయ్యే జనాలకు ఓ ఊహాలోకాన్ని చూపించి, అందులో ఆదర్శవంతమైన పాత్రలను నింపి, ప్రేమాభిమానాలను నింపి తద్వారా పాఠకుల మనసుల్లో ఆనందాన్ని నింపాయీ కథలు. ఒక సినిమా ఎలాగైతే ప్రేక్షకులను వాస్తవికతకు దూరంగా తీసుకువెళ్ళి వినోదాన్ని అందిస్తుందో అలాంటి వినోదాన్ని ఈ నవలలు అందిస్తాయి. అందుకనే అవాస్తవికమైనవైనా సరే, ఆ విధంగా ఎందరో పాఠకులకు ఎంతో ఆనందాన్ని పంచిన రచయిత్రిగా యద్దనపూడిని అభిమానిస్తాను నేను.

**కీర్తికిరీటాలు:**

ఇది స్వర్ణలత అనే ఒక నాట్యకారిణి కథ. ఆమె జీవితంలో ఎదురైన సంఘటనలు ఆమెకు జీవితం పట్ల, మనుషుల నిజ స్వరూపాల పట్ల ఎటువంటి అవగాహనను కలిగించాయో తెలుపుతుందీ కథ. అనుకోకుండా పరిచయమై, జీవనసంఘర్షణలో ఆమెకు తోడుగా నిలిచి, ధైర్యాన్ని నింపి, ఆమెకు జీవితంతో పోరాడే స్ఫూర్తిని అందించే ఆదర్శవంతుడైన యువకుడు తేజ. ఈ నవలానాయకుడు. కళాకారులైన భార్యాభర్తలు పరస్పర ప్రేమాభిమానాలున్నా, అహంకారాల మాటున ఒదిగిపోతే, వారిద్దరి మధ్యన మూడో వ్యక్తిని నిల్చోనిస్తే వారి జీవితాల మధ్యన ఎంతటి అగాధాలు ఏర్పడగలవో, వారి జీవితాలు ఎంతగా చిన్నాభిన్నమవ్వగలవో తెలుపుతుందీ నవల. ఈ కోణం + నిస్సహాయురాలైన స్వర్ణలో తేజ నింపే పోరాటస్ఫూర్తి.. ఈ రెండూ నవలలో మెచ్చదగిన అంశాలు. అప్పట్లో కొన్ని నవలలు సినిమాలుగా తీసి ఉండడం వల్ల, ఆ దృష్టికోణం నుండి కథను రాసారేమో అనిపించక మానదు కథనంలో తొంగి చూసే నాటకీయతను గమనిస్తే!

**తేజ – పాత్ర పరిచయం:**

విజయవాడకు దగ్గరలోని ఓ పల్లెటూరిలో సాంప్రదాయం, నియమనిష్ఠల మధ్య పుట్టిపెరిగిన దేవి ప్రసాద్, హైదరాబాద్ లో పట్టణ వాతావరణం మధ్య గారాబంగా పెరిగిన రాజ్యలక్ష్మి, గురుదేవుని శాంతినికేతన్ లో కలుస్తారు. రాజ్యలక్ష్మి అందానికీ, గాన మాధుర్యానికీ దేవీప్రసాద్ ముగ్ధుడైతే, అతని చిత్రకళా నైపుణ్యం చూసి ఆమె ఆకర్షితురాలౌతుంది. తల్లిదండ్రులను సంప్రదించకుండా ప్రేమ వివాహం చేసుకున్న వారిద్దరి ప్రేమఫలం తేజ. విరుద్ధమైన కుటుంబ నేపథ్యాలున్న తల్లిదండ్రుల సంఘర్షణలో నలిగిపోతాడు **చిన్నారి తేజ**. విడాకులు

మంజూరైనాకా పిల్లవాడిని తండ్రికి అప్పగిస్తుంది కోర్టు. కళాకారుడవ్వడమే తన నేరమనుకుని కుడి చెయ్యి నరికివేసుకుని, కొడుకుని మాత్రం ఎటువంటి ప్రత్యేకతలూ లేని సామాన్యుడిలా పెంచమని చెల్లెలి వద్ద మాట తీసుకుంటాడు దేవీప్రసాద్. అంతేకాక వరుస అపజయాలు, అవమానాలూ, విడాకులు మొదలైనవాటి వల్ల విసిగిపోయి, అలసిపోయి ఆత్మహత్య చేసుకుంటాడతడు! తల్లి ప్రేమ కోసం తపించే చిన్నారి తేజను స్నేహితురాలు ఇందిరమ్మకు అప్పగించి, రాజ్యలక్ష్మి మారు వివాహం చేసుకుని విదేశాలకు వెళ్ళిపోతుంది. తల్లిదండ్రులకు దూరమై, ఇందిరమ్మ ఇంట్లో ఎంతో నిరాదరణకూ, కర్కశత్వానికీ గురౌతాడు తేజ. ఒంటరితనంతో అలమటించి మంచం పట్టిన పిల్లవాడిని తీసుకెళ్ళి ప్రాణప్రదంగా పెంచి పెద్ద చేస్తారు అతని తాతయ్య, మేనత్త. తాతయ్య తోడితే అతని లోకం. పిల్లలు లేని మేనత్త కాత్యాయని అతడికి కన్నతల్లి కన్నా ఎక్కువౌతుంది.

ఇటువంటి ఆటుపోట్ల మధ్య బాల్యం గడిచినా తాతయ్య పెంపకంలో ఉత్తమ వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటాడు తేజ. తనకేం కావాలో తెలుసుకుని, తనదంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకుంటాడు. జీవితంలో డబ్బు సంపాదనకు తెలివితేటలను మించిన డిగ్రీ లేదన్నది అతని నమ్మకం. ఆ పల్లెటూళ్ళోనే కొండపల్లి బొమ్మలు తయారు చేసేవారిని ఒక దగ్గరచేసి, బొమ్మల వ్యాపారం మొదలుపెడతాడు. మేనత్త చేసే పెళ్ళి ప్రయత్నాలని మాత్రం తిప్పికొడుతూ ఉంటాడు. చిన్నతనంలో ఇందిరమ్మ కూతురుతో తేజకు జరిగిన నిశ్చితార్థం అతడి ఆలోచనని మరో అమ్మాయి వైపుకి వెళ్ళనివ్వదు. స్నేహితుడు గోపాలాన్ని కలవడానికి హైదరాబాద్ వచ్చిన తేజ అనుకోకుండా నర్తకి స్వర్ణలత సన్మాన సభకు వెళ్లాల్సివస్తుంది. గోపాలం భార్య సావిత్రి స్వర్ణలత వద్ద గాయని. సావిత్రి ఆహ్వానంపై తప్పనిసరిగా రవీంద్రభారతికి వెళ్ళి "నాట్యమయూరి" బిరుదుని పొందిన స్వర్ణ నాట్యాన్ని చూసి ముగ్ధుడవుతాడు. కొందరు అల్లరుమూకల వల్ల అక్కడ జరిగిన ఘర్షణ, పెనుగులాటల నుండి స్వర్ణని రక్షించి, తలపై బలమైన గాయమైనా కూడా లెఖ్ఖచేయక ఆమెను బయటకు తీసుకువెళ్ళి కారు ఎక్కిస్తాడు. అలా ఆమె ప్రాణాలను కాపాడిన వ్యక్తిగా ఆమెకు పరిచయమౌతాడు. కానీ ఆ పరిచయాన్ని పెంచుకోవడం ఇష్టపడక, కలవాల్సొచ్చిన ప్రతిసారీ స్వర్ణకు దూరంగానే ఉంటూంటాడు. స్వర్ణ ఇందిరమ్మ కూతురన్న సంగతి అతడికి ముందు నుండీ తెలుసు మరి!

ప్రమాదవశాత్తూ స్వర్ణ తల్లిదండ్రులిద్దరినీ కార్ ఏక్సిడెంట్ లో కోల్పోతుంది. ఇల్లు, డబ్బు అప్పులవాళ్ళు తీసేసుకోగా, తను కూడా కాలు ఫ్రాక్చర్ అయ్యి మంచాన పడుతుంది. అంతటి అదృష్టవంతురాలు లేదనుకున్నవాళ్ళందరూ తలక్రిందులైన ఆమె పరిస్థితి చూసి నిర్ఘాంతపోతారు. హాస్పటల్లో ఉన్న స్వర్ణని చూడటానికి వెళ్ళిన తేజ అందరిలా సానుభూతి వాక్యాలు పలక్కుండా, ఇదీ ఎదో మంచికే జరిగిందేమో అనుకొమ్మనీ, ఈ నష్టాన్ని భగవంతుడు మరో రకంగా పూడుస్తాడేమో అనీ ఆమెకు ధైర్యం చెప్తాడు. కాలు బాలేనందువల్ల స్వర్ణ ఏర్పాటు చేసుకున్న ఫారిన్ ట్రిప్ చేజారిపోతుంది. రాజ్యలక్ష్మి రెండవ భర్త కొడుకు కిషోర్ ఆస్తి కోసం ఆవిడ కొడుకుగా ఇండియా వచ్చి, స్వర్ణ సంపాదన కోసం ఆమెపై ప్రేమ నటిస్తాడు. స్వర్ణతో నిశ్చితార్థం చేసుకున్న కిషోర్ సైతం ఆమెని ఒంటరిగా వదిలేసి పట్టించుకోకుండా జారుకుంటాడు. బంధుమిత్రులు జాలిపడతారు తప్ప సహాయానికి రారు. అటువంటి సమయంలో సావిత్రి బలవంతం మీద మరోసారి స్వర్ణని కలవడానికి వెళ్తాడు తేజ. తనని కలిసి చాలా రోజులైందని స్వర్ణ అంటే, "నెల మీద రెండు వారాలు" అని లెఖ్ఖగా అతను చెప్పిన సమాధానం అతనికి ఆమెపై ఉన్న అభిమానాన్ని తెలుపుతుంది. పిన్ని ఇంట్లో దీనావస్థలో ఉన్న స్వర్ణని చూసి కరిగిపోయి, సందిగ్ధాలన్నీ పక్కకు పెట్టి ఆమెను తనతో ఊరు తీసుకువెళ్తాడు.

ప్రశాంతమైన పల్లె వాతావరణంలో రత్తమ్మ పరిచర్యలతో, ఏసోబు అల్లరితో త్వరగానే కోలుకుంటుంది స్వర్ణ. తన ఆసక్తిని ఏమాత్రం కనపడనివ్వక కేవలం సావిత్రి ఉత్తరం రాయడం వల్లే ఆమెను ఇంటికి తీసుకువచ్చినట్లు ఆమెను నమ్మిస్తాడు తేజ. తాను ముమ్ముందు ఎప్పుడూ నాట్యం చెయ్యలేదని చెప్తూ గోపాలం రాసిన ఉత్తరం చూసి నిర్ఘాంతపోతుందామె. కిషోర్ తనని ఎందుకు వదిలేసాడో అర్థం అవుతుంది.

తానింక ఎప్పటికీ నాట్యం చెయ్యలేనని తెలిసి తట్టుకోలేకపోతుంది. ప్రాణాలు వదిలెయ్యాలని కాలీడ్చుకుంటూ వాగు వైపు వెళ్తుంది స్వర్ణ. సమయానికి మెలకువ రావడం వల్ల వెళ్ళి ఆమెను కాపాడతాడు తేజ. అప్పటిదాకా అపరిచితుడిలా, ముభావంగా, మొహమాటంగా కనబడే తేజ మొదటిసారిగా ఆవేశంగా, అధికారంగా, చనువుగా మాట్లాడటం చూసి ఆశ్చర్యపోతుంది స్వర్ణ. జీవితంలో ఎప్పుడూ నిరాశకు లొంగిపోకూడదనీ, ఎప్పటికప్పుడు బ్రతుకుని మరమత్తు చేసుకుంటూ ఉండాలని చెప్తాడు. జీవితంలో ప్రతిక్షణం అమూల్యమైనదని, తిరిగి రాదనీ, ఆ క్షణాలకొక విలువ మనకి మనమే ఏర్పరుచుకోవాలనీ, అది పని తోనే సాధ్యమనీ చెప్తాడు. పనిలో లీనమయ్యే మనిషి తనకి తాను ఉపయోగపడటమే కాక ప్రపంచానికి కూడా ఉపయోగపడగలడనీ స్వర్ణకి చెప్తాడు. అతని మాటలు ఆమెకు జీవితం పట్ల కొత్త ఆశని కల్పించి, బ్రతుకు విలువను తెలియజేస్తాయి. ఫకీరు ఆమె కాలుకి వైద్యం మొదలుపెడతాడు. ఆమెకు పని కల్పించాలనే ఉద్దేశంతో 'ఇండియన్ డాన్సెస్' మీద రచించబడిన రకరకాల పుస్తకాలు తెప్పిస్తాడు తేజ. మన దేశంలో నాట్యం ఎప్పుడెలా పోషింపబడిందో, ఎప్పుడు అశ్రద్ధ చేయబడిందో వివరిస్తూ ఇదివరకెప్పుడో స్వర్ణ  చెప్పిన వివరాలు గుర్తు చేసి, వాటికి ఈ పుస్తకాల్లోని వివరాలూ కలిపి తెలుగులో నాట్యం మీద మంచి పుస్తకం రాయమని సలహా ఇస్తాడు. ఏకంగా పుస్తకం రాయగలనా లేదా అని సంకోచిస్తున్న స్వర్ణకు అటువంటి పుస్తకం రాయడానికే ఆమెకీ ఆపద వచ్చిందేమో అని చెప్తూ, ఎన్నో విధాలుగా ఆమెకు ఉత్సాహాన్నీ, ధైర్యాన్నీ అందిస్తాడు తేజ.

కిషోర్ నిర్బంధంలో ఉండగా రాజ్యలక్ష్మి తన వ్యధనంతా తెలుపుతూ రికార్డ్ చేసి ఉంచిన కేసేట్ విన్నాకా, తేజ రాజ్యలక్ష్మి అసలు కొడుకన్న నిజం స్వర్ణకు తెలుస్తుంది. ఆ నేపథ్యంలో తేజ ద్వారానే అతని చిన్నప్పటి దీనగాధ వింటుంది ఆమె. చిన్నప్పటి నిశ్చితార్థం సంగతి విన్న తరువాతనే తేజ మనస్థితి ఆమెకు అర్థం అవుతుంది. ఏ అధికారంతో తనను తీసుకువచ్చాడో, తనపై అతనికి ఎంతటి మమకారం ఉందో కూడా తెలుసుకుంటుంది. కానీ కాలు బాగైన స్వర్ణ ఎప్పటికైనా మళ్ళీ పాత జీవితంలోకి వెళ్ళిపోతుందనీ, ఉత్తర దక్షిణ ధృవాల్లంటి తమ జీవితాలు మళ్ళీ తల్లిదండ్రుల జీవితాల్లా అవుతాయని భయపడి స్వర్ణపై తనకెలాంటి ఆశ, అభిప్రాయాలూ లేవని చెప్పి తప్పించుకుంటాడు తేజ. గాయపడిన ఆమె స్వాభిమానాన్ని గుర్తించినా భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని మౌనంగా ఉండిపోతాడు. ఎటువంటి పరిస్థితుల్లోనూ బలహీనతకు లొంగని పటిష్ఠమైనదతని వ్యక్తిత్వం.

స్వర్ణ రాస్తున్న పుస్తకం తాలూకూ కొన్ని ఛాప్టర్లు పబ్లిషర్స్ కి పంపిస్తే, అది బాగుందని డబ్బు పంపిస్తారు వాళ్ళు. తనది అనే డబ్బు మళ్ళీ జన్మలో చూడగలడం తేజ పుణ్యమే అంటుంది ఆమె. కాలు నయమయ్యే సమయానికి విజయవాడలో ఆమె నాట్య ప్రదర్శనను కూడ ఏర్పాటు చేస్తాడు అతను. మితిమీరిన ఆనందంతో గంతులు వేస్తూ, అతడికి ఋణపడి పోయాననీ, ఏమి చేస్తే అతడి ఋణం తీర్చుకోగలనో అంటూ ఉద్వేగపడుతుంది స్వర్ణ. అదే సమయానికి ఫారెన్ టూర్ నుండి వచ్చిన కిషోర్ ప్రదర్శన సంగతి తెలుసుకుని ఎప్పటిలా ప్రేమ నటించబోతాడు. కృతిమమైన నటనతో జనాలనూ ఆకట్టుకునే అతనికీ, సహజమైన వ్యక్తిత్వంతో తనను ఆకట్టుకున్న తేజకీ ఉన్న తేడాని గమనిస్తుంది ఆమె. ఒక నిర్ణయానికి వచ్చి ప్రదర్శన అనంతరం ఎవరికీ కనబడకుండా మాయమైపోతుంది స్వర్ణ. అన్నాళ్ళూ రాజ్యలక్ష్మి ఏమైంది? కిషోర్ బండారాలన్నీ బయటపడతాయా? స్వర్ణ ఎక్కడికి వెళ్ళింది? కిషోర్ నుండి తప్పించుకుని చివరికి తేజని కలిసిందా? అన్న ప్రశ్నలకి సమాధానం తెలియాలంటే నవల చదవాల్సిందే మరి :)

తేజ లాంటి సంస్కారవంతులు, ఉత్తమ వ్యక్తిత్వం గలవారూ ఉండరని అనలేం కానీ చాలా అరుదుగా కనబడతారు. జీవితం పట్ల, బ్రతుకు పట్ల అతనికి గల నిశ్చితాభిప్రాయాలు ఎంతటి నిరాశాపరులనైనా ఉత్సాహంతో నింపగలవు. తన బాధనీ, ఒంతరితనాన్ని అధిగమించి జీవితంలో నిలదొక్కుకోగలగడం అతనిలోని చైతన్యానికి ఉదాహరణ. నిస్సహాయంగా ఉన్న స్వర్ణ పరిస్థితిని తనకు అనుకూలంగా

మార్చుకోగలిగి కూడా నియమంగా, నిబద్ధతతో ఉండగలడం కష్టమైన పనే. చిన్నప్పటి నిశ్చితార్థం సంగతి తెలిసీ, స్వర్ణ ఆసక్తిని గమనించి కూడా తమ జీవన నేపథ్యాలనూ, విభిన్న వ్యక్తిత్వాలతో పెరిగిన తమ అంతరాలను గమనించి ఆమెను దూరంగా పెట్టడం అతని దూరదృష్టినీ, వాస్తవికతనీ తెలుపుతుంది. ఇలాంటి వ్యక్తులు ఊహాలోకాల్లో ఉన్నా ఓసారి వెళ్ళి పలకరించి రావాలని తప్పక అనిపిస్తుంది కదూ..

# సాంబయ్య – మట్టిమనిషి




డా.వాసిరెడ్డి సీతాదేవి రచించిన "మట్టిమనిషి" నవల లో ప్రధాన పాత్రధారి సాంబయ్య. కథంతా అతని చుట్టూరా అల్లుకుని ఉన్న కథానాయకుడు. ఆరడుగుల నిండైన విగ్రహం సాంబయ్యది. కాయకష్టం వల్ల ధనుస్సును లాగిపట్టిన నారిలా బిగించి పట్టిన కండలు తిరిగినట్లున్న కండరాలు, మెలితిరిగి గవదలు దాటి గాలిలో ఆడుతుండే అతని మీసాలు, ఒత్తుగా మెడల మీదకు జారిన జుట్టు, నాగలి ఉంపలా మొనతేలిన ముక్కూ, తీక్షణమైన చూపులు, ఆ నడక తీరూ అంతా కలిపి భూమిని నమ్మి, భూమి మీదే బతికే మనిషిలా ఉంటాడు సాంబయ్య". "పుట్టినవాళ్ళందరూ ఎప్పుడో ఒకప్పుడు చచ్చిపోయేవాళ్ళేరా! అసలు మనం పుట్టింది ఏడవటానికంటరా? బతకటానికిరా! బతకటానికి. బతికినన్నాళ్ళూ మగసిరిగా బతకాలి! ఒకళ్ళను దేహీ అంటూ అడక్కూడదు. అడ్డం వచ్చిన వాటిని నరుక్కుంటూ వెళ్ళాలి! చేతగాని వాడే ఏడుస్తాడు. చేతుల్లో సత్తువ ఉన్న వాడెవ్వడూ ఏడవకూడదు. సంతోషంగా బతకాలి! మనిషికి సంతోషం ఎక్కడుందంటావా? కష్టపడి పని చెయ్యడంలో ఉంది. చెమటోడ్చి భూమి దున్నటంలో ఉంది. రెక్కల కష్టం అక్కరకు రావటంలో ఉంది. మన కష్టార్జితం మన చేతుల్లో కొచ్చినప్పుడు ఉండే ఆనందంలాంటిది ఈ భూమ్మీదే మరొకటి లేదురా బాబూ!" అంటాడు సాంబయ్య మనవడితో! ఎంత చక్కని ఫిలాసఫీ! ఇది సాంబయ్య తనకు తానుగా గ్రహించుకున్న జీవనసారం. ఇది మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగి, మట్టినే నమ్ముకు బ్రతికిన ఓ 'మట్టిమనిషి' నేర్చుకున్న జీవితసత్యం.

**రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి :**

గుంటూరు జిల్లాకు చెందిన డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి సుప్రసిద్ధ రచయిత్రి. ఒకవైపు ప్రభుత్వోద్యోగం చేస్తునే ఆవిడ సుమారు 39 పైగా నవలలు మరియు 100 పైగా కథలు, పలు వ్యాస సంకలనాలు, పిల్లల కథా సంపుటాలు, అనువాదాలు రాయగలడం నిజంగా అభినందనీయం. సీతాదేవిగారి సమగ్ర సాహిత్యాన్ని పలు భాగాలుగా విశాలాంధ్ర వారు ప్రచురించారు. ఆవిడ అందుకున్న జాతీయ పురస్కారాల వివరాలు, వాటి పేర్లు నవల వెనుకవైపు రాసారు. సీతాదేవిగారి నవలలు కొన్ని సినిమాలుగానూ, దూరదర్శన్ లో సీరియల్

గానూ నిర్మించబడ్డాయి. సీతాదేవి గారి రచనా శైలి, విభిన్నమైన పాత్రల సృష్టి, నిశితమైన మనస్తత్వ చిత్రణ అన్నీ ఎంతో వాస్తవికంగా, వివేచనాత్మకంగా ఉంటాయి.

**మట్టిమనిషి:**

1972 లో 'ఆంధ్రప్రభ' దినపత్రిక, ఆదివారం అనుబంధంలో ధారావాహికగా ప్రచురణ పొందిన ఈ నవల విశేషంగా పాఠకుల ఆదరణ పొందింది. పుస్తక రూపంలో వచ్చిన తరువాత మరో రెండుసార్లు పునర్ముద్రితమైంది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి ఉత్తమ నవలా పురస్కారాన్ని అందుకుంది. ఈ నవలను నేషన్ బుక్ ట్రస్ట్ వారు పధ్నాలుగు భాషల్లోకి అనువదించారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంవాళ్ళు ఈ నవలని నాటకరూపంగా ప్రసారం చేసారు కూడా. ఇంతటి విశేష ప్రాముఖ్యత పొందిన ఈ సామాజిక నవల ద్వారా అప్పటి సమకాలీన సమాజపు వాస్తవిక రూపాన్నీ, ఆనాటి భూస్వామ్య వ్యవస్థలోని వివిధ పరిణామాలకు ఒక దృశ్యరూపాన్ని మనముందు ఉంచారు సీతాదేవి. తెలుగు నవలాసాహిత్యంలో ఎన్నదగిన ఉత్తమ నవలల్లో ఈ నవల ఒకటని గట్టిగా చెప్పవచ్చు. ఈ నవల కథానాయకుడు సాంబయ్య, మట్టిలో పుట్టి మట్టిలో పెరిగి మట్టిని నమ్ముకున్న మనిషి. నేలనీ, మట్టినీ నమ్ముకున్న రైతు ఆశలు, ఆకాంక్షలూ, పట్టుదల ఎలా ఉంటాయో, రైతుకి భూమితో గల అనుబంధాన్ని సాంబయ్య పాత్ర ద్వారా వివిధ కోణాల్లోంచి చూపెట్టారు రచయిత్రి. మూడు తరాల జీవితాలలో వివిధ పరిణామాలను సమర్ధవంతంగా, ఎంతో దృశ్యాత్మకంగా అక్షరీకరించారు సీతాదేవి. వైవిధ్యమైన పాత్రలు, వారి విభిన్నమైన మనస్తత్వాలను గురించి చదువుతుంటే బాగా పరిచయమున్న వ్యక్తుల గురించి చదువుతున్నట్లే అనిపించడం విశేషం. ప్రతి సన్నివేశం ఒక పుస్తకాన్ని చదువుతున్నట్లు కాక, మనోఫలకంపై ఒక దృశ్యాన్ని చూపెడుతూ ఉంటుంది పాఠకుడికి. నవల పూర్తయిన చాలాకాలం వరకూ సాంబయ్య, కనకయ్య, రామనాథబాబు, రవి, వరూధిని... మొదలైన పాత్రలందరూ అలా కళ్లముందర కదులుతూనే ఉంటారు! ఎంతగానో కదిలించివేసే కథ.. కథనమూనూ!

ఏదైనా ప్రేరణో ఉందో లేక యాదృచ్ఛికమో తెలీదు కానీ నాకీ నవల చదువుతూంటే రెండు ఆంగ్ల నవలలు గుర్తుకు వచ్చాయి. ప్రఖ్యాత అమెరికన్ రచయిత్రి, నోబుల్ పురస్కార గ్రహీత 'Pearl Buck' రాసిన 'The Good Earth', Thomas Hardy నవల 'The Mayor of casterbridge'. 'The Good Earth'లో కథానాయకుడు 'wang lung'; 'Mayor of caster bridge' లో కథానాయకుడు 'Henchard'. ఈ మూడు నవలల్లోనూ కథానాయకుడుది ఒకటే దుస్థితి.. రెక్కల కష్టం వల్లనే సామాన్యుడి నుండి ధనికుడిగా ఎదగడం, ఆ తర్వాత మళ్ళీ ఏదో కారణాన పతనమైపోయి మళ్ళీ సామాన్యుడైపోవడం. కథ, కారణాలు మాత్రమే వేరు వేరు. ఒకవేళ ఎక్కడైనా వీటి ప్రేరణ ఉండి ఉన్నా కూడా, "మట్టి మనిషి" నవలకు స్వతంత్ర్యంగా నిలబడి ఒక గొప్ప నవల అనిపించుకోదగ్గ లక్షణాలన్నీ ఉన్నాయి.

**సాంబయ్య – పరిచయం:**

తల్లి తండ్రి ఆహర్నిశలూ శ్రమించి ఆర్జించిన భూమి సాంబయ్యది. అతని తండ్రి వెంకయ్య ఉత్తరాది నుండి ఆ ఊళ్ళోకొచ్చి మోతుబరి రైతు వీరభద్రయ్య దగ్గర పాలేరుగా కుదురుతాడు. తర్వాత నాలుగేళ్లలో నాలుగొందలు సంపాదించి, రెండెకరాల పొలం కౌలుకి తీసికొని రెండేళ్ళలో పన్నెండెకరాల కౌలు వ్యవసాయం చేయగలిగే స్థితికి చేరాడు. అతని భార్య మంగమ్మ కూడా ఆ ఇంటా ఈ ఇంటా పనిచేస్తూనే పొలం పనులలో కూడా భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. పాతికేళ్ళు రాగానే సాంబయ్యకి దుర్గమ్మ నిచ్చి పెళ్ళి చేసి ఒకరి తరువాత ఒకరు పరలోకానికి ప్రయాణమవుతారతని తల్లిదండ్రులు. సాంబయ్య పుట్టేనాటికి రెండెకరాలున్నవారి మాగాణి, అతడికి బిడ్డ పుట్టే సమయానికి నాలుగెకరాల మాగాణీ, మూడెకరాల మెట్ట ఆయి, ఇంటి స్థలం, దొడ్లు దోవలతో ఊళ్ళోని సన్నకారు రైతులలో ఒకడిగా

నిలుస్తాడు సాంబయ్య.

సమయానికి సరైన వైద్యం అందక భార్య పోయినప్పుడు ఊరివాళ్ళు "కర్కోటకుడు" అన్నా సాంబయ్య పట్టించుకోడు. అతడికి ఏనాడూ ఇరుగుపొరుగువారితో సంబంధం లేదు. తాను, తన పొలము తప్ప ఊళ్ళో వారి వ్యవహారాల్లో జోక్యం కలగజేసుకోవడం ఇష్టం ఉండదు అతనికి. తన పక్క పొలం ఎవరిదీ, వాళ్ళేమన్నా అమ్మే ఉద్దేశంలో ఉన్నారా అన్నదే అతనికి కావాల్సినది. సాంబయ్యకున్న భూమి దాహం అతడిని మరింత శ్రామికుడిగా, కఠినుడిగా మారుస్తుంది. భార్య అనారోగ్యాన్ని కూడా పట్టించుకోడతను. ఊళ్ళో వాళ్ళకి పొలాన్ని అమ్మిపెట్టి, కొనిపెట్టే పని చేసే కనకయ్య సాయంతో మరికొంత పొలం కొంటాడు సాంబయ్య. కాంతమ్మ పొలం స్వాధీనమైన రాత్రి రెండు ఝాములదాకా ఐదెకరాల పొలం గట్టు తెగగొట్టి తన పొలంలో కలుపుకుంటాడు. మొత్తం తొమ్మిదెకరాల మాగాణి, మూడెకరాల మెట్టకు తన కొడుకు వెంకటపతి వారసుడని మురిసిపోతాడు సాంబయ్య. తాను మళ్ళీ పెళ్ళి చేసుకుంటే భూమిలో వాటా ఇవ్వాల్సివస్తుందని ఒంటరిగానే ఉండిపోయి కొడుకుని పెంచి పెద్ద చేస్తాడు.

బడికి కాక, కొడుకు వెంకటపతిని తనతో పాటుగా పొలానికి తీసుకెళ్లటానికే నిర్ణయించుకుంటాడు సాంబయ్య. వెంకటపతికి పెళ్ళీడుకొచ్చేసరికీ ఎనభై ఎకరాల సుక్షేత్రమైన మాగాణి, సుమారు పాతికవేల కవిలె, దొడ్లూ దోవలు, కొత్తగా కట్టిన డాబాఇల్లు గల షావుకారవుతాడు సాంబయ్య. ఊళ్ళో అతని పరపతి పెరుగుతుంది. అనుకున్నంత పొలం చేతిలోకి వచ్చేవరకూ కొడుక్కి పెళ్ళి ప్రయత్నాలు చెయ్యకుండా ఆలస్యం చేస్తాడు. ముప్పై ఏళ్ళు వస్తున్న కొడుకు పరిస్థితి చేదాటుతున్నట్లు అనిపించగానే అతనికి పెళ్ళి చెయ్యాలని గుర్తుకు వస్తుంది సాంబయ్యకి! కానీ అదృష్టం అందలం ఎక్కిస్తే బుద్ధి బురదలోకి లాగిందన్నట్లు ఒక చిత్రమైన కోరిక పుడుతుంది అతడి బుర్రలో... తన తండ్రి పాలేరుగా చేసిన వీరభద్రయ్య కొడుకు బలరామయ్య తో వియ్యమొందాలని! ఆస్తి హరించుకుపోయి అప్పుల్లో కూరుకుపోయి ఉన్న బలరామయ్య గత్యంతరం లేక ఆఖరి కుమార్తె వరూధినిని వెంకటపతికిచ్చి వివాహం జరిపిస్తాడు. ఈ వ్యవహారమంతటికీ ముఖ్యకర్త, మధ్యవర్తి గుంటనక్కలాంటి కనకయ్య!

రైతులకూ పెట్టుబడిదారులకూ మధ్యవర్తిగా ఉంటూ, ఊరువాళ్ల దయాధర్మాలతో సంసారం నడుపుతూ, చిన్నచిన్న పెట్టుబడులతో వ్యాపారం ప్రారంభించి, ఏదో ఒక దోవన లాభాలార్జించి భూస్వామిగా మారిన ఊసరవెల్లి కనకయ్య. ఒకనాడు బక్కపలచగా, తిండి లేక ఆవురావురుమన్న కనకయ్య కాలువగట్టు క్రింద పదెకరాల పొలం, తాను రైతుల ధాన్యం అమ్మించిన మిల్లులోనే పావలా వాటాదారు అవుతాడు. నాలుగువేలతో ఇల్లు బాగుచేసుకుని మేడ కడతాడు. మోసాలతో ధనార్జన చేసి కొడుకునీ, అల్లుడ్నీ లాయర్లను చేస్తాడు. అక్రమార్జనతో బలరామయ్య మేడను కూడా కొని, చివరికి ఆ ఊరి సమితి ప్రెసిడెంట్ కూడా అవుతాడు. సమకాలీన వ్యవస్థలోని లోటుపాట్లకు, మోసకారితనానికీ ప్రతీక అతని పాత్ర.

జమిందారీ బిడ్డనన్న అహంకారంతో, పట్నవాసపు మోజుతో సాంబయ్య కోడలు వరూధిని పల్లె వదిలి పట్నంలో కాపురం పెడుతుంది. ఆమె కట్టడితో పెళ్లాం చాటు మొగుడిగా మారిన వెంకటపతి తండ్రిని పల్లెలో వదిలి పట్నం మకాం మార్చేస్తాడు. తన మొండితనం వల్ల, అజాగ్రత్త వల్ల, అదుపులేని నడవడి వల్లా, జీవితాన్ని అభాసుపాలు చేసుకుంటుంది వరూధిని. కనకయ్య వంటి గుంటనక్కల వల్ల, రామనాథబాబు వంటి మోసకారులవల్ల, వెంకటపతి చేతకానితనం వల్లా, సాంబయ్య చెమట చిందించి సంపాదించిన ఆస్తంతా కర్పూరంలా హరించుకుపోతుంది. చివరకి ఓ దిబ్బ మీద పూరిపాకలో ఒంటరిగా మిగులుతాడు సాంబయ్య! అతని కష్టార్జితమంతా మోసకారుల పాలవుతుంది. అయినా దిగాలుపడకుండా ఒంటరిపోరాటానికి సిద్ధమవుతాడు వృద్ధుడైన సాంబయ్య. అంతటి పేదరికంలో, వృద్ధాప్యంలో కూడా ఓటమి అంగీకరించని అతని పట్టుదలకూ అతడ్ని మెచ్చకుండా ఉండలేము.

మితిమీరిన అహంకారంతో, విశృంఖల ప్రవర్తనతో తన జీవితాన్నే నాశనం చేసుకున్న వరూధిని చావుపై జాలి కలిగుతుంది తప్ప అసహ్యం వెయ్యదు. భార్య హఠాన్మరణం తరువాత తండ్రికి మొహం చూపలేని వెంకటపతి కాన్వెంట్ లో చదువుతున్న తన కొడుకుని ఊరిపొలిమేరల్లోకి తీసుకువెళ్ళి తాత వద్దకు వెళ్లమని చెప్పి వదిలి వెళ్ళిపోతాడు. "తాతయ్యా" అనే మమకారం నిండిన పిలుపు సాంబయ్యలో వాత్సల్య సాగరాన్ని ప్రవహింపజేస్తుంది. క్షీణించిపోతున్న అతడి జీవశక్తి తిరిగి పుష్టిని సంపాదించుకుంటుంది. అతడి చీకటి జీవితంలో మళ్ళీ వెలుగు కనిపిస్తుంది. "తాతయ్యా" అంటూ తనను తాను సాంబయ్య మనవడిగా పరిచయంచేసుకున్న మనవడు రవిని "నువ్వే నా వారసుడివి" అని పరవశంతో హత్తుకుంటాడతను. మనవడి కోసం బ్రతకాలనీ, జీవితంతో మళ్ళీ పోరాడాలనీ అనిపిస్తుంది సాంబయ్యకి. రవి ప్రతి మాటా అతడి కళ్ళల్లో వెలుగునే నింపుతాడు. జీవనం కోసం దిబ్బ మీద బీర, సొర, కాకర, చిక్కుడు విత్తనాలు నాటి, ఒక మామిడి టెంక కూడా పాతి మట్టి కప్పుతాడు. తాను నోరు విడిచి కౌలుకడిగిన అడిగిన నాలుగెకరాలు ఇవ్వడానికి వెనకాడుతున్న కనకయ్యతో "నీ మగతా నీకిస్తే సరిగదా? నా జీవితంలో నే నెవరికీ ఒక్క కానీ ఎగ్గొట్టలేదు. ఒకళ్ళది ఒక కానీ తినలేదు. నేను తిన్నా మరొకళ్ళకి పెట్టినా నా కష్టార్జితమే!" అన్న సాంబయ్య మాటలు మూర్తీభవించిన అతడి ఆత్మాభిమానాన్ని చూపెడతాయి.

ముసలి దున్ననూ, ఒట్టిపోయిన గేదెనూ జతకలిపి పదేళ్ళ మనవడితో బంజరు భూమిని దున్నటానికి బయల్దేరిన సాంబయ్యను ఊరంతా ఆశ్చర్యంగా చూస్తుంది. రామనాథబాబు రవిని పట్నంలో చదివిస్తానని వచ్చినా, తాతను విడిచి రానంటాడు మనవడు. దున్న పోయినప్పుడు రవి బాధ పడుతూ "హౌ క్రూయల్ యు ఆర్? తాతయ్యా!" అంటాడు. అందుకు సమాధానం చెప్తూ, "దున్నుతూ దున్నుతూ కాడి మెడమీద వేసుకుని పోయిందిరా! దాని ఋణం అది తీర్చుకుని హాయిగా కన్నుమూసింది. అదృష్టం అంటే దాందేరా! మనుషులకు కూడా రాదురా ఆ అదృష్టం!" అంటాడు. ఎంతటి జీవనసత్యం దాగి ఉందో ఆ మాటల్లో!

మరోసారి – "తాతయ్యా నీకు చదువు రాదుగదా! ఇదంతా నువ్వెట్టా నేర్చుకున్నావ్?" అనడుగుతాడు మనవడు.. అప్పుడు..

"ఈ నేల నా పలక. నాగలే నా బలపం. పొలమే నా బడి! భూమ్మీద దిద్దాను. రోజుకి ఒక్కొక్కమాట ఈ భూమే నేర్పింది నాకు. నా తల్లీ, దైవం, గురువూ ఈ భూమేరా రవీ! ఇప్పుడు చెప్పరా మనవడా? నీ బడి గొప్పదో నా బడి గొప్పదో? నీచదువెక్కువో నా చదువెక్కువో?" అంటాడు సాంబయ్య! ఇతను కదూ జ్ఞాని !

తాతామనలిద్దరూ రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన బంగారం లాంటి పంటను చూసేసరికీ ఆ ఊరి సమితి ప్రెసిడెంటైన కనకయ్యకు దుర్బుద్ధి పుడుతుంది. ప్రభుత్వం సొమ్మని చెప్పి పోలీసు బలగంతో ఆ పొలాన్ని లాక్కుంటాడు. "ఈ నేల నాది..ఈ పంట నాది... ఈ భూమి.." అంటూనే నేలకొరుగుతాడు సాంబయ్య. మట్టిలో పుట్టి, మట్టిని నమ్ముకుని బ్రతికిన సాంబయ్య జీవితం అలా మట్టిలోనే సమాప్తమవుతుంది. రవిని పోలీసులకప్పజెప్తాడు కనకయ్య. "వస్తాన్రా.. తిరిగొస్తాన్రా.. నీ కోసం.. తుపాకీ..!" అని కనకయ్యను హెచ్చరిస్తూ పోలీసుల వెంట వెళ్తాడు రవి. ఈ తిరుగుబాటుకి నాంది "ఈ నేలా, ఈ గాలీ, ఈ ఆకాశం చమటోడ్చేవాడి సొత్తురా! అందలమెక్కినోడిది కాదురా!" అన్న తాతయ్య సాంబయ్య మాటలే...! నవలాసారం కూడా ఇదే మరి!!

చివరలో సాంబయ్యకు అటువంటి దీనమైన మరణం ప్రాప్తించకుండా ఉంటే బాగుండేదేమో అనిపిస్తుంది. సాంబయ్య పోరాటస్పూర్తి, కష్టాల్ని ఎదురీదే పట్టుదల పాఠకులలో అతడి పట్ల గౌరవాన్నీ, అభిమానాన్నీ పెంచుతాయి. అందువల్లే భార్యను బ్రతికించుకోలేని కఠినుడిగా, పిసినారిగా కాకుండా తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి, పట్టుదలతో అహర్నిశలూ శ్రమించి, నేలను నమ్ముకున్న ఒక స్పూర్తిదాయకుడైన శ్రామికుడిగానే సాంబయ్య గుర్తుండిపోతాడు. అంతేకాదు, ప్రతికూల పరిస్థితులలో సైతం ధైర్యంగా నిలబడి, విధితో పోరాడటమెలానో సాంబయ్య పాత్ర మనకు నేర్పిస్తుంది.

# పార్వతీశం



# బారిష్టర్ పార్వతీశం

"క్షితిలో బారిష్టరు పా
ర్వతీశమును చెప్పి పిదప పలుకవలెగదా
కితకితల కితరులను భా
సితసిత సుశ్లోకుడతడు సిరిసిరిమువ్వా"

అని మహాకవి శ్రీశ్రీ చే మెచ్చుకోబడ్డవాడు బారిష్టరు పార్వతీశం. మొక్కపాటి నరసింహశాస్త్రిగారు అతడి సృష్టికర్త. తనను పార్వతీశం సృష్టికర్తగానే జనులు గుర్తించడం, ఆ గుర్తింపుని తాను అంగీకరించడం కూడా గొప్పేనంటారు నరసింహశాస్త్రిగారు. తెలుగు నవలా సాహిత్యంలో మొట్టమొదటి హాస్య నవలగా పేరుపొందిన "బారిష్టరు పార్వతీశం" నవలా నాయకుడు. పార్వతీశం ఉత్తమ లక్షణాలున్న నాయకుడేమీ కాదు. అలాగని వీరుడూ కాదు. మనలో కలిసిపోగల ఒక మామూలు మనిషి. అందుకే తన పాత్ర జన్మించి తొంభైఏళ్ళైనా ఈనాటికీ విశేషంగా ఆదరింపబడుతున్నాడు పార్వతీశం. ఒక అనాగరికపు పల్లెటూరి కుర్రాడు అభ్యుదయ భావాలు గల వ్యక్తిగా, ప్రముఖుల ప్రశంసలందుకున్న బాధ్యతాయుతమైన బారిష్టరుగా ఎలా ఎదిగాడో తెలిపే కథే '**బారిష్టరు పార్వతీశం**'!



**బారిష్టర్ పార్వతీశం నవల:**

ఒక అమాయకమైన కుర్రవాడిగా, అల్పజ్ఞుడుగా మొగల్తుర్రు నుండి మద్రాసుకూ, అక్కడి నుండి ఇంగ్లాండు చేరడానికి తాను పడ్డ అష్టకష్టాలూ, అగచాట్లనూ స్వచ్ఛమైన తెలుగులో, కడుపుబ్బ నవ్వించే హాస్యధోరణిలో స్వీయచరిత్ర మాదిరిగా తన కథను **ఉత్తమ పురుషలో** చెప్పుకుపోతాడు పార్వతీశం ఈ నవలలో. 1924లో జరిగిన మొదటి ముద్రణలో పార్వతీశం ఇంగ్లాండు చేరేదాకా మాత్రమే కథ రాసారు నరసింహశాస్త్రిగారు. మరో నలభై ఏళ్ళ తర్వాత మిత్రుల ప్రోత్సాహంతో 1971 లో రెండు, మూడు భాగాలను కూడా వారు

రచించారు. ఈ 2,3 భాగాలు మొక్కపాటివారు చెబుతుండగా రాసిపెట్టినది శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గారూ, కప్పగంతుల రాజరాజేశ్వరి గారూ ననీ తెలుపుతూ, వారిరువురికీ తన కృతజ్ఞతలు, ఆశీస్సులు అందజేసారు రచయిత. ఈ మూడు భాగాలూ కలిపి 'ఆంధ్రజ్యోతి వారపత్రిక'లో ధారావాహికగా వెలువడ్డాయి. ఆ ప్రచురణ కోసం కొన్ని ప్రత్యేక సన్నివేశాల్లో బాపూ వేసిన **వ్యంగ్య చిత్రాలు** కథనాన్ని మరింత ఆకర్షణీయం చేస్తాయి. అయితే, రచనాసమయంలో గల నలభైయ్యేళ్ళ అంతరం మూలంగా మొదటి భాగంలో ఉన్న హాస్య ధోరణి తగ్గి కాస్త గంభీరంగా నడుస్తుంది కథనం. రచయితకు తాను సృష్టించిన పార్వతీశం పాత్ర బహుళ ప్రజాదరణ పొందటం వల్లనో, పార్వతీశం పట్ల తనకు అభిమానం పెరగడం వల్లనో పార్వతీశం పాత్రలో మొదట్లో చూపించిన అమాయకత్వం – హాస్యం పాళ్ళు తగ్గించి, అతడి వ్యక్తిత్వ పరిణితిని ఎక్కువగా చూపెట్టారనిపిస్తుంది.

నవల చదువుతుంటే 'ఏమిటీ ఇంత మూర్ఖంగా, ఇంత అజ్ఞానంలో ఎవరైనా ఉంటారా?' అనీ, 'పాశ్చాత్య పద్ధతులను మరీ ఇంత విపులంగా రాయాలా..', 'ఇదేమంత విడ్డూరమనీ..' మొదలైన సందేహాలు కలుగుతాయి. **కానీ ఎవరైనా కూడా చదివేప్పుడు ఇది తొంభైఏళ్ల క్రితం జరిగిన సృష్టి అన్న సంగతినీ, రచనాకాలపు సామాజిక పరిస్థితులనూ, ఆనాటి ఆచారవ్యవహార పద్ధతులనూ తప్పక దృష్టిలో పెట్టుకుని చదివడం ఎంతైనా అవసరం.** ఆ దృష్టికోణంతో చదివితేనే ఈ అపురూప సాహిత్యగుళిక రసాస్వాదన సాధ్యమవుతుంది. 1940 లో హెచ్.ఎమ్.రెడ్డి గారి దర్శకత్వంలో ఈ నవల చలనచిత్ర రూపం కూడా దాల్చి తెలుగులో వచ్చిన తొలి హాస్యకథాచిత్రంగా కూడా పేరుతెచ్చుకుంది. 'లంక సత్యం ' ప్రధాన పాత్రలో నటించగా, 'జి.వరలక్ష్మి ' పార్వతీశం భార్యగా నటించారు.

### రచయిత మొక్కపాటి నరసింహశాస్త్రి – పార్వతీశం పుట్టుపూర్వోత్తరాలూ:

మొక్కపాటి నరసింహశాస్త్రి తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం వాస్తవ్యులు. అనేక కథలు, నాటకాలు రచించారు. వారి రచనల్లో **గాజులపాలెం గాంధీ, బండ సుబ్బడు, పిలక, నేను మా ఆవిడ** మొదలైన కథలు; **సుబ్బారాయుడు, ఏకాంకి** నాటికలు; **ఏకోదరుడు** నవల; **హాస్యం గురించిన విశ్లేషణాత్మక గ్రంథం** ప్రసిద్ధిగాంచాయి. వీటన్నింటినీ మించి ఒక్క "**బారిష్టరు పార్వతీశం**" నవలే ఎన్నో ప్రశంసలను, అభిమానులనూ సంపాదించుకుంది. బారిష్టర్ పార్వతీశం ద్వారా ఉత్తమ పురుషలో కథ చెప్పే ప్రక్రియను తెలుగు నవలకు పరిచయం చేసినది నరసింహశాస్త్రి గారే. మనుషుల రూపురేఖల్లో, వేష భాషల్లో మన కంటికి చెవికి అలవాటైన వాటి కంటే భిన్నంగా ఎవరైనా కనబడితే మనకి నవ్వు వస్తుంది. ఏ మనిషిలోనైనా చురుకుదనం, వివేకం మొదలైన లక్షణాలు లోపించినా అనాగరీకుడిలా కనబడి, అతడి చేష్టలూ, మాటలు నవ్వు పుట్టిస్తాయి. కథా రచనలో, నాయకుడి మాటల్లో మనుషుల్లోని ఈ వ్యత్యాసాలనూ చూపెడితే పాఠకులు నవ్వుకుంటారనిపించి పార్వతీశం పాత్రను ఆ విధంగా మలిచినట్లు మొక్కపాటివారు చెప్తారు.

మొక్కపాటివారు 1913లో ఇంగ్లాండు వెళ్ళి ఎడింబరో విశ్వవిద్యాలయంలో వ్యవసాయ శాస్త్రం నాలుగేళ్ళు చదివి డిగ్రీ తీసుకోకుండానే స్వదేశానికి వచ్చేసారుట. ఈ ప్రయాణం తాలూకూ జ్ఞాపకాలతోనే పార్వతీశం రూపుదిద్దుకుని ఉంటాడని నా అభిప్రాయం. ఎందుకంటే కొన్ని సంఘటనలూ చదువుతుంటే అవి కల్పితాలా కాక యదార్థఘటనలుగా గోచరిస్తాయి. ఇంకా పార్వతీశం అభిప్రాయాలూ, ఆలోచనలూ కూడా మనసుకు ఎంతో దగ్గరగా వచ్చి ఇంగ్లాండు వెళ్ళొచ్చిన మనిషి మన ఎదురుగా కూర్చుని తన అనుభవాలు చెప్తున్నట్లు అనిపిస్తుంది.

ఇక పార్వతీశం జననం ఎలా అయ్యిందీ అంటే, ఒక దీపావళికి మొక్కపాటివారు వారి అత్తవారి ఊరు **గుమ్మలూరు** వెళ్ళారుట. అక్కడ బంధుమిత్రులతో కబుర్లాడుతూ పడవ ప్రయాణంలో ఉండే కష్టాలూ, తమాషాలూ చెప్పుకుపోతూంటే అదంతా కథలా రాయమని వాళ్ళంతా ప్రోత్సహించారుట. అప్పటికప్పుడు కాగితం మీద కథ మొదలుపెట్టి ఓ కుర్రవాడిని నర్సాపురం నుండి నిడదవోలు దాకా

తీసుకువెళ్ళి, అక్కడి నుంచీ మద్రాసు తీసుకువెళ్ళారుట. ఆ కుర్రవాడికి నామకరణం కూడా చెయ్యకుండా ఆ కథని బంధుమిత్రులకి చూపెడితే చాల మెచ్చుకున్నారుట. అప్పటి రోజుల్లో ఇంగ్లాండు వెళ్లడమన్నా, బారిష్టరు చదవడమన్నా ఎంతో గొప్ప కాబట్టి మొక్కపాటివారు ఆ కుర్రవాడిని ఇంగ్లాండు పంపిద్దామని నిశ్చయించారుట. భవిష్యత్తు తేలింది కాబట్టి తక్షణం కుర్రవాడికి పూర్వరంగం సిద్ధం చేసారుట. ఆ తర్వాత తన కథ తానే చెప్పుకుపోయాడుట పార్వతీశం. నవలకు ఈ పేరును ఖరారు చేసినది వారి మిత్రులు శివశంకర శాస్త్రి గారట. 'ఇది యునీక్ వర్క్ అవుతుందనీ, బ్రహ్మాండమైన జనాదరణ పొందుతుందనీ ' మరో మిత్రులు నోరి నరసింహశాస్త్రి గారన్నారుట.

**బారిష్టరు పార్వతీశం – పాత్ర పరిచయం:**

నర్సాపురం దగ్గర మొగలితుర్రు అతని కాపురస్థలం. ఇంటి పేరు వేమూరివారు, పేరు పార్వతీశం. టెయిలర్ స్కూళ్ళో అయిదో ఫారము దాకా చదువుకున్నాడు. కొన్ని కారణాల వల్ల ఒకటి రెండేళ్ళు అదే క్లాసులో గడిపిన తర్వాత చదువు మానివేసి ఇంటివద్దనే ఉంటూ సభాసమావేశాలు తదితర కార్యక్రమాల్లో పాల్గొంటూ దేశం గురించి, దేశాన్ని ఉద్ధరించడాన్ని గురించీ ఆలోచిస్తూ కాలం గడుపుతుండగా, స్నేహితుడొకడు ఇంగ్లాండు వెళ్ళి చదువుకుని రమ్మని సలహా ఇస్తాడు. వ్యవసాయదారుడైన తండ్రి తన ప్రయాణానికి సమ్మతించడని గ్రహించి, ఆయనతో చెప్పకుండా ఓ స్నేహితుని దగ్గర సొమ్ము బదులు పుచ్చుకుని ప్రయాణ సన్నాహాలు చేసుకుంటాడు పార్వతీశం. మొగలితుర్రు, నర్సాపురము, ఆ చుట్టు పక్కల రెండుమూడు గ్రామాలు తప్ప ప్రపంచమెరుగని అమాయకుడు అతడు. నానా ఇబ్బందులూ పడి అతడు రైలులో మద్రాసు ఎలా చేరాడు, అక్కడ నుండి స్టీమరు లో కొలంబో, అక్కడ నుండి మళ్ళీ స్టీమరులో ఇంగ్లాండు ప్రయాణం ఎలా చేసాడో; తన తెలివితక్కువతనం వల్ల, అల్పజ్ఞత వల్ల ఎంత నవ్వులపాలయ్యాడో, ఎన్ని అగచాట్లు పడ్డాడో "బారిష్టరు పార్వతీశం" నవల మొదటి భాగం తెలుపుతుంది. రెండవ భాగం అతడి ఇంగ్లాండులో బారిస్టరు ఎలా చదివాడో తెలిపితే, దేశానికి తిరిగివచ్చాకా అతడి జీవితంలో జరిగే మార్పులు, తన చదువును, వ్యక్తిత్వ వికాసాన్నీ స్వాతంత్ర్యోద్యమంలో ఎలా సద్వినియోగపరుచుకున్నాడో నవల మూడవభాగం తెలుపుతుంది.



నవల మొదట్లో ఇంగ్లాండు ప్రయాణానికి గానూ పార్వతీశం జాబితా ప్రకారం చేరవేసుకున్న కొబ్బరి నూనె, దంతధావనానికి పది కచ్చికలు నిలిపిన పొడుము, నాలుక గీసుకోవడానికి తాటాకు ముక్కలు, ఇత్తడి చెంబు, అద్దం, మరచెంబు, యజ్ఞోపవీతాలు, పట్టు మొలత్రాళ్ళు, రొట్టెలు కాల్చుకోవడానికి గోధుమపిండి, ఆవకాయ, అట్లపెనం, కిరసనాయిలు, పొయ్యి, మడత మంచం...మొదలైన మరిన్ని వస్తువులు, ఇవి పెట్టుకోవడానికి బంతిపువ్వు రంగు వేయించి చేయించిన సీనారేకు పెట్టె.. మొదలైన జాబితా చూసి నవ్వాపుకోలేము. తరువాత ఎలాగోలా మద్రాసు వరకూ అడుగడుగునా నవ్వులపాలౌతూ చేసే రైలు ప్రయాణం, మద్రాసులో సెలూన్ లో క్రాఫ్ చేయించుకునే వైనం, మంచి టోపీ కొనుక్కోబోయి ఆడవారి టోపీ కొనుక్కోవడం, స్టీమర్ ప్రయాణంలో ఆ టోపీని వదిలించుకోడానికి అతడు పడే పాట్లు, కొలంబో నుండి ఇంగ్లాండుకు చేసే స్టీమర్ ప్రయాణం ఆద్యంతం నవ్వు తెప్పిస్తాయి. ఇంగ్లాండులో లిఫ్ట్ ని హోటల్ రూం అనుకుని, అందులో ఉండనని పార్వతీశం పేచీ పెట్టే సన్నివేశం నాకన్నింటికన్నా నవ్వు తెప్పించింది. తన తెలివితక్కువతనం వల్ల

నవ్వులపాలైనా అతితెలివిగా తనను తాను సమర్థించుకోవడం కూడా హాస్యాన్ని పుట్టిస్తాయి. ఈ సంఘటనలన్నీ కూడా పార్వతీశాన్ని ఒక అమాయకుడిగా, అల్పజ్ఞుడుగా చిత్రీకరిస్తాయి. కానీ పార్వతీశాన్ని కేవలం ఒక పల్లెటూరి హాస్యగానిగా మనం జమకట్టలేము. చిన్నప్పుడు "ఎటువంటి వస్తువు మీద కాంతికిరణం పడితే పరావర్తన చెందుతుంది.." అని స్కూల్లో ఇన్స్పెక్టర్ అడిగితే.. ఆయన వైపు చూస్తూ తడుముకోకుండా "బట్టతల మీద" అన్నప్పుడు, మరోసారి రైల్వే స్టేషన్లో టికెట్ మాస్టర్ తో "మీ మొహము చూస్తే ఉలి ఆడిన తిరగటిరాయి, మీ తలకాయ చూస్తే సున్నపు పిడతా జ్ఞాపకము వస్తున్నాయని" అన్నప్పుడూ అతడిలోని తెగువ, ధైర్యం ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

పార్వతీశం ఒక హాస్యనాయకుడు మాత్రమే కాదు. అతడిలో సాహసం, పట్టుదల, కార్యదీక్ష మొదలైన సద్గుణాలన్నీ ఉన్నాయి. నర్సాపురములో పెద్దల ఉపన్యాసాలు విని దేశానికి ఏదో చెయ్యాలన్న తపనతో ఇంగ్లాండుకు వెళ్ళాలని నిర్ణయించుకోవడం, లోకజ్ఞానం లేకపోయినా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అనుకున్నది సాధించడానికి దేనికీ వెనకాడక ధైర్యంగా ముందుకుపోవడం పార్వతీశంలోని తెగింపునూ, పట్టుదలనూ చూపెడతాయి. రెండవ భాగంలో చదువు మొదలైన తరువాత అతడి వ్యక్తిత్వంలో వచ్చే మార్పు అతడిపై అప్పటిదాకా మనకు గల అభిప్రాయాన్ని కూడా మార్చేస్తుంది. నెమ్మది నెమ్మదిగా మనం పార్వతీశాన్ని ఇంకా మెచ్చటం మొదలుపెడతాము. కష్టపడి ఆంగ్ల భాష నేర్చుకుని అర్హత పరీక్ష పాసవ్వడం, మొదటి క్లాసులో టెన్నిసన్ పద్యం, అర్థం చెప్పి ఉపాధ్యాయుని మెప్పు పొందడం, అక్కడి విద్యార్థులకు చెడుగుడు నేర్పించడం, తాను గోల్ఫ్ ఆట నేర్చుకుని పలువురి మెప్పుని పొందడం.. మొదలైన సంఘటనలన్నీ పార్వతీశాన్ని ఒక సమర్థవంతుడైన యువకుడిగా నిలబెడతాయి.



ఎండింబరో లో మూడేళ్ళపాటు పార్వతీశం అద్దెకున్న ఇల్లుగలావిడ, ఆవిడ ఇద్దరు కూతుళ్లతో పార్వతీశం జరిపే సరస సంభాషణలు అతడిలోని చమత్కారాన్ని, హాస్య స్ఫూర్తినీ తెలుపుతాయి. హాస్యోక్తంగా సాగుతున్న కథనం కాస్తా పార్వతీశం తన విదేశీ స్నేహితురాలికి వీడ్కోలు చెప్పే ఘట్టంతో గంభీరంగా మారిపోతుంది. ఆ వియోగం, భావ తీవ్రత, వారిద్దరి అభిమానం కాస్త కంటతడి కూడా పెట్టిస్తాయి. ఇక్కడ కూడా వయసు ప్రలోభానికి లోబడక, స్నేహితురాలిచ్చే చనువును అనుకూలంగా తీసుకోకుండా పార్వతీశం చూపెట్టే నిబ్బరం, సంయమనం అబ్బురపరుస్తాయి. ఎంతో ఆలోచించిన మీదట అప్పటి(ఏభైఏళ్ల మునుపు) కాలమాన పరిస్థితులు, వారింటి ఆచార వ్యవహారాల దృష్ట్యా, పెద్దలు అంగీకరించరనే కారణమే కాక వివాహానంతర జీవితమెట్లా ఉంటుంది మొదలైన ఎన్నో తర్కాలు చేసి స్నేహితురాలి నుండి విడిపోవడానికే సిద్ధపడతాడు పార్వతీశం. అతడిలోని ముందుచూపు, జాగరూకత, **నిగరహాలను** తెలిపే గంభీరమైన సన్నివేశం ఇది.

నవల మూడవ భాగంలో పార్వతీశంలో పూర్తిస్థాయి వ్యక్తిత్వవికాసాన్ని చూస్తాము. స్వదేశానికి తిరిగివచ్చి తల్లిదండ్రులను

కలుసుకునే సన్నివేశాలు, వివాహం నిశ్చయమై, పెళ్ళి అయ్యేదాకా అతడి మానసిక స్థితి, భార్యతో అతడికి ఏర్పడ్డ అనుబంధం చాలా హృద్యంగా ఉంటాయి. అప్పటి సామాజిక పరిస్థితుల అవసరార్థం తండ్రి ఏర్పాటు చేసిన ప్రాయశ్చిత్త కార్యక్రమం ఓర్పుగా జరిపించుకోవడానికీ, పెద్దల మాటకు కట్టుబడి సాంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకోవడానికీ, మామగారి మాట ప్రకారం ఆయన ఇంట ప్రాక్టీసు ప్రారంభించడానికీ అతనికి తల్లిదండ్రులపై, పెద్దలపై గల అపారమైన భక్తిశ్రద్ధలే కారణం. వకీలు వృత్తి ప్రారంభించి బారిష్టర్ పార్వతీశంగా పేరుప్రఖ్యాతలు సంపాదించి కార్యసాధకుడిగా నిలుస్తాడు. విజ్ఞానవంతుడైన పార్వతీశంలో ఇక చిన్నప్పటి అజ్ఞానం, అల్పత్వం ఇసుమంతైనా కానరావు. భార్యను చదివించడం, అన్నివిధాలా ప్రోత్సహించడం పార్వతీశంలోని విశాల దృక్పథాన్నీ; స్వాతంత్ర్యోద్యమంలో అతడు పాల్గొనడం, ఉత్సాహం చూపిన భార్యను కూడా ప్రోత్సహించడం, గాంధీగారి ఉపన్యాసాలు విని ఉత్తేజితుడై మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొనడం ఇవన్నీ కూడా విదేశీ ప్రయాణం, ఉన్నత విద్యల వల్ల అతడిలో ఉదయించిన అభ్యుదయంగా మనం భావించవచ్చు.

ఈ విధంగా ఒక అమాయక మానవుడి స్థాయి నుండి విజ్ఞానవంతుడిగా, విద్యావేత్తగా, కార్యదక్షుడిగా, మానసికంగా, నైతికంగా కూడా ఎంతో ఎత్తుకు ఎదిగిన పార్వతీశం పాత్ర తెలుగు నవలా సాహిత్యంలోనూ, తెలుగువారి హృదయాల్లోనూ ఒక ప్రీతికరమైన పాత్రగా ఎప్పటికీ నిలిచిపోతుంది అనడంలో సందేహం లేదు.

# సుబ్బయ్య : అల్పజీవి




"సుబ్బయ్య సుందరుడు కాదు"
"సుబ్బయ్య ఒట్టి చచ్చు దద్దమ్మ"
"సుబ్బయ్య నంగిరిపింగిరిగాడు"
"నాన్న చాలా మంచివాడు"
"నాన్నకి అమ్మని చూస్తే భయం"
"సుబ్బయ్య ఈజ్ వెరీ ఇనెఫీషియంట్"
"సుబ్బయ్య పాపం ఒట్టి భయస్తుడు"

పై వాక్యాల ద్వారా మనకు సుబ్బయ్య అనే పిరికిమనిషి పరిచయం అవుతాడు. ఒక్కమాటలో చెప్పాలంటే రావిశాస్త్రి సృష్టించిన "అల్పజీవి" సుబ్బయ్య! "Courage is reckoned the greatest of all virtues; because, unless a man has that virtue, he has no security for preserving any other." అన్నారట ప్రఖ్యాత ఆంగ్ల రచయిత డాక్టర్ శామ్యూల్ జాన్సన్ . "ధైర్యం ఉంటేనే మిగతా సద్గుణాలుంటాయనీ గ్యారెంటీ ఉంది. భయానికీ మంచికీ పొందిక లేదు. పిరికివారెవరూ కూడా మంచివారు కాజాలరు, మంచికి నిలబడలేరు. మంచిగా ఉండాలంటే గుండెనిబ్బరం చాలా ఉండాలి." అంటారు రావిశాస్త్రి కూడా. ఈ ఆలోచనలోంచి అరవై ఏళ్లక్రితం పుట్టిన పాత్ర సుబ్బయ్య. ఆనాటి సమాజంలో దిగువ మధ్యతరగతి వర్గాల్లో రచయిత

ఎక్కువగా గమనించిన వ్యక్తుల గుణాలన్నీ కలిపి తయారయినవాడు సుబ్బయ్య. "Poverty makes people lose sight of the larger perspective. It makes them small, mean and wretched" అని ఒకచోట రాసుకున్నారుట రావిశాస్త్రి. సుబ్బయ్య పాత్ర చిత్రణ వెనకాల ఈ వాక్యం కనబడుతూ ఉంటుంది మనకి.

రచయిత : రావిశాస్త్రి

మహాకవి శ్రీశ్రీ అందించిన "రావిశాస్త్రి" పేరుతో తెలుగు సాహిత్యంలో తనదంటూ ఒక ప్రత్యేకమైన శైలినీ, ముఖ్యమైన స్థానాన్నీ నిలబెట్టుకున్న రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారి జననం 1922 జూలై 30న శ్రీకాకుళం జిల్లాల్లో జరిగింది. బి.ఏ.ఫిలాసఫీ చదివిన తరువాత మద్రాసులో లా చదివి తండ్రి లాగనే వృత్తిరీత్యా న్యాయవాది అయ్యారాయన. వారి తల్లిగారు సంగీతజ్ఞురాలే కాక అప్పట్లోనే ఆంగ్లనవలలు చదివేవారుట. అందువల్లే చిన్ననాటి నుండీ పుస్తకపఠనం, ఆంగ్ల సాహిత్యం పై మంచి పట్టు అలవడ్డాయి రావిశాస్త్రికి. చార్ల్స్ డికెన్స్ ఆయన అభిమాన రచయిత. డాక్టర్ సామ్యూల్ జాన్సన్ వాక్యాలను కూడా ఎక్కువగా ఉదహరించేవారు. సమాజోద్ధరణకు ఉపయోగపడే ఎంతో విలువైన సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు అందించారు రావిశాస్త్రి. ఆర్థిక పేదరికం ఎంత దుర్భరంగా ఉంటుందో స్వానుభవం ఉండడం వల్ల ఆయన రచనల్లో బడుగు వర్గాలు, శ్రామికులు, నిరుపేదల జీవితాల పట్ల చింత, ఆవేదన ఎక్కువ కనపడుతుంది. జీవనసమరంలో సామాన్య మానవుడు పడే అగచాట్ల పట్ల ఆయనకున్న అవగాహన, సానుభూతి అపారమైనది. రావిశాస్త్రి ఉత్తరాంధ్రకు చెందినవారవడం వల్ల వారి రచనల్లో ఆయా జిల్లాల మాండలీకం తొంగిచూస్తుంది. .

అరవైకి పైగా కథలు, ఎన్నో వ్యాసాలు కాక రావిశాస్త్రి మొత్తం తొమ్మిది నవలలు రచించారు. వాటిల్లో రాజు-మహిషి, రత్తాలు-రాంబాబు అసంపూర్ణంగా వదిలేసిన నవలలు, 'ఇల్లు ' చివరి నవల. ఆ తర్వాత మద్యపాన చట్టం నేపథ్యంలో రాసిన "ఆరుసారా కథలు" బాగా ప్రాచుర్యం పొందాయి. 1952లో రాసిన వారి మొదటి నవల "అల్పజీవి" ఎక్కువగా ప్రజాదరణ పొందింది. శిల్పపరంగా చూస్తే తెలుగులో వచ్చిన అత్యుత్తమ నవలల్లో ఒకటిగా 'అల్పజీవి'ని పేర్కొనచ్చు. అల్పజీవి చదివిన తరువాత శ్రీశ్రీగారు రావిశాస్త్రి గారిని వెతుక్కుంటూ వస్తే, విశాఖపట్నం హిందూ రీడింగ్ రూం లో వారిద్దరూ కలిసారుట. అల్పజీవి ప్రజాదరణ పొంది ఆ రచన యొక్క ఉద్దేశ్యం ఏమిటని ఎందరో పాఠకులు ప్రశ్నించాకా; శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు వంటివారు తనని గమనిస్తున్నారని తెలిసాకా, తన రచనల వల్ల చదివేవారికి ఏమిటి ఉపయోగం? వారికి ఇది మంచి అవుతుందా? చెడు అవుతుందా? అని ఆలోచించడం, అలా ప్రశ్నించుకుని అది మంచిదవుతుందని తోస్తేనే రాయడం మొదలుపెట్టానని చెప్పారాయన. ఒక మంచిని నిలబెట్టడం కోసం పతనమవుతున్న సామాజిక విలువలకు ప్రతినిధులుగా ఉన్న పాత్రలను సృష్టించడం అవసరమేనంటారు రావిశాస్త్రి.

అల్పజీవి నవల – చైతన్యస్రవంతి:

రావిశాస్త్రి నవలకు మొదట పెట్టిన పేరు "చేదు విషం జీవఫలం". ప్రధాన పాత్రపై రచయిత మమకారం ఉంచుకోరాదన్న అభిప్రాయంతోనేమో "హబ్బబ్బ హయ్యారే" అన్న పేరుతో భారతి పత్రికకు నవలను పంపించారుట. "అల్పజీవి" అన్న పేరుని భారతి వారు సూచించాకా తన సొంతపేరుతో ప్రచురణకు అంగీకరించారుట రావిశాస్త్రి.(అంతవరకూ మారుపేర్లతో రచనలు చేసేవారాయన.) మనిషి అభివృద్ధికి నిరోధకాలయ్యే స్వార్థం, కక్కుర్తి, పిరికితనం మొదలైన లక్షణాలను అసహ్యించుకునేవారాయన. అదే ఆయనతో అల్పజీవి రాయించింది. ఒక మనిషి ఎలా ఉండకూడదో తెలిపే నవల ఇది. "సుబ్బయ్య పాత్రకి శ్రీశ్రీగారి కోనేటిరావు, ఇంకా నిజ జీవితంలో కొందరు నమూనాలు" అంటారు రావిశాస్త్రి. "జేమ్స్ జాయిస్ మొదలైన వారి ప్రభావం వల్ల అల్పజీవిని సృష్టించడం జరిగింది. ఒక అమాయకమైన సామాన్య సంసారిగా సుబ్బయ్య పాత్ర గుర్తుండిపోతుంది. ఆనాడు సమాజంలో నాకు సుబ్బయ్య లాంటి అల్పజీవులు ఎక్కువగా కనిపించారు.

సుబ్బయ్యను గురించి తేలికగా రాయవచ్చు. ఏదో ఒక టెక్నిక్ ని ప్రవేశపెడదామనే ఉద్దేశంతో మాత్రం నేను అల్పజీవి రాయలేదు" 1993 ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో అన్నారు.

ఈ నవల చదివే ముందు ఇందులో వాడిన కథనాత్మక ప్రక్రియ గురించి కొద్దిగా తెలుసుకోవాలి. అల్పజీవి నవలలో రావిశాస్త్రి చైతన్య స్రవంతి పద్ధతిని జేమ్స్ జాయిస్ రచనల ప్రేరణతో వాడుకున్నానని చెప్తారు. జేమ్స్ జాయిస్ అనే ఐరిష్ రచయిత తన నవలలైన A Portrait of the Artist as a Young Man, Ulysses మొదలైన వాటిలో stream of consciousness అనే వర్ణనాప్రక్రియను వాడుకున్నాడు. తర్వాత "వర్జీజియా వుల్ఫ్", "సామ్యూల్ బెకెట్", "డోరతీ రిచర్డ్సన్" మొదలైన ఆంగ్ల రచయితలు తమ రచనల్లో ఈ "stream of consciousnes" వర్ణానాప్రక్రియను వాడుకున్నారు. దీనినే తెలుగులో "చైతన్య స్రవంతి" అన్నారు. రావిశాస్త్రి తరువాత తర్వాత తెలుగులో ఈ కథనాత్మక ప్రక్రియను వడ్డెర చండీదాస్, నవీన్(అంపశయ్య), బుచ్చిబాబు, వినుకొండ నాగరాజు (ఊబిలో దున్న), కాశీభట్ల వేణుగోపాల్ మొదలైన రచయితలు తమ రచనల్లో వాడుకున్నారు. చైతన్య స్రవంతి వర్ణనా విధానంలో కథ జరుగుతుండగా మధ్య మధ్య కథకుడు/నాయకుడు తన అంతరంగాన్ని, తనలో జరుగుతున్న సంఘర్షణను తనలో తాను అనుకుంటున్నట్లుగా పాఠకుల ముందర పెడతాడు. తద్వారా కథకుడి/నాయకుడి మానసిక స్థితి, అతడిలోని మనోవైకల్యాలనూ పాఠకుడు బాగా దగ్గరగా గమనించగలుగుతాడు. అందువల్ల కథకుడి/నాయకుడి పాత్ర , అతడి ప్రవర్తన పాఠకులకు ఇంకా బాగా అర్థమౌతాయి. వ్యాకరణ దోషాలు రాకుండా ఈ ప్రక్రియ ద్వారా నవలను నడిపించడానికి రచయితకు చాలా నేర్పు అవసరం.

సుబ్బయ్య – పాత్ర పరిచయం:

సుబ్బయ్యకు సుమారు ముప్ఫై ఐదేళ్ళ వయసు. పొడవూ, పొట్టీ కాకుండా సమమైన ఎత్తులో సన్నగా ఉంటాడు. అందమైనవాడేమీ కాదు. స్వతహాగా భయస్తుడైన సుబ్బయ్యలో స్త్రీలలో కనబడే కోమలత్వం కనిపిస్తుంది. కూరలో ఉప్పెక్కువైందేమని భార్యని ప్రశ్నించలేనంత పిరికివాడు. తల్లి చిన్ననాడే చనిపోతే తండ్రి సోమయ్య నీడపట్టున అల్లారు ముద్దుగా పెరుగుతాడు సుబ్బయ్య. సోమయ్య ద్వితీయ వివాహం చేసుకుంటాడు. వికృతంగా ఉండే ఆమెది కౄరమైన మనస్తత్వం కూడానూ. పసివాడన్న జాలి కూడా లేకుండా సుబ్బయ్యను బాగా కొట్టేదావిడ. ఓ ఏడాది కాపురం తర్వాత ఆవిడ సోమయ్యను వదిలి వెళ్ళోతుంది కానీ ఆవిడ వల్ల సుబ్బయ్యలో ప్రవేశించిన భయం మాత్రం అలానే ఉండిపోతుంది. సుబ్బయ్యకు ఆరేళ్ళుండగా ఓ రాత్రిపూట తండ్రితో నడిచి వెళ్తుండగా ముగ్గురు ఆగంతకులు సోమయ్యను చావబాది పారిపోతారు. పెద్దయ్యాకా కూడా ఒక్కో రాత్రి సుబ్బయ్య ఉలిక్కిపడి లేచికూచునేంతగా ఆ సంఘటన సుబ్బయ్యను కలవరపరుస్తుంది. ఆ విధంగా చిన్నతనం మొదలు ఏ పని చెయ్యాలన్నా భయం అతడ్ని వదలదు. క్లాసులు ఎగ్గొట్టకుండా చదువుకుంటాడు. అనవసరంగా ఎవరి జోలికీ పోడు. తగువులు పడడు. టికెట్టు లేకుండా ప్రయాణం చెయ్యడు. కూరలమ్మే మనిషితో బేరాలాడ్డానికి కూడా జంకుతాడు. ఎవర్నీ అప్పు అడగడు. అవసరమైనా ఆఫీసులో శెలవు అడగటానికి, ఆఖరుకి ఆఫీసు బంట్రోతులకు కూడా భయపడే సుబ్బయ్య "వెరీ ఇనఫీషియంట్" అనే రిమార్కు సంపాదించుకున్న అతి భయస్తుడు.

సుబ్బయ్య భార్య సావిత్రిది జమిందారీ వంశం. సావిత్రి అన్న వెంకట్రావ్ సుబ్బయ్య సహపాఠి. తాతలు గడించిన ఆస్తి కరిగించేసిన తండ్రి గతించాకా ఇంటి బాధ్యతంతా వెంకట్రావ్ మీద పడుతుంది. పధ్ధెనిమిదేళ్ళ వయసులో మేనమామ మోసం వల్ల దెబ్బ తిన్న అతడు జీవితంతో యుద్ధానికి దిగి మసి పూసి మారేడుకాయను చేయగల స్వార్థపరుడుగా మారిపోతాడు. సుబ్బయ్యకు ప్రభుత్వోద్యోగం వచ్చిందని తెలియగానే చెల్లెల్నిచ్చి పెళ్ళి చేసేస్తాడతను. సావిత్రి అందమైనది. రాకుమారుడిలాంటి భర్తను గురించి కలలుగన్న ఆమెకు సుబ్బయ్యను చూస్తే చిన్ననాటి ఆయా కొడుకు గుర్తుకువస్తాడు. అతడికి జమిందారీ లేదని అతడిపై కోపం ఆమెకు. పిల్లలు కమల, కృష్ణుడు

పుట్టాకా కూడా పిరికివాడైన భర్త పట్ల ఆమెకు చిన్న చూపే తప్ప ప్రేమ ఎన్నడూ కలగదు. భార్యతో ఓ సరదా మాట మాట్లాడానికి కూడా జంకుతాడు సుబ్బయ్య.

ఇటువంటి పిరికివాడికి ధైర్యం నూరిపోసి, సుబ్బయ్యతో ఆఫీసులో ఐదువందలు లంచం అడిగించి తీసుకుపోతాడతని బావ వెంకట్రావ్. తన పని త్వరగా జరగడం కోసం సుబ్బయ్య అడగ్గానే డబ్బిచ్చిన కాంట్రాక్టర్ గవరయ్యకీ వెంకట్రావ్ కీ పడదు. లంచమడిగిన సంగతి తెలిసి సుబ్బయ్యను తిరిగి డిస్పాచ్ నౌకరీలోకి పంపేస్తాడు హెడ్ క్లర్క్. సుబ్బయ్య సీటుమారిన సంగతి తెలిసి తన డబ్బు తనకు వాపసు ఇచ్చేయమని తన మనిషిని సుబ్బయ్య ఇంటి మీదకు పంపిస్తాడు గవరయ్య. గవరయ్యకు కట్టవలసిన డబ్బు కోసం వెంకట్రావ్ ఇంటికి వెళ్ళిన సుబ్బయ్యను ఇంటిచుట్టూ తిప్పించుకుంటాడు తప్ప డబ్బు ఊసెత్తడు. వెంకట్రావ్ తనని పావుగా వాడుకున్నాడని తెలిసి నీరయిపోతాడు సుబ్బయ్య. ఇంటిఖర్చులకే సంపాదన సరిపోనప్పుడు ఐదువందల అప్పు(అరవై ఏళ్లక్రితం ఐదువందలు పెద్ద మెత్తమే మరి!) ఎలా తీర్చాలో, ఏం చెయ్యాలో అర్థంకాక తికమకపడతాడు సుబ్బయ్య. అతడ్ని భయపెట్టడానికి తన మనుషులతో కొట్టించి, ఐదువందలు తనవద్ద అప్పుతీసుకున్నట్టుగా నోటు పై బలవంతాన సంతకం పెట్టిస్తాడు గవరయ్య.

ఈ గడబిడల మధ్య కూతురు కమల స్కూల్లో టీచర్ మనోరమ పరిచయమౌతుంది సుబ్బయ్యకి. ఇద్దరి మధ్యనా గాఢమైన ఆకర్షణ పుట్టి పెరుగుతుంది. మనోరమ ఇచ్చిన చనువు వల్ల నేరుగా ఆమె ఇంటికి వెళ్ళేంతగా వారిరువురి పరిచయం పెరుగుతుంది. సుబ్బయ్య దిగులు, తగిలిన దెబ్బలు చూసి అతడ్ని బుజ్జగించి విషయం తెలుసుకుంటుంది మనోరమ. గవరయ్య తన ఊరివాడనీ, అతని తల్లి తనకు బాగా పరిచయమని చెప్పి, గవరయ్య ఇంటికి వెళ్ళి ప్రోనోటు చింపించివేసి, సమస్యను చిటికెలో పరిష్కరించేస్తుంది ఆమె. తన ఆవేదనంతటినీ ఇట్టే మాయం చేసేసిన మనోరమ దేవతలా కనబడుతుంది సుబ్బయ్యకి. అనుకున్న ప్రకారం సముద్రపు ఒడ్డున మనోరమను కలుసుకోవడానికి వెళ్తాడు సుబ్బయ్య. వారిద్దరి అనుబంధం ఏ దారిలోకి మళ్ళింది? సుబ్బయ్య లో మార్పు వచ్చిందా? అతడి భవిష్యత్తు ఏమిటి? అనే ప్రశ్నలను పాఠకులకే వదిలేస్తాడు రచయిత. చైతన్య స్రవంతి పద్ధతి ద్వారా మొదటి నుండీ సుబ్బయ్య ఆలోచన ధోరణి, అతడి మానసిక పరిస్థితినీ గమనిస్తున్న పాఠకులకు కథ ముగింపులో అతడి ఆలోచనలు సక్రమమైన మార్గంలోకి వస్తున్నట్లే అనిపిస్తాయి. 'భారతి 'లో ప్రచురణ అయిన తరువాత ఈ నవలకు మరో ఆశావహమైన ముగింపుని కూడా రాసుకున్నారు రావిశాస్త్రి. మనసు ఫౌండేషన్ వాళ్ళు ప్రచురించిన రావిశాస్త్రి "రచనాసాగరం" లో ఉన్న ఈ ముగింపు మలి ప్రచురణల్లో కూడా వెలుగులోకి రాలేదుట మరి. తాను నవల రాస్తున్నప్పుడు కూడా సుబ్బయ్య అంటే తనకు అసహ్యం అనీ, పత్రికలోంచి పుస్తకంలోకి వచ్చినప్పుడు మాత్రం అతడిలో ఆత్మ విమర్శ కలిగిందని చెప్తూ, చివరికి అతను ఏ మార్గమంటా వెళ్ళాడనేది పాఠకుల అంచనాకే వదిలేసానంటారు రచయిత.

సుబ్బయ్యలో పరిశీలనా శక్తి, ఊహా శక్తి అమోఘంగా కనబడతాయి. వీధి వరండాలో కూర్చుని, సిగరెట్టు కాలుస్తూ వచ్చేపోయే జనాలను గమనించడం అతని నిత్య వ్యాపకం, ఒక సరదా. ఆ కనబడే కొందరు వ్యక్తుల్లో అతనికి ఇష్టమైన వాళ్ల గురించి తనకు తోచిన చిత్రమైన కథలు అల్లేసుకుంటూంటాడు సుబ్బయ్య. వాళ్లకతడు పెట్టే పేర్లు కూడా చిత్రంగా ఉంటాయి. ఈ వచ్చేపోయే జనాల గురించిన ఆలోచనలూ, వాళ్ల జీవితాల గురించి అతడల్లుకునే కథలు చదువుతుంటే ఒక్కసారి మన మనసుల్లోకి తొంగి చూసుకున్నట్లు ఉంటుంది. మనకు కూడా పరిచయం లేకపోయినా నిత్యం కనబడే కొందరు వ్యక్తులు ఉంటారు. ఎదురుగుండా అపార్ట్మెంట్ లోని మనుషులో, ఇస్త్రీ చేసే తాతో, రోడ్డున రోజూ పోయే స్కూలు పిల్లలో, వాకింగ్ చేసేప్పుడు ఎదురయ్యే జంటలో..అన్నమాట. మనమూ సుబ్బయ్య లాగనే వాళ్ళను గురించి కథలల్లుకుని.. ఇలాగేమో.. అలాగేమో అనీ... మళ్ళీ ఎప్పుడన్నా వాళ్ళు కనబడకపోతే.. ఇందువల్లేమో... అనుకుంటూ ఉంటాము

కూడా. కథలో ఈ భాగం, ఆ వర్ణనా చదువుతుంటే రచయితకు కూడా ఇటువంటి ఒక ఊహాత్మకమైన అలవాటు ఉండి ఉంటుంది అనిపించింది నాకు.

నిజానికి సుబ్బయ్య దద్దమ్మేమీ కాదు. అతడికి ప్రేమించడం తెలుసును కానీ భార్యకు తాను తగనన్న నూన్యతాభావం అతడిని ఆమె దగ్గరకు వెళ్ళనివ్వదు. తన పిల్లలంటే అపారమైన ప్రేమానురాగాలున్నాయి కానీ డబ్బులేని కారణంగా వాళ్ల అవసరాలు తీర్చలేనన్న బాధ అతడిని వాళ్ళకూ చెరువ కానివ్వదు. ఆఫీసు పని ఎంతో శ్రద్ధగా చెయ్యగలడు కానీ చుట్టూ ఉన్న స్వార్థపరులైన సహోద్యోగుల హేళనల వల్ల తనను తాను తక్కువగా అంచనా వేసుకుంటాడు సుబ్బయ్య. పేదరికం వల్ల ఏర్పడిన నిస్సహాయత అతడిని పూర్తిగా అసమర్థుడిగా మార్చివేస్తుంది. ఎప్పుడైతే ఇతరుల అభిప్రాయాలకు, అవసరాలకూ అనుగుణంగా తనని తాను చూసుకోవడం మొదలుపెడతాడో అప్పుడే మనిషి చేతకానివాడిగా మారిపోతాడు. మనిషిలోని పిరికితనం, అభద్రతా భావం అతడిని ఎటువంటి హీనస్థితికి దిగజార్చగలవో తేలిపడానికే సుబ్బయ్య పాత్రను సృష్టి జరిగింది.

సుబ్బయ్యలాంటి పిరికివాళ్లకే కాదు ఎంతటి ధైర్యస్థులైనా, కొన్ని కొన్ని పరిస్థితుల్లో ప్రతి మనిషిలోనూ ఆత్మనూన్యతాభావాలు కలుగుతాయి. కానీ వాటికి లోబడిపోయి జీవితాన్ని నరకప్రాయం చేసుకోకూడదు. పిరికితనం, అభద్రతా భావం మనిషిని అధోగతికి చేరుస్తాయి. అతడిలోని దాగున్న సద్గుణాలను సైతం పైకి రానివ్వవు. మనిషిలోని మంచితనం పైకి రావాలంటే, ఉన్నతభావాలు ఉత్పన్నమవ్వాలంటే అతడు ధైర్యస్థుడై ఉండాలన్నది రచయిత ఉద్దేశం. మనిషనేవాడు ఎలా ఉండాలో చెప్పడం కోసం, ఎలా ఉండకూడదో సుబ్బయ్య పాత్ర ద్వారా మనకు తెలియచేసారు రావిశాస్త్రి.

# సత్యచరణ్ - వనవాసి




"...అటువంటి విముక్తాకాశం, అటువంటి నిస్తబ్ధత, అటువంటి ఏకాంతం, దిగంతాల వరకూ వ్యాపించిన అటువంటి మహారణ్య ప్రాంతంలో మాత్రమే అంతటి సౌందర్యం ప్రసన్నమౌతుంది. అటువంటి వెన్నెల రాత్రిని జీవితంలో ఒక్కసారైనా చూడడం ఉచితం. అలా చూడనివారికి ఈశ్వరసృష్టిలో ఒకానొక అపూర్వ సౌందర్యానుభూతి నష్టమైపోయిందన్నమాటే." అంటాడు సత్య చరణ్. ఇటువంటి ఒక మహాద్భుత సౌందర్యానుభూతిని పదిహేను పదహారేళ్ల క్రితం పొందుతాడతను. ఆ అనుభూతుల్ని కలకత్తా నగరంలోని ఒక ఇరుకు ఇంట్లో బాదం చెట్టు క్రింద కూచుని భార్య పనిచేసే కుట్టుమిషన్ చప్పుళ్ల మధ్యన ఆ స్మృతులలో అప్పట్లో తనకు ఆత్మీయులైనవాళ్ళందరినీ గుర్తుకు తెచ్చుకుంటాడు ఆ "వనవాసి" సత్యచరణ్.

వనవాసి - బిభూతిభూషణ్ బంధోపాధ్యాయ:

ఒక మహాద్భుతమైన అనుభూతిని పొంది, ఆ అనుభూతి తరంగాలలో కొన్నాళ్లపాటు ఓలలాడాలంటే తప్పక చదవాల్సిన

నవల "వనవాసి". వనవాసి బెంగాలీ మూలం '***అరణ్యక్***'. భారతీయ నవలాసాహిత్యంలోని ఉత్తమ రచనలలో ఒకటి ఇది. గద్యంలో రాసిన ఒక ఖండ కావ్యంగా ఈ నవలను పరిగణిస్తారు. బిభూతిభూషణ్ బందోపాధ్యాయ బెంగాలీ రచనకు శ్రీ సూరంపూడి సీతారామ్ గారు అందమైన పదాలతో కూడిన బహు చక్కని తెలుగు అనువాదాన్ని అందించారు.

ఉద్యోగరీత్యా బీహార్లోని ఒక అరణ్యప్రాంతానికి వెళ్ళిన ఓ యువకుడు తనకు ఎదురైన అనుభవాలను, తాను కనుగొన్న విషయాలను ఉత్తమపురుషలో తెలియచెప్పే నవల ఇది. నాగరికత ఎరుగని అరణ్య పరిసరాల్లో ఆదివాసుల జీవనం, అరణ్యశోభ, ప్రకృతి ఒడిలో ఆ యువకుడు నేర్చిన పాఠాలూ అన్నీ మనోహరమైన వర్ణనతో మనసుకు హత్తుకుంటాయి. సుమారు డెభ్భై ఐదేళ్ల క్రితం రాయబడిన ఈ నవలను చదువుతూంటే, ప్రఖ్యాత ఆంగ్ల రచయిత, ప్రకృతారాధకుడు William Wordsworth రాసిన **'Tintern Abbey' అనే పద్యం,** ప్రఖ్యాత అమెరికన్ రచయిత Henry David Thoreau రచించిన 'Walden' గుర్తుకువచ్చాయి నాకు. అప్పటికి ఇంకో వందేళ్ళకు పూర్వం పద్ధెనిమిదవ శతాబ్దంలో ఈ రెండు రచనలూ చేయబడ్డాయి. రెంటికీ కూడా ప్రకృతే ప్రేరణ. ఉత్తర బీహార్లోని ఒక జమిందారీ ఎస్టేట్ అడవిలో మేనేజరుగా పనిచేసిన తర్వాత, ఆ అనుభవాలసారాన్నే వనవాసి ద్వారా పాఠకులకు అందించారుట బిభూతిభూషణ్. "వనవాసి" పై ఈ రెండు ఆంగ్ల రచనల ప్రభావం ఉన్నా లేకపోయినా ప్రకృతి వర్ణనలో, రసానుభూతిపరంగా ఈ ముగ్గురు రచయితల మనోభావాల్లో ఎన్నో సారూప్యాలు కనబడ్డాయి నాకు. బహుశా ప్రకృతారాధకులంతా ఒకేలా ఆలోచిస్తారు కాబోలు.

"అరణ్యక్" నవలను 1937–39 మధ్య కాలంలో బిభూతిభూషణ్ బందోపాధ్యాయ బెంగాలీ లో రచించారు. ***ప్రభాసి*** అనే బెంగాలీ మాసపత్రికలో సీరియల్ గా ప్రచురించబడిన తరువాత ఇది పుస్తకరూపంలో వచ్చింది. తర్వాత 1961 లో సాహిత్య అకాడమీ వారు తెలుగు అనువాదాన్ని వెలువరించారు. మళ్ళీ కొన్నేళ్ల తరువాత 2009లో హైద్రాబాద్ బుక్ ట్రస్ట్ వారు పునర్ముద్రణ చేసారు. ప్రఖ్యాతిగాంచిన సత్యజిత్ రే చిత్రాలు పథేర్ పాంచాలీ, అపరాజిత నవలల సృష్టికర్త బిభూతిభూషణ్ . వీటితో సమానంగా ప్రఖ్యాతి గాంచిన ఇచ్ఛామతి, చందేర్ పహర్ నవలలతో కలిపి పదిహేడు నవలలు, ఇరవై కథా సంకలనాలూ కలిపి వీరి రచనలు ఒక ఏభై పుస్తకాలను ప్రచురించారుట. ఏడు దాకా నవలలు చిత్రాలుగా రూపొందాయి. దర్శకుడు కమలేశ్వర్ ముఖర్జీ తీసిన చందేర్ పహర్ సినిమా క్రిందటేడు రిలీజయ్యింది. ఈ నవల "చంద్రగిరి శిఖరం" పేరుతో తెలుగులోకి అనువదించబడింది.

### 'సత్యచరణ్' పాత్ర పరిచయం:

కలకత్తా నగరంలో చదువు పూర్తయ్యాకా ఉపాధ్యాయుడిగా కొన్నాళ్ళు పనిచేసాకా తిరిగి నిరుద్యోగి అవుతాడు యువకుడైన సత్యచరణ్. ఆ సమయంలో ఒక పాత మిత్రుడు కనబడి తమ జమిందారీ ఎస్టేట్ అడవిలో మేనేజర్ గా ఉద్యోగమిప్పిస్తాడు. బీహార్ లోని పూర్ణియా జిల్లాలోని మహాలిఖారూప పర్వత శ్రేణి దిగువన ఉన్న మోహన్ పురా అరణ్యప్రాంతం అది. ఆ అరణ్యప్రాంతంలోని ఇరవై ముప్ఫై వేల బిఘాల(ఒక బిఘా అంటే నలభై సెంట్లు) నేలని పంటభూమిగా మార్చేందుకు కౌలుదారులను వెతికి, కాస్త కాస్త చవ్పున ఆ నేలను వారికి ఇచ్చి, వాళ్ల నుండి శిస్తు వసూలుచేసే ఉద్యోగం అది. ఉద్యోగం కోసం తప్పనిసరిగా కలకత్తా వదిలి వెళ్ళిన సత్యచరణ్ కు మొదట్లో ఆ నిర్జనారణ్యం, ఆ నిశ్శబ్ద వాతావరణం ఊపిరాడనివ్వవు. ఏకాకినైపోయానని మహా దు:ఖపడిపోతాడు. వన్యమృగాల, బందిపోటు దొంగల భయానికి ఎప్పుడూ చెంత తుపాకీ ఉంచుకోవాలనీ తెలిసి విహ్వలుడౌతాడు. పట్టణ వాతావరణం, సభ్య సమాజం, స్నేహితులు, పుస్తకాలు, సినిమా, సరదాలు, ఆనందోల్లాసాలూ వదిలి ఈ అనాగరిక ప్రపంచంలో ఆదివాసీల మధ్యన ఎలా ఉండాలో అర్థం కాదతనికి. మరుక్షణం ఉద్యోగం వదిలేసి పారిపోవాలనే తలంపుతోనే కొన్నాళ్ళు గడుపుతాడు. నెమ్మదినెమ్మదిగా మనోజ్ఞమైన ఆ అరణ్యశోభ, సూర్యోదయాలు,

సంధ్యాసమయాలు, చంద్రోదయాలు, వెన్నెల రాత్రులు, ఎత్తైన వృక్షాలు, రకరకాల పక్షులు, రకరకాల పూలతలు, వాటి పరిమళాలూ, గిరిజనుల అమాయకత్వం అతడ్ని సమ్మోహనపరిచి తమ దాసుడిని చేసేసుకుంటాయి. ఏకాంత స్వేచ్ఛాజీవనంలో ఎంత సౌందర్యం ఉందో, రానురానూ అరణ్యం తననెలా సమ్మోహనపరిచిందో, ప్రకృతితో పరిచయం ఎంతటి ఆనందాన్ని ఇవ్వగలదో అతడు నెమ్మదిగా చెప్పుకుంటూ వస్తాడు.

తానున్న కచేరీకి పదిమైళ్ల దురం వరకూ నిత్యం తిరిగే పని పడుతుండడం వల్ల గుర్రపు స్వారీ తప్పనిసరిగా నేర్చుకున్న సత్యచరణ్ కు అంతకు మించిన ఆనందం మరొకటి లేదనిపిస్తుంది. తను ఉంటున్న కచేరీకి పంతొమ్మిది మైళ్ల దూరంలో లవటులియా అనే ప్రాంతంలో మరో కచేరీకి ఉంది. అక్కడ దట్టంగా ఉన్న రేగిచెట్లను కౌలుకివ్వడానికీ, ఇంకా మిగిలిన అడవిని లక్క పురుగులు పెంచడానికి కౌలుకు తీసుకున్న వారి దగ్గర పన్నులు వసూలు చెయ్యడానికి లవటులియా అరణ్యానికి వెళ్ళి వచ్చేవాడు సత్యచరణ్. ఆ దారమ్మట ఉండే పువ్వుల తోట, మైదానం,చానన్ సెలయేరు, నిర్జనారణ్య ప్రకృతి, అడవిపూల సుగంధం అతడిని ముగ్ధుణ్ణి చేస్తాయి. "హిమస్నిగ్ధ వన కుసుమజోత్స్నాలంకారాలతో ఎన్ని గంభీరనిశీధులు చక్షుగోచరమైనాయో.." అంటాడతను. అక్కడ నుండి పారిపోవాలనుకున్న వ్యక్తే వసంతపూర్ణిమనాటి రాత్రి, పరిపూర్ణజ్యోత్స్నాకాంతులలో, నిర్జనమైన అరణ్యమయ పర్వతమార్గంలో, గుర్రం మీద ఒంటరిగా విహారానికి వెళ్లాలనుకునేంతలా మారిపోతాడు. మార్గమంటూలేని ఆ పర్వతశ్రేణుల్లో విముక్తాకాశతలం క్రిందన గుర్రం కళ్ళెం విడిచి స్వేచ్ఛగా వేగంగా చేసే ప్రయాణంలోని ఆనందాన్ని ప్రపంచంలో మరే సంపదా ఇవ్వలేదనే నిర్ధారణకొస్తాడతడు.

మునుపెన్నడూ కనీవినీ ఎరుగని ఇటువంటి అపూర్వమైన ప్రకృతిశోభ సంభ్రమపరిచినట్లే, అక్కడి గిరిజనుల పేదరికం కూడా అతడికి దిగ్భ్రాంతికి కలిగిస్తుంది. అతను సర్వేకి వస్తాడని తెలిసి, రెండురోజుల పాటు తిండి దొరుకుతుందనే ఆశతో మైళ్ల దూరం నుండి రెండురోజులుగా పడిగాపులు పడిఉంటారు కొందరు మనుషులు. వారు అన్నం రూపే తెలియని నిరుపేదలు. కేవలం మినుముల పిండి, జొన్నపిండి ముద్దలు తిని బ్రతికే నిరుపేద ఆదివాసీలు, చీనాగడ్డిగింజల పప్పులో కేవలం ఉప్పు వేసుకుని తిని బ్రతికేవారు, అడవిలో దొరికే పుచ్చకాయల్లాంటి గుడ్మీ పళ్ళు తిని నెలలు గడిపే పేదవాళ్ళు, కొర్రలు పండించి వాటిలోకి అడవితోటకూర వండి ఉప్పు నంచుకుని తినేవారూ అక్కడ ఉన్నారని తెలిసాకా, నాగరీక జనావాసాలకు దూరంగా ఇంతటి నికృష్ట దారిద్యాన్ని అనుభవించే ఇందరు జనాలు ఉన్నారా అని ఆశ్చర్యపోతాడు. వారిపై అతనికి తెలియని అభిమానమేదో కలుగుతుంది. ఏదో విధంగా వారందరికీ సహాయం చెయ్యాలని సంకల్పిస్తాడు. ఈ నిరుపేదల శ్రమను దోచుకునే రాసవిహారీ సింగ్, నందలాల్ ఓఝూ మొదలైన కౄరుల నుండి వాళ్లను కాపాడటానికి సంకల్పించడం వల్ల కొన్ని భయానక సంఘటనలను కూడా అతడు ఎదుర్కొనవలసి వస్తుంది.

ఆ గిరిజనుల అమాయకత్వం, వారి ఆకలి, కష్టాలూ సత్యచరణ్ లోని కరుణను జాగృతం చేస్తాయి. తానా ప్రాంతంలో ఉన్న ఆరేళ్ళూ తనకు చేతనైన సహాయం వాళ్ళకు చేస్తాడు. వీలయినప్పుడల్లా దగ్గర గ్రామాల్లోని పేదలందరినీ పిలిచి భోజనాలు పెట్టిస్తాడు. మరీ దరిద్రాన్ని అనుభవిస్తున్న నిరుపేదలకు కాస్త కాస్త భూమిని కౌలుకి ఇప్పించి వాళ్ల జీవనాలకు ఆధారాలను ఏర్పరుస్తాడు. వారి అమాయక మొఖాల్లోని చిరునవ్వు, ఆనందం అతని హృదయంలో హత్తుకుపోతాయి. వారందరి కృతజ్ఞతనూ నింపుకున్న అతని జీవనం ఉత్కృష్టమౌతుంది. "నిజం చెప్పాలంటే జీవితంలోకి ఆలోచించి చూసే అలవాటు ఇక్కడకు వచ్చిన తర్వాతనే అబ్బింది. మనస్సుని తరచి చూసుకోవడంలో ఉండే ఆనందం ఇదివరకెన్నడూ ఇంతగా లభించలేదు. ఇక్కడ అసౌఖ్యాలు సహస్రాధికంగా ఉన్నప్పటికీ, ఆనందం రోజురోజుకీ మత్తులా నన్ను వశపరుచుకుంటోంది" అంటాడతను.

ఆ అరణ్య ప్రాంతంలో సత్యచరణ్ కు గోండులు, సంచార జాతులు, దోషజాతివారు(అస్పృస్యులు), క్షత్రియులు, బ్రాహ్మణులు, గంగోతాలు మొదలైన ఎన్నో జాతులవారు ఎదురౌతారు. రకరకాల తరహా మనుషులను చూస్తాడు. వారి నుండి ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకుంటాడు. విత్తంపై, కష్టనష్టాలపై దృష్టి లేని **ధౌతాల్ సాహు** లాంటి వేదాంతిని చూసి అత్యాశనెలా వదులుకోవాలో తెలుసుకుంటాడు. పొలంపని చేసేప్పుడూ, వండుకునేప్పుడూ తప్ప రోజంతా గుడిసెలో ఒంటరిగా శూన్యం లోకి చూస్తూ జీవనం గడిపే **జయపాల్** ను కలిసిన తర్వాత అటువంటి ఉద్విగ్నరహిత నిర్వికార ధీర మనస్తత్వం తనలోనూ పరిణమిస్తోందని గ్రహిస్తాడు. ఐదు గేదెలని మేపడానికి పదిక్రోశుల దూరం నుండి వచ్చి ఘోరమైన అరణ్యంలో గుడిసె కట్టుకుని ఒంటరిగా నివసిస్తూ శిస్తు కట్టే **గనూ మహతో** నుండి ఆకలి విలువ తెలుసుకుంటాడు. **కుంత** కథ ద్వారా ఏ జాతిలో పుట్టామన్నది ముఖ్యం కాదు మనిషిలో మంచితనం, నిస్వార్థభావన ముఖ్యం అని తెలుసుకుంటాడు. బాలకుడు ధతూరియాకు తన ఆకలిపై కన్నా నృత్యకళపై ఉన్న శ్రధ్ధాసక్తులు చూశాకా ఎల్లప్పుడూ ఆనందంగా ఉండడం, లోభరహితంగా ఉండడం, యదార్థమైన కళారాధన మొదలైన సంగతులు అర్థమౌతాయి సత్యచరణ్ కు .

ఆ ప్రాంతపు ఆదిమజాతి(సంతాల్ జాతి) రాజవంశస్థుడు రాజా **దోబరూ పన్నా** పరిచయం చరిత్రగతమైన అనార్యజాతుల పరాజయ చరిత్రను సత్యచరణ్ కళ్లముందు ఉంచుతుంది. రాజా మనుమరాలు భానుమతి అమాయకత్వం, ఔదార్యం, అనురాగం చూసి చలించిపోతాడు. ఒక స్త్రీ నిశ్శంశయంగా స్నేహమాధుర్యాన్ని చవిచూపడటం భువిపైన స్వర్గద్వారాలను తెరవడమేనంటాడు. సభ్యసమాజంలో కాగడాపట్టి వెతికినా ఇంతటి నిర్మలమైన ఆత్మీయత కనబడదంటాడు అతను. ఇదే స్వభావాన్ని 'మంచీ' లోనూ, వెంకటేశ్వర ప్రసాద్ పత్ని దగ్గరా కూడా కనబడుతుందతనికి. అక్కడి అరణ్యం, పర్వత శ్రేణి, మేఘమాలా ఎంత విశాలమైనవో వీరందరి హృదయాలు కూడా అంత విశాలమైనవంటాడు సత్యచరణ్ .

ఒకనాడు సర్వే కాంప్ నుండి తిరిగివస్తూంటే సరస్వతీ హ్రదం దగ్గర ఆ భీకర అరణ్యంలో విత్తనాలు నాటుతున్న 'యుగళప్రసాద్' పరిచయమౌతాడు. ఎక్కడెక్కడి నుంచీ చక్కని రంగురంగుల అడవిపువ్వుల మొక్కల విత్తనాలు పోగుచేసుకొచ్చి ఈ ప్రాంతంలో వేస్తున్నడతను. కేవలం అడవి సౌందర్యాన్ని పెంచాలనే అతని నిస్వార్థ బుధ్ధి, కృషి పట్ల సత్యచరణ్ కు గౌరవం కలిగుతుంది. అతడితో కలసి తాను కూడా కొత్తకొత్త పువ్వుల మొక్కలు తెప్పించి సరస్వతీ హ్రదం ఒడ్డున వేయిస్తాడు. ఇద్దరూ కలిసి ఆ ప్రాంతాన్ని ఎన్నో కొత్త అందాలతో, పరిమళాలతో నింపుతారు. కానీ అంత కష్టపడి తీర్చిదిద్దిన పూలతోటను కూడా అన్ని అటవీప్రాంతాలలాగనే చివరికి కౌలుకి ఇవ్వక తప్పదు సత్యచరణ్ కు. చూస్తూండగా పచ్చదనమంతా మాయమైపోయి మహాలిఖారూప పర్వతం పాద ప్రదేశం నుండీ లవటులియా, నాఢా అడవుల సరిహద్దుల వారకూ భూములు కౌలుకి ఇచ్చివెయ్యడం అయిపోతుంది. రాత్రికి రాత్రే గ్రామాలు తయారయిపోతాయక్కడ. ఆ ప్రాంతమంతా జొన్న చేలూ, పూరిపాకలు, గుడిసెలు, వీధులలో మంచాలు, బురద, పశువులతో నిండిపోతుంది. అనురాగం చూపుతున్న భానుమతిని వివాహమాడి అక్కడే ఉండిపోవాలన్న సుందర స్వప్నాన్ని అక్కడ తనపని అయిపోయి వెళ్ళోవాలన్న సత్యం కప్పెట్టేస్తుంది. "మనిషికి కావాల్సినదేమిటి? ఉన్నతా? ఆనందమా? ఉన్నతి సాధించినా, దాని వల్ల ఆనందం కలగకపోతే ప్రయోజనం ఏమిటి? అన్య భోగాల వల్ల మన:ప్రవృత్తికి నైశిత్యం నశిస్తుంది. అప్పుడు ఇంక ఏం చేసినా ఆనందం లభించదు." అనుకుంటాడతను.

తనకు అప్పగించిన పని అయిపోయినా తనవల్ల అరణ్యమంతా నశించిపోయిందన్న బాధ అతన్ని వదలదు. అరణ్యదేవతను క్షమించమని కోరుతూ ఆ ప్రాంతానికి వీడ్కోలు పలుకుతాడు సత్యచరణ్. అరణ్యాలన్నీ ఆధునీకరణకు ఆహుతైపోతున్న ప్రస్తుతకాలంలో పర్యావరణ పరిరక్షణకై ఇటువంటి హృద్యమైన రచనలు చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందనిపిస్తుంది ఈ నవల చదువుతుంటే.

ఒక నిర్జనారణ్య ప్రాంతంలో పరమ సౌందర్యభరితమైన ప్రకృతిఒడిలో ఒక సాధారణ మానవుడు ఏం నేర్చుకోగలడు, అతని వ్యక్తిత్వం ఎంతటి ఉత్కృష్టమైనదిగా మారగలదు, ఎంత లోతైన జీవితసత్యాలను నేర్వగలడో తెలుపగల పాత్ర సత్యచరణ్ ది. ఇంతేకాక నవల చదివిన చాలాకాలం పాటు మన ఆలోచనల్లో తిరగాడే ధుధలిపుష్పాల మధుర వాసనలు, రక్తఫలాశ వృక్షాల శోభ, పత్రవిహీనమైన గోల్ గోలీ పువ్వులు, ధాతుప పుష్ప వృక్షాలు, వెన్నెల రాత్రులు , సెలయేట్లో అడవి లిల్లీల మృదుమధుర పరిమళాలతో పాటుగా.. వీటన్నింటినీ తన ఏకాంత స్వేచ్ఛా విహారాలలో అనుభూతి స్వప్నాలుగా మిగుల్చుకున్న అదృష్టవంతుడిగా మనకు గుర్తుండిపోతాడీ నవలా నాయకుడు.

# టెమూజిన్ : ఛంఘిజ్ ఖాన్




"నా దగ్గర ఉన్న రెండు చిరుతగండ్లున్నయ్ – అవి చెరోవైపునా నా పక్కలో పడుకుని నిద్రపోతై – నేను నా చిరుతపులులు రెండికీ మధ్యగా పడుకుని, గుండెల మీద చెయ్యి వేసుకుని హాయిగా నిద్రపోతు ఉంటాను – మానవజాతిని మాత్రం నేను అలా నమ్మి ఆదమరచి బ్రతకలేను. ఎంత జాగ్రత్తగా ఉన్నా, ఏదో ఒక దొంగ దెబ్బ తగులుతూనే ఉంటుంది. చిరుతపుళ్ల విషయంలో మనకు ఆ భయమక్కర్లేదు. వాటికి ఎప్పుడు కోపం వస్తుందో మనకి తెలుస్తుంది. వాటికి మన మీద కోపమొస్తే, మనవంక చూచి పెద్దపెట్టున గర్జించుతై. చంపుతా జాగ్రత్త! అని ముందుగా హెచ్చరించుతై. మనకు తాహతు ఉంటే వాటిపై తిరగబడి పోరాడవచ్చు, లేకపోతే నెమ్మదిగా పక్కకు తప్పుకుని ప్రాణాలు తప్పించుకోవచ్చు. మానవమృగాలు మాత్రం అలాంటి అవకాశాలు ఇవ్వవు. పైగా లాలన చేసి, దువ్వి మైమరపుతో ఉన్నామని తెలియగానే, యే డొక్కలోనో పంజా విసిరి హత్యచేస్తాయి. మానవజాతిలో మోసం చెయ్యని జంతువంటూ చాలా అరుదు." అంటాడు టెమూజిన్. ప్రపంచంలోనే అతిపెద్ద సామ్రాజ్యాన్ని పరిపాలించిన సామ్రాజ్యాధినేత ఇతడు. మనుషుల నైజం పట్ల అతనికి గల అనుభవాల సారం ఈ అభిప్రాయం. జీవితమంతా మోసాలు, కుట్రలు, ఎదురుదెబ్బలు, యుద్ధాలు, లూటీల మధ్య గడిచిన ఓ నిరక్ష్యరాస్యుడైన వ్యక్తికి మనుష్యజాతి పట్ల ఇంతకంటే మెరుగైన అభిప్రాయం ఏముంటుంది? ఇతగాడే ప్రముఖ అభ్యుదయ కవి, రచయిత శ్రీ తెన్నేటి సూరి రచించిన "ఛంఘిజ్ ఖాన్" నవలా నాయకుడు.

**రచయిత శ్రీ తెన్నేటి సూరి – "ఛంఘిజ్ ఖాన్" నవల:**

ప్రపంచమంతా కౄరుడు, నిర్దయుడు, పాషాణహృదయుడు, రక్తపిపాసి, రాక్షసుడు అని ముద్ర వేసిన మంగోల్ జాతి నాయకుడు టెమూజిన్ కథను ఒక కొత్త కోణంలో మనకి చూపెడుతూ ఒక మహోన్నతమైన మానవతావాదిగా అతగాడిని మనకి పరిచయం చేసారు ప్రముఖ అభ్యుదయ కవి, కథారచయిత, నాటక కర్త శ్రీ తెన్నేటి సూరి(1911 – 1958). కృష్ణా జిల్లా తెన్నేరులో జన్మించారు. పన్నెండేళ్లపాటు భారతి, ఆంధ్రపత్రికలలో పత్రికా రచయితగా పనిచేసారు. వీరి రచనల్లో "విప్లవ రేఖలు", "సుబ్బలక్ష్మి" కథా సంపుటాలు,

"అరుణ రేఖలు", "మహోదయం" కవితా సంకలనాలు, "రెండు మహా నగరాలు" స్వేచ్ఛానువాద నవల ప్రముఖాలు. వీరి "భారతి" కథ కు అంతర్జాతీయ కథానికల పోటీలో బహుమతి వచ్చింది. అనువాదమేమో అనిపించని చక్కని తెలుగు, ఆపకుండా చదివించగల పట్టు వీరి రచనలలోని ముఖ్య విశేషాలు. "ఛంఘిజ్ ఖాన్" వంటి వివాదాస్పద చారిత్రకపాత్రను పాఠకులకు సరికొత్త కోణంలో చూపెట్టడం ఒక సాహసమైతే; 12,13 శతాబ్దాలలో మంగోల్ యుద్ధాల వెనుక ఉన్న రాజకీయ, చారిత్రిక స్థితిగతులను సమీకరించడం కూడా ఎంతో శ్రమతో కూడుకున్న వ్యవహారం. మంగోల్ జాతికే కాక ఆసియా ఖండానికే ఉజ్వల భవిష్యత్తుని అందించిన వెలుగు సూర్యుడిగా, మహోన్నత మానవతావాదిగా ఛంఘిజ్ ఖాన్ పాత్రచిత్రణ చేసారు తెన్నేటి సూరి. 2000 ప్రాంతంలో ఆకాశవాణి విజయవాడ కేంద్రవారు ఈ నవలను గంటన్నర నాటకంగా(చాలా దశాబ్దాల తర్వాత) రూపొందించి ప్రసారం చేసారు. తెన్నేటి సూరి గారి రచన ఆధారంగానే శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గారు రేడియో అనుసరణ చేసారు. శ్రీ ఎస్.బి. శ్రీరామ మూర్తిగారు(నాన్నగారు) నాటకానికి శబ్దరూపాన్ని కల్పించారు. 'చంఘిజ్ ఖాన్' పాత్రను ప్రముఖ రేడియో, రంగస్థల నటుడు శ్రీ కోకా సంజీవరావు గారు నిర్వహించారు.

క్రీస్తుశకం పదమూడవ శతాబ్ది ప్రారంభకాలంలో మధ్య ఆసియాలోని గోబీ ఎడారికి ఉత్తరంగా మంగోల్ జాతికి చెందిన అనేక తెగలవారు నివసిస్తూ ఉండేవారు. పశుబలంతో మెరటుగా జీవిస్తూ అంత:కలహాలతో బ్రతికే ఈ తెగలను, తండాలను ఏకం చెయ్యాలని ప్రయత్నించిన వ్యక్తి యెక్కా మంగోల్ తండా నాయకుడు **యాసుకై ఖాఖాన్**. ఆ తండ్రికి ఆశయాలలో వారసుడు **టెమూజిన్ (అంటే** 'ఉక్కుమనిషి' అని అర్థం). ఇతను 1162-1267 మధ్య కాలంలో పుట్టి పెరిగి మహా సామ్రాజ్యం స్థాపించాడు. కరకోరం రాజధానిగా ఈ మహాసామ్రాజ్యం ఉత్తరాన సైబీరియా అటవీ ప్రాంతం మొదలు దక్షిణాన టిబెట్ వరకూ, పశ్చిమాన కాస్పియన్ సముద్రం మొదలు తూర్పున పసిఫిక్ సముద్రం వరకూ వ్యాపించింది. విశ్వ విజేతగా పేరుపడిన **టెమూజిన్** "ఛంఘిజ్ ఖాన్" గా జగత్ప్రసిద్ధుడు. కడు పిన్న వయసులోనే జైత్రయాత్రలకు నడుంకట్టిన చంఘిజ్ ఖాన్ అంచలంచలుగా సాధించిన రాజకీయ విజయాల నేపథ్యాన్ని **ఛంఘిజ్ ఖాన్** నవల చిత్రిస్తుంది. "మన చేతిలోని ఆయుధాన్ని నిర్ణయించేది శత్రువు చేతిలోని ఆయుధమే" అన్న సూక్తి ఛంఘిజ్ ఖాన్ చండశాసనత్వానికి కారణాభూతమనేది వారి అభిప్రాయం. విదేశీ చరిత్రకారులు నియంతగా, దుర్మార్గుడిగా చిత్రీకరించిన ఛంఘిజ్ ఖాన్ చిన్నతనాన్నీ, సామ్రాజ్యాధినేతగా అతడు ఎదిగిన వైనాన్నీ, అతడిని రాక్షసుడిగా మార్చిన పరిస్థితులనూ, అతడి పరిపాలనా దక్షతనూ, శక్తిసామర్థ్యాలనూ, తన సహచరులపై, నమ్మకస్థులపై అతడు చూపిన ప్రేమాదరాలనూ నవలలో చక్కగా వివరించారు రచయిత. హెన్రీ హెచ్. హోవార్త్ రచించిన **'మంగోల్ హిస్టరీ'** పుస్తకం ఈ నవలకు ఆధారం. ఆంధ్రపత్రికలో సీరియల్ గా వెలువడిన ఈ నవల తొలిముద్రణ 1956లో జరిగింది.

నవలను ఏకబిగిన చదివించగలిగే పట్టు రచయిత సామర్థ్యాలకి గీటురాయి. చారిత్రక ప్రామాణికాలపై ప్రశ్నార్థకాలన్నీ పక్కనబెడితే మాత్రం తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ నిలిచిపోయే ఒక అత్యుత్తమ నవల ఈ రచన. నవల చదివిన చాలాకాలం వరకూ గోబీ ఎడారి, మంగోల్ తండాలు, ఖాఖాన్, టెమూజిన్, యూలన్, షామాన్, కరాచర్, సుబుటాయ్, చమూగా మొదలైన ముఖ్య పాత్రలు మన మస్తిష్కంలో తిరగాడుతూ ఉంటాయి. ఏనాటికైనా ఈ పాత్రల వెనుక ఉన్న యదార్థ గాథ తెలుసుకోవాలనే తపన పాఠకులను నిరంతరం వెంటాడుతూనే ఉంటుంది.

ఛంఘిజ్ ఖాన్ పరిచయం: (కేవలం నవల లోని పాత్ర చిత్రీకరణ ఆధారంగా)

అమితమైన ప్రసవ వేదన పడుతున్న యూలన్ కు మైకం క్రమ్మే దాకా సారా త్రాగించి, అడ్డం తిరిగిన బిడ్డను బలవంతాన బయటకు లాగి ఆ ప్రాణిని భూమి మీదకు తెస్తాడు యూలన్ అన్న కరాచర్. పట్టరాని ఆనందంతో బిడ్డను అమాంతం ఆకాశంలోకి యెత్తి

"టెమూజిన్(ఉక్కు మనిషి)" అని అరుస్తాడు అతడి తండ్రి యాసుకై ఖాఖాన్ భగత్తూర్. శిశువు కుడి అరచేతికి మధ్యగా ఎద్దుమూపురంలా ఒక మాంసపు ముద్ద ఉబ్బెత్తుగా లేచి ఉండటాన్ని చూసి ఎగిరి గంతేసి "జగజ్జేత" అని అరుస్తాడా తండ్రి. అలా పుట్టిన బిడ్డ ప్రపంచాన్ని జయిస్తాడని, భగవంతుడి పుత్రుడని ఆ తండావారి నమ్మకం. టెమూజిన్ జననంతో అతడి మేనమామ **కరాచర్** విలువ పెరుగుతుంది. చైనా భాష చదవడం రాయడం వచ్చిన అతడ్ని తన మంత్రిగా, ప్రధాన సలహాదారుగా నియమిస్తాడు యాసుకై ఖాఖాన్.




గోబీ ఎడారి ప్రాంతంలో విడివిడిగా ఉన్న వందల కొద్దీ మంగోల్ జాతులనీ, బంజారీ తండాలన్నింటినీ ఏకం చేసి పటిష్ఠమైన మంగోల్ సామ్రాజ్యాన్ని స్థాపించాలన్నది ఖాఖాన్ కల. అందినవాళ్లను అందినట్టు దెబ్బ తీస్తూ, ఒకరిపై ఒకరు పడి కొల్లగొట్టుకుంటూ, నిర్దాక్షిణ్యంగా, ఆటవికుల్లా రాక్షసంగా బ్రతికుతూ సంచార జాతులుగా గోబీ ఏడారిలో తిరిగే తండాలన్నింటినీ ఒకటి చెయ్యడమనేది అంత సులువైన పనేం కాదు. అయినా లక్ష్యసాధనకు పూనుకుని కొన్ని పెద్ద పెద్ద తండాలైన తార్తార్ తండా, మెర్కిట్ తండా మొదలు కొన్ని చిన్న చిన్న తండాలను సైతం తన జాతిలోకి కలుపుతాడు యాసుకై. కిన్ చక్రవర్తికి పక్కలో బల్లెంలా ఉన్న తార్తార్ తండాను యాసుకై జయించడం పెద్ద విషయమే. ఈ బలాన్ని కనిపెట్టే చైనా గోడ పక్కనే ఉన్న **సింగ్ పాల్** నగర రాజు, కేరెట్ జాతి నాయకుడు **తుఘ్రుల్ ఖాన్** సహాయార్థం ఖాఖాన్ భగత్తూర్ వద్దకు వస్తాడు. ఇద్దరూ 'అండాలు(పవిత్ర సోదరులు)'గా ఉండడానికి అగ్నిసాక్షిగా కత్తులు ముట్టి మాంసఖాలు చేసుకుంటారు. అదే సమయంలో చిన్నారి టెమూజిన్ కూడా **తుఘ్రుల్ ఖాన్ కి స్నేహంతో** 'అండా ' గా ఉంటానని శపథం చేస్తాడు. పదేళ్ల చమూగా కూడా అన్నగారికి 'అండా 'గా ఉంటానని కత్తి పట్టి ప్రమాణం చేస్తాడు. ఒప్పందం ప్రకారం తుఘ్రుల్ ఖాన్ తమ్ముడిని గద్దె మీంచి దించి తిరిగి అతడ్ని రాజుని చేస్తాడు యాసుకై. ఈ ప్రమాణానికి కట్టుబడి తండ్రి మరణం తరువాత చివరిదాకా కూడా తుఘ్రుల్ ఖాన్ ని తండ్రిగారూ అని సంబోధిస్తూ తన విశ్వాసాన్నీ, సహాయాన్నీ అందిస్తాడు టెమూజిన్. ఆనాటి శపథం ప్రకారం తమ్ముడు చమూగాను కూడా చివరిదాకా కాపాడటానికే ప్రయత్నిస్తాడు.



పరాక్రమవంతుడైన టెమూజిన్ తండ్రిని చంపడానికి టైజూట్ తండా నాయకుడు టర్గుటాయ్ మోసంతో సారాలో విషం కలిపిస్తాడు. ఎలాగో అక్కడనుండి ప్రాణాలు కాపాడుకుని తన గుర్రం మీద తండాని చేరుకుని అక్కడ మరణిస్తాడు యాసుకై. ఆ మరణంతో తండాలో అప్పటిదాకా కలిసిన జాతుల నాయకులంతా వాళ్ళవాళ్ళ జాతులను తీసుకుని ఎవరుదారిన వారు వెళ్ళిపోతారు. యాసుకై వంశం తాలూకూ యెక్కా మంగోలువాళ్ళు, మరో రెండు మూడు వందల డేరాల వాళ్ళు మాత్రం మిగులుతారు. ఖాఖాన్ మరణంతో అతడు ఏకం చేసిన గోబీ జాతులన్నీ ముక్కలైపోయి శిధిలమైపోతాయి. ఓ వైపు జార్ చక్రవర్తుల సైన్యాలూ, ఇటు చైనా చక్రవర్తుల సైన్యాలూ, తుర్కుష్ సైన్యాలు, పశ్చిమం నుండి కాలిపుల సైన్యాలు, అరబ్, యూదు, యూరోపియన్

వ్యాపరస్తుల దళాలు నలుమూలల నుండీ నిరాయుధులైన గోబీ ప్రజలపై వచ్చిపడి చిత్రవధలు చెయ్యడానికి సిద్ధమైయ్యే పరిస్థితి. వాళ్ళందరికీ ఈ తండాలోని అమాయకులను దొరికినవాళ్లను దొరికినట్లు పట్టుకుపోయి, బానిసలుగా వేలాలు వేసుకు అమ్మే అవకాశం ఎదురైంది! ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో కుర్రాడైన టెమూజిన్ తండాకు అండగా నిలబడతాడు. ఖాఖానుల పవిత్ర ఖడ్గాన్ని పట్టుకుని అవినీతిని చేధించి, విశ్వ సామ్రాజ్యాన్ని స్థాపిస్తానని ప్రతిజ్ఞ పడతాడు.

యూలన్ సవతి **కుకుర్షిన్ ఖాటూన్** కుమారుడు **చమూగా** చదువుకున్నవాడు. కరాచర్ మామ వద్ద చైనా భాష అభ్యసించి, అనేక గ్రంధాలను చదివినవాడు. అతడికి టెమూజిన్ చేస్తున్న యుద్ధప్రయత్నాలు, సేనా నిర్మాణం నచ్చదు కానీ అన్నగారిని ఎదిరించే ధైర్యం చెయ్యడు. టెమూజిన్ ఒక్క చిరునవ్వు నవ్వితే చాలు అతడి మెదడులో తిరుగుతున్న అగ్నిగోళాలన్నీ చప్పున చల్లారిపోతాయి. చమూగా లేకుండా టెమూజిన్ ఒక్కడూ ఎక్కడికీ వెళ్లడు. ఇద్దరిదీ అంతటి గాఢానుబంధం. సహోదరులు సుబుటాయ్, చమూగా, చెపేనాయన్ల సహాయంతో బలమైన సైన్యాన్ని సిద్ధం చెయ్యడం మొదలుపెడతాడు టేమూజిన్. ఆత్మరక్షణ తక్షణ కర్తవ్యమనీ, మంగోల్ వీరుల కరవాలాల రక్షణలో ఆసియాఖండం యావత్తూ దివ్య సంపదలతో తులతూగబోతోందన్న జోస్యాన్ని చెప్తాడు. అంతటి ఆత్మవిశ్వాసం టెమూజిన్ ది.

ఎన్ని విపత్కర పరిస్థితులెదురైనా చలించకుండా గుండెల మీద చెయ్యి వేసుకుని హాయిగా నిద్రపోగలడు టెమూజిన్. నిస్సహాయంగా ఏడ్వడమంటే అసహ్యమతడికి. భయమన్నది ఎరుగడు. ఏ పని చేసినా దాని వెనుక ఎంతో ఆలోచన ఉంటుంది. యోజన ఉంటుంది. ముందస్తుగా తండ్రిని హతమార్చిన టైజూట్ తండా నాయకుడు టర్గుటాయ్ నీ, అతని తండాపై దాడి చేస్తాడు. తీవ్రంగా గాయపడిన టర్గుటాయ్ తప్పించుకుంటాడు. ఆ విపత్కర సమయంలోనే తండ్రి జీవించి ఉండగా చూసి ఉంచుకున్న కుంకురాట్ నాయకుడు డైసెజన్ ఖాన్ కుమార్తె **బుర్టీ** ని వివాహమాడతాడు టెమూజిన్. తుఘ్రుల్ ఖాన్ ఆహ్వానాన్ని మన్నించి సహోదరులతో కలిసి సింగ్పాల్ నగరానికి వెళ్తాడు. తుఘ్రుల్ ఖాన్ ఎత్తులకు పై ఎత్తులు వేసి తనకు కావాల్సిన సహాయాన్ని రాబట్టే ప్రయత్నాలు చేస్తాడు టెమూజిన్. తుఘ్రుల్ కీ, కిన్ చక్రవర్తికీ తార్తార్, నైమాన్ తండాల బెడద తప్పిస్తాననీ మాటిచ్చి, అందుకు తన సైన్యాన్ని బలపరచడానికి గాను డబ్బు, ఆహారధాన్యాలూ, తుపాకీ మందు, తుపాకీలు తయారు చేసేవాళ్లనీ ఇచ్చేలా తుఘ్రుల్ ఖాన్ తో ఒప్పందం కుదుర్చుకుంటాడు.

అక్కడే టెమూజిన్ కి తుఘ్రుల్ తమ్ముడి కుమార్తె అబికా ఖాటూన్ తో ప్రణయం కూడా మొదలౌతుంది. తుఘ్రుల్ మరో తమ్ముడి భార్య ఖైషీతో వ్యవహారం అతడిలోని ఉదాత్తతను తెలియబరుస్తుంది. ఆ వయసుమళ్ళిన అభాగినికి కాసింత మనశ్శాంతిని ప్రసాదించాలనే అతడి ఆలోచన అతడు చేసిన పని సబబైనదేనేమో అనిపించేలా చేస్తుంది. నగర విహారానికి వెళ్ళిన టెమూజిన్ ఆ సిరిసంపదలను చూసి చకితుడౌతాడు కానీ అక్కడ నగర వీధుల్లో అరబ్బు వ్యాపారులు వెలానికి నిలబెట్టిన ఆడపిల్లలను చూసి ఆ వ్యాపారులతో గొడవ పడతాడు. బానిసత్వంలో మగ్గుతూ నీచమైన పేదరికంలో ఉన్న కొందరు ప్రజలను చూసి విపరీతంగా బాధపడి, "నాగరికత, సత్యం, ధర్మం అంటూ వెధవడచ్చీలు తప్ప – తిన తిండి గుడ్డాలేని ఈ వెధవ నగరాల్లో పడుండి ఎందుకురా మీరంతా ఇలా చస్తారు! అలా ఏ గోబీ బంజర్లకో వచ్చి గొడ్లు కాసుకోరాదట్రా! అంత బ్రతకలేకపోతే పోనీ ఆ పచ్చనదిలో దూకి ప్రాణాలు తీసుకోరాదా? మీ బ్రతుకులు తగలెయ్యా! ఎందుకురా ఇలా బ్రతుకుతారు?" చిరాకుపడిపోతాడు. ఇలా బిగ్గరగా మాట్టాడ్డం సభ్యత కాదని వారించబోయిన చమూగా ను "ఛీ! పక్షీ. ఏమిట్రా వాగుతావ్! ఆడదాన్ని గుడ్డలూడదీసి నడివీధిలో నిల్చోబెట్టడమేనట్రా – నీ సభ్యతలూ, నీ నాగరికతలూ, నీ కళాలూనూ?" అని తిట్టిపోస్తూ గూబ గుయ్యిమనిపిస్తాడు. కొందరు పేదలకు అప్పటికప్పుడు తిండి దొరికే ఏర్పాటు చేస్తాడు. అతని కరుకుదనపు గుండెల్లో దాగి ఉన్న మానవత్వం, బానిసత్వం పట్ల, మనుషుల నిస్సహాయత పట్ల అతడికున్న అసహ్యం వ్యక్తమౌతాయా సన్నివేశంలో. ఆ తర్వాత కొట్టినందుకు తమ్ముడికి క్షమాపణ చెప్పి హత్తుకోవడంతో చమూగా పట్ల అతడికి ఎంతటి ప్రేమాభిమానాలున్నాయో తెలుస్తాయి.

టెమూజిన్ సొంగ్ పాల్ నగరం నుండి వెనక్కు వచ్చేసరికీ యెక్కా మంగోల్ తండాపై రాత్రికిరాత్రి మెర్కిట్ తండా వచ్చిపడి గర్భిణి అయిన అతడి భార్య బుర్టీని ఎత్తుకుపోయిన సంగతి తెలుస్తుంది. వెంతనే యుద్ధానికి వెళ్దామన్న మిగతావారి ప్రతిపాదనని తోసిపుచ్చుతాడు టెమూజిన్. తండాదాలో మిగతా స్త్రీలను అనేకసార్లు శత్రువులెత్తుకుపోయారు. వారందరి కోసం మనం ఎప్పుడూ యుద్ధానికి దిగలేదు. ఇప్పుడు నా భార్య కోసం ఇందరి ప్రాణాలను పణంగా పెట్టి యుద్ధానికి దిగననీ, ఖాఖాను కొక న్యాయం, ప్రజలకు ఒక న్యాయం మొదలైన మరుక్షణం జాతి పతనం ప్రారంభమౌతుందనీ అందరికీ నచ్చచెబుతాడు. మరి మన జాతికి పరువూ మర్యాదలు లేవా అనడిగిన చమూగాకి ప్రజల క్షేమం, సంఘం ప్రయోజనాల కోసం అవసరమైతే స్వప్రయోజనాలను త్యాగం చేసి బ్రతకడమే నా దృష్టిలో పరువూ మర్యాదా అని వివరిస్తాడు టెమూజిన్.

టెమూజిన్ మానవుడిగా బ్రతకాలని ప్రయత్నిస్తాడు కానీ తనను ఆవరించిన మనో వేదనలను భరించలేక, స్వలాభాపేక్షలు, కుట్రలు, పరహింసల మధ్యన బ్రతకలేక తండాల అజమాయిషీ కరాచర్, చమూగాలకు అప్పగించి కొన్నాళ్ళు బుర్ఖాన్ పర్వతం మీద ఏకాంత వాసం చేస్తాడు. చిన్ననాటి నుండీ అతడిపై మనసు పెంచుకున్న మెర్కిట్ తండాలోని ముఖ్యుడు డైర్ఉసుర్ ఖాన్ కూతురు **కూలన్** బుర్ఖాన్ పర్వతంపై అతడికి అండగా నిలిచి మళ్ళీ అతడిని తండాలోకి తేగలుగుతుంది. వారి తండాలలో బహుభార్యత్వాన్ని ఆదరించేవారు. టెమూజిన్ బుర్ఖాన్ పర్వతానికి వెళ్ళేముందే తుఘ్రుల్ ఖాన్ పంపిన తుపాకీ మందు, తుపాకులు తయారు చేసేవారు వచ్చేస్తారు. పసిపిల్లలతో సహా అందరికీ ఆయుధాల తయారీ నేర్పమని చెప్పి వెళ్తాడు అతడు. తండాకు తిరిగి వచ్చిన తర్వాత ఆయుధోత్పత్తి కర్మాగారంలా ఉన్న ప్రతి దేరానూ చూసి సంతృప్తి పొదుతాడు అతను. గుర్రం బలమైన జంతువై ఉండి కూడా మనిషికి లోబడి బానిసై బతుకుతోంది. ఆత్మవిశ్వాసం లేని మనుషుల గతి ఇంతే! కాబట్టి తన తండాలో ఉన్న ప్రతి వ్యక్తీ వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం కలిగిఉండాలనీ, మానవజాతిలో ప్రతి ఒక్కడికీ ఇలాంటి వ్యక్తిత్వం ఉండాలనే మంగోల్ వీరులు పోరాడుతున్నారనీ సోదరుడు సుబుటాయ్ తో అంటాడు టెమూజిన్.

"టెమూజిన్ అనంతమైన విధ్వంసకాండకు కారకుడయ్యాడని స్వలాభేక్షాపరులు కొందరంటే అనవచ్చు. సామాన్య మానవుడు కొంచెం ఊపిరిపీల్చుకునే అవకాశం కలగచేయడానికి తన సర్వస్వాన్ని బలిపెట్టి పోరాడిన ఒక సోదర మానవుడిగా కొంతమంది కాకపోతే కొంతమంది అయినా నన్ను అర్థం చేసుకుని ఆప్యాయపడకపోరు. నన్నూ, నాతో పాటూ బ్రతకాలనుకునేవాళ్ళనూ చంపాలని ప్రయత్నించేవాళ్ళను నరికి గుట్టలుగా పొయ్యటానికి నేను వెనుకాడను. నా జోలికి రాకుండా వాళ్ల బ్రతుకు వాళ్ళు బ్రతికేవాళ్ళంతా నా ఆప్తులే. వాళ్లకు ఆపద రాకుండా కపాడటానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" అంటాడు టెమూజిన్. సమకూర్చుకున్న తుపాకులతో ఒకేసారి మూడు తండాలతో తలపడతాడు. మునుపు తప్పించుకుని పారిపోయిన తన తండ్రి హంతకుడు **టైజూట్** ఖాఖాన్ టర్గుటాయ్, **నైమాన్** ఖాఖాన్ తైయాంగ్, భార్యను ఎత్తుకుపోయిన **మెర్కిట్** తండా సేనాని తుక్తాబీగీ మొత్తం ముగ్గురితో యుద్ధానికి దిగుతాడు. అందరినీ హతమార్చి భార్య బుర్టీను, అప్పటికే పుట్టిన మగబిడ్డ **జూజీ**ను రక్షించి వెంట తెచ్చుకువస్తాడు. శత్రుస్థావరంలో అన్నాళ్లు ఉన్న భార్యను తెచ్చుకుని ప్రేమగా అక్కున చేర్చుకున్న అతడి ప్రేమ కూడా గొప్పదే.

నైమాన్ ఖాఖాన్ మరణించిన తర్వాత తక్కిన నైమాన్ ఖానులంతా టెమూజిన్ కు లొంగిపోతారు. గోబీలో ఏ జాతి లొంగిపోయినా దాన్ని మంగోలు తండాలో కలిపివెయ్యటం జరుగుతుంది. కానీ నైమాన్ తండాలనన్నింటినీ స్వతంత్ర ప్రతిపత్తిలో ప్రత్యేకంగా ఉంచేసి, వాటికి చమూగాను స్వతంత్ర్య ప్రభువుగా ప్రకటిస్తాడు టెమూజిన్. నీవూ, నేనూ ఎలా ఆత్మీయులమో మంగోల్, నైమాన్ అలా ఆత్మీయంగా బ్రతకాలని ఆశిస్తున్నానని చెప్తాడు చమూగాకు. కలలో కూడా ఆశించని కరకోరం పర్వతశ్రేణిలో అధికారాన్ని స్వీకరించిన మరుక్షణం తన కలలన్నింటికీ రూపాన్నిస్తూ, అహింసా సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ, భూములను సాగు చేసి వ్యవసాయం

మొదలుపెట్టిస్తాడు చమూగా. చైనా నుండి ఉపాధ్యాయులను తెప్పించి పిల్లలకు చదువులు చెప్పిస్తాడు. పంటల పండుగకు ఆహ్వానానికి గానూ టెమూజిన్ తన బదులు మామ కరాచర్ ను నైమాన్ పంపిస్తాడు. తండాలన్నింటినీ చూడడానికి చమూగాతో వెళ్ళిన కరాచర్ నిరాయుధులైన ప్రజలను చూసి ఆశ్చర్యపోతాడు. కలవరపడి వెళ్ళిపోతూ.. టెమూజిన్ మెడలు విరిచి ఈ రాజ్యాన్ని నీ చేతిలో పెట్టి పెద్ద ప్రమాదాన్ని అతడి నెత్తిన పెట్టానంటాడు కరాచర్ చమూగాతో. తెల్లబోయిన చమూగాతో " చుట్టూ ఉన్న సామ్రాజ్యవాదులందరూ గోబీ జాతులన్నింటినీ కాలిక్రింద తొక్కివెయ్యాలని చూస్తున్న తరుణంలో ఈ ప్రజల నందరినీ నిరాయుధులను చేసి తమను తాము కాపాడుకోలేని స్థితికి తెచ్చావు" అని అర్థమయ్యేలా  చెప్తాడు. అయినా సరే నైమాన్ ప్రజలచేత ఆయుధాలు ముట్టించనని ఖచ్చితంగా చెప్తాడు చమూగా. తిరిగి వస్తూండగా కెరియిట్ దళాలు కరాచర్ ను దొంగదెబ్బ తీసి హతమారుస్తాయి. యొక్కా మంగోల్ తండాకు పెద్ద అండగా బ్రతికిన కరాచర్ జీవితం అలా ముగుస్తుంది. అన్నగారి మరణవార్త విన్న దు:ఖంలో టెమూజిన్ తల్లి ప్రాణత్యాగం చేస్తుంది.

చమూగా అమాయకత్వాన్నీ, అహింసా పథాన్నీ అడ్డం పెట్టుకుని, ఆసియా ఖండంలో శాంతిని అతడే నిలబెట్టగలడని చెప్పి, ఒప్పించి అతడితో కలిసి టెమూజిన్ పై శాంతి యుద్ధంన్ని ప్రకటింపజేస్తాడు తుఘ్రుల్ ఖాన్. ఈలోపూ ఇదివరలో పారిపోయిన నైమాన్ ఖానులు ఏకమై నైమాన్ పై యుద్ధానికి వచ్చి చమూగా కలలన్నింటినీ నాశనం చేసేస్తారు. విషయమంతా అర్థమై ఓటమి తాలూకూ బాధలో ఉన్న చమూగాను తండాకు రప్పించి రక్షణ కల్పిస్తాడు టెమూజిన్. కానీ అవమాన భారంతో ఆత్మహత్య చేసుకుంటాడు చమూగా. మరో పక్క మరో నలుగురు చక్రవర్తులతో కలిసి స్వారిజం చక్రవర్తి మహమ్మద్ షా యుద్ధానికి సన్నాహాలు చేస్తాడు. స్నేహసంబంధాలు కలిపుకుందామనీ, అదే గోబీ ప్రజలకూ క్వారిజం ప్రజలకూ మంచిదని రాయబార లేఖను పంపిస్తాడు టెమూజిన్. మహమ్మద్ షా ఒప్పుకోడు. ఇంతలో గోబీలో టెమూజిన్ ఆధిపత్యాన్ని భరించలేని చైనా చక్రవర్తులు శాంతి యుద్ధం పేరుతో మిగతా రాజులనందరినీ వెంటేసుకుని యుద్ధానికి బయల్దేరుతారు. టెమూజిన్ నుండి ఎన్నో ఉపకారాలూ, సహాయాలు పొందిన తుఘ్రుల్ ఖాన్ చైనా చక్రవర్తుల రాయబారిగా గోబీకి వస్తాడు. ఆయనకు గతంలో తాను చేసిన సహాయాలన్నీ ఏకరువు పెడుతూ, ప్రజల క్షేమాన్ని కోరుతూ, సంధి కోరుతూ ఒక చారిత్రాత్మక లేఖ రాస్తాడు టెమూజిన్. టెమూజిన్ ఎంత సహనపరుడో, ఎంత ఆలోచనాపరుడో, గోబీ ప్రజల క్షేమం అతడికి ఎంత ముఖ్యమో, తుఘ్రుల్ ఖాన్ కు ఎన్ని రకాలైన ఉపకృతులు చేసాడో ఈ లేఖ ద్వారా తెలుస్తాయి. ఆ లేఖనసలు లెఖ్ఖ చేయడు విశ్వాసఘాతకుడు తుఘ్రుల్ ఖాన్. ఆ తర్వాత జరిగిన యుద్ధంలో రక్తం ఏరులై పారుతుంది. టెమూజిన్ విజయం సాధిస్తాడు.

క్రీ.శ.1206 లో జరిగిన గోబీ నాయకులందరి "కురల్ టాయ్" లో టెమూజిన్ శక్తివంతమైన ప్రసంగం చేస్తాడు. గోబీ జాతులన్నీ మహాశక్తిగా ఏకమైన మంగోల్ జాతి ఆవిర్భావాన్ని ప్రకటిస్తాడు. గోబీ ప్రజల సమిష్టి ప్రయోజనం కోసం ఎన్నో అకృత్యాలు చేసాననీ, గద్దె పైన తనకు ఆశ లేదనీ, ఎవరిని కావాలంటే వారిని నాయకుడిగా వాళ్ళు ఎన్నుకోవచ్చుననీ చెప్తాడు. కానీ ప్రజలంతా ముక్త కంఠాలతో టెమూజిన్ నే నాయకుడిగా కావాలంటారు. "సూటూ బోడ్గా బట్ టెంగ్రీ టెమూజిన్ ఖాఖాన్ .." అంటూ నినాదాలు చేసి అతడికి "జగజ్జేత" – "ఛంఘిజ్ ఖాన్" బిరుదాన్ని స్వీకరించవలసిందిగా వేడుకుంటారు. అతడంగీకరించి పెద్దల ఆశీర్వాదం తీసుకున్నాకా "సూటూ బోడ్గా బట్ టెంగ్రీ ఛంఘిజ్ ఖాఖాన్ జిందాబాద్" అన్న మహారావం లోకమంతా వినిపిస్తున్నట్టే అనిపిస్తుంది. ప్రపంచ జైత్రయాత్రకు సేనలను బయలుదేరదీసాడు ఛంఘిజ్ ఖాన్. అతని తదనంతరం అతని వంశీయుల హయాంలో ఆసియా ఖండం స్వర్ణయుగాన్ని చూసింది.

"దుర్భరమైన ప్రజాపీడన వల్ల అవతరించిన జ్వాలాముఖి ఛంఘిజ్ ఖాన్" అన్నది నవలా రచయిత తెన్నేటి సూరి గారి అభిప్రాయం. చారిత్రాత్మకమైన ప్రమాణాలు ఈ కథనాన్ని ఎంతవరకూ సమర్థిస్తాయో తెలీదు కానీ ఈ నవలా నాయకుడిగా మాత్రం ఛంఘిజ్ ఖాన్ తన ప్రజాశ్రేయస్సు కోరే ఒక అత్యద్భుత నాయకుడు. ప్రపంచ ప్రజలు విస్మరించిన ఈ మహానాయకుడి గురించి, ఎందరో ద్వేషించిన

వివాదాస్పద నాయకుడి గురించీ నవల రాయాలని ఎందుకు, ఏ కారణంగా తోచిందో రచయిత జీవించి ఉంటే తప్పక అడగాల్సిన ప్రశ్న అని నాకనిపించింది..

# దయానిధి - 'చివరకు మిగిలేది':

తెలుగు నవలా సాహిత్యంలో ప్రఖ్యాత మనోవిశ్లేషణాత్మకమైన పాత్రగా పేరుపొందిన "చివరకు మిగిలేది" నవలా నాయకుడు **దయానిధి**ని ఈ వ్యాస పరంపరలో చేర్చకపోతే ఎలా.. అని నాకనిపించింది. అయితే, ఇప్పటికే చాలామంది రచయితలు, విమర్శకులు, బ్లాగర్లు ఎన్నో రకాలుగా విశ్లేషించి, విమర్శించేసిన ఈ నవల గురించి రాయడానికి ఇంకేం మిగల్లేదేమో.. అన్న సందేహం కూడా కలిగింది. కానీ నేను రాస్తున్నవి కేవలం నవలా నాయకుల పరిచయాలు మాత్రమే కాబట్టి, మరో ప్రఖ్యాత నవలా నాయకుడిగా మాత్రమే దయానిధిని పరిచయం చెయ్యాలి అనుకుని ఈ వ్యాసం మొదలుపెడుతున్నాను..

**దయానిధి:**

"విశాలమైన నేత్రాలు, నల్లటి పాపలు, కోలగా సాగిన కళ్ళు, కళ్ళ చుట్టూ కాటుక పెట్టుకున్నట్లుగా ఉండే నలుపు, సోగగా జారిన కనురెప్పలు.. ఆర్చిలా అమరచబడ్డ కనుబొమ్మల మధ్య కత్తిరించిన వెంట్రుకల మెరుపు, చదరమైన తలకట్టు, గుండ్రటి పొడుగాటి మెడ, పల్చటి పైపెదవి, నవ్వుతుంటే జాలిగా మెరిసే కళ్ళు, మూతికి కుడి వెంపున చిన్న నొక్కు.." – ఇవీ దయానిధి రూపురేఖలు. అతడి ప్రమేయం ఉన్నా లేకున్నా అతడి జీవితంలో ప్రవేశించిన కొందరు వ్యక్తుల ద్వారా అతడు ఏం నేర్చుకున్నాడు? ఏం తెలుసుకున్నాడు అన్నది ఇతివృత్తం. జీవితంలో మనిషికి కావాల్సినదేమిటి? చివరకు మిగిలేదేమిటి? అని తనలో తాను ప్రశ్నించుకుంటూ, తన ప్రశ్నలకు తన అనుభవాల్లోనే జవాబులు వెతుక్కునే అంతర్ముఖుడైన దయానిధి చెప్పుకున్న ఆత్మకథే "చివరకు మిగిలేది" నవల. తన తాత్వికాన్వేషణలో చివరకు "మానవుడికి కావాల్సింది మతాలు, దేవుళ్ళు, మొక్కుబళ్ళు, రాజకీయాలు కావు: మానవుడికి కావాల్సినది దయ" అని తెలుసుకుంటాడు.

**బుచ్చిబాబు – 'చివరకు మిగిలేది' :**




కలం పేరు 'బుచ్చిబాబు' తో ప్రఖ్యాతి చెందిన **శివరాజు వెంకట సుబ్బారావు** గారు కథారచయిత, చిత్రకారులు, నాటకకర్త. సంగీతాభినయాలలో కూడా పరిజ్ఞానం ఉన్న బహుముఖ ప్రజ్ఞాశాలి. "సంతోష్ కుమార్" అనే కలం పేరుతో ఎన్నో ఆంగ్ల కవితలు రాసారు. నాగపూర్ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు లో ఎమ్మే చేసిన బుచ్చిబాబు గారు కొన్నాళ్ళు ఇంగ్లీష్ లెక్చరర్ గా పని చేసి, తరువాత ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో నాటక శాఖలో ప్రయోక్తగా చివరి రోజుల వరకూ పనిచేసారు. **అజ్ఞానం** అనే వచన కావ్యం, ఎనభైకి పైగా కథలు, నలభై నాటికలు, షేక్స్పియర్ సాహిత్య పరామర్శ, నలభై వ్యాసాలు, 'నా అంతరంగ కథనం' పేరిట చిన్ననాటి అనుభవాలను అనుభూతులనూ, 'చివరకు మిగిలేది' నవల మొదలైన రచనలు చేసారు బుచ్చిబాబు. సున్నిత మనస్కుడు, తాత్వికుడు, భావుకుడు, ప్రకృతి సౌందర్య ఆరాధకుడు, కవి అవడం వలన ఆయన రచనల్లో సౌందర్యం, కవితాత్మకత, ఒక ఆవేదన కనబడతాయి. ఆయన రచించిన ఏకైక నవల "చివరకు మిగిలేది"

ఆయనకు ఎంతో పేరు ప్రఖ్యాతలను తెచ్చిపెట్టింది. ఈ రచనను 1942లో తలపెట్టినా, రచన 1946లో మొదలయి 16 మాసాలపాటు **నవోదయ** పత్రికలో సీరియల్ గా ప్రచురింపబడింది. బుచ్చిబాబు గారు మొదట నవలకు "ఏకాంతం" అని పేరు పెట్టాకా, సాహితీవేత్త శ్రీ ఆచంట జానకిరామ్ గారు ఆ పేరును "చివరకు మిగిలేది" గా మార్చారుట. తెలుగు నవలాసాహిత్యంలో వచ్చిన మనోవైజ్ఞానిక నవలల్లో ప్రముఖమైనదిగా పేరుపొందిందీ నవల.

తాత్విక జిజ్ఞాసతో కూడిన గంభీరమైన నవల 'చివరకు మిగిలేది'. ఒక అరుదైన సృజనాత్మక అక్షర చిత్రం. కథానాయకుడు నవలలో చేసే తాత్వికపరమైన ఆలోచనలు, జీవితాన్ని తెలుసుకోవాలనే అతడి ఉత్సుకత, కొన్ని స్వగతాలు, ప్రకృతి వర్ణనలో వాడిన వాక్యాలు, కొన్ని ఉపమానాలూ మర్చిపోలేనివి. నాటకీయంగా సాగే సంభాషణలు, పాత్రల ద్వారా రాజకీయాలు, పురాణాలు, ఆధ్యాత్మికత, స్త్రీల స్వభావం పట్ల ప్రకటితమయ్యే అభిప్రాయాలు చాలా వరకూ అమోదకరంగా లేకపోయినా, మనుషుల మనస్తత్వాల లోతులను తెలిపే సజీవమైన పాత్రలు ఈ కథకు ఆకర్షణలు. ఈ నవలలో పాత్రలు ఎవరినీ ఉద్దేశించినవి కావు అంటే పాఠకులు ఒప్పుకోరు కాబట్టి ఆ మాట అనట్లేదని ఉపోద్ఘాతంలో తెలిపారు రచయిత. ఇంతటి సజీవమైన పాత్రల వెనుక తప్పకుండా ఏ యదార్థ గాథల ప్రేరణో ఉండి ఉంటుందని కథ చదివిన ప్రతివారికీ అనిపించక మానదు. ప్రథమ ముద్రణకు రచయిత రాసిన ఉపోద్ఘాతంలో ఈ నవలారచన వెనుక గల కారణాలు, ఆలోచనల గురించి చెప్తారు బుచ్చిబాబు గారు." జీవితంలో నిజమైన విషాదం ద్వేషించడం కూడా కాదు, నిజమైన విషాదం ప్రేమించలేకపోవడం. ద్వేషించడంలో కొంత పట్టుదల, కార్య సాధన కూడా ఉండచ్చు కానీ ప్రేమించలేకపోవడంలో అట్లా సమాధానపడేందుకేమీ లేదు. "నా కొరకు చెమ్మగిల నయనమ్ము లేదు" కంటే విషాదకరమైన గీతం ఏదుంది? ఈ సమస్య నన్ను బాధించింది. దీన్నిబట్టి ఈ సమస్యని నవలలో చర్చించి, ఒక సమాధానం కనుక్కున్నానని కాదు. ఈ వస్తువుని వ్రాసేస్తే విషయం నాకు విశదపడుతుందనీ, నలుగురితో పంచుకుంటే బాధ నుండి విముక్తి లభిస్తుందనీ తోచింది. వ్యక్తిగతమైన విముక్తి ఈ నవలకు ప్రేరణ." అంటారు బుచ్చిబాబు.

**దయానిధి పాత్రచిత్రణ:**

అందగాడు, చదువుకున్నవాడు, ఉన్నత కుటుంబానికి చెందినవాడు, త్వరలో డాక్టర్ కాబోతున్నవాడు దయానిధి. జీవితంలో చివరకు మిగిలేదేమిటన్న తత్వపరమైన అన్వేషణలో ఎన్నో అనుభవాలతడికి. కోమలి, అమృతం, సుశీల, ఇందిర, నాగమణి, శ్యామల, రోజ్, కాత్యాయిని మొదలైన స్త్రీలు అతడి జీవితంలో అతడి ప్రమేయంతోనూ, లేకుండానూ ప్రవేశించి, వెళ్ళిపోయి.. అతడి ఆలోచనల్లో, జీవితంలో కూడా గొప్ప మార్పుని తీసుకువస్తారు. అతడి ఆలోచనల్లో కలిగిన ఆ మార్పే చివరికి అతడు తెలుసుకున్న సత్యం. ప్రేమించలేకపోవడం, అధైర్యం, నిస్సహాయత, దుర్బలత్వం నిండిన అంతర్ముఖుడు దయానిధి. మహానాయకుడు కాదు ఒక సగటు మనిషి అన్నమాట. ఈ సగటు మనిషి తన ప్రశ్నలకు ఏమి సమాధానాలు సంపాదించుకున్నాడు, సంఘంతో ఎలా పోరాడాడు, ఆ ప్రయత్నంలో పొందిన అనుభూతులు ఎటువంటివి, చివరికి తనలో తాను ఎలా సమాధానపడ్డాడు అన్నదే "చివరకు మిగిలేది" కథ.



ఈ నవలలో మనకు పలు రకాల రచనా ప్రక్రియలు, సిద్ధాంతాలూ దర్శనమిస్తాయి. ఆంగ్ల సాహిత్యంపై మంచి పట్టున్నవారవడం వల్ల బుచ్చిబాబు గారు అలాంటి ప్రయోగం చేసుంటారు. ఈ ప్రక్రియలను తెలుసుకోకుండా **దయానిధి**ని పాత్రను అర్థం చేసుకోవడం ఒకింత కష్టం. వాటిల్లో మొదటిది **ఫ్రాయిడ్** ప్రతిపాదించిన 'Oedipus complex' లేదా 'Mother fixation'. ఈ సిద్ధాంతం ప్రకారం కొడుకుకు తల్లి అంటే ఒక అనిర్వచనమైన అనురాగం ఉంటుంది. అచేతనంగా ఏర్పడే ఈ అసాధారణమైన ప్రేమ వల్ల తల్లిని ప్రేమించినంత గాఢంగా మరొకరిని ప్రేమించలేకపోతాడు కొడుకు.

దీనిని గురించి ప్రముఖ ఆంగ్ల రచయిత D.H.Lawrence తన నవల 'Sons and Lovers' లో విపులంగా చెప్తారు. శీలవతి కాదన్న నిందతో జీవితాన్ని మోసిన దయానిధి తల్లి నవల మొదట్లోనే మరణిస్తుంది. ఆమె జీవితం, ఆమెకు కళంకాన్ని ఆపాదించిన కారణాలు.. కథ పరిధిలోకి రావు కానీ ఆ కారణంగా మనుషులు, సంఘం దయానిధిని ఎంత క్షోభపెడతాయో పలు సందర్భాల్లో మనకు తెలుస్తూంటుంది. కళంకిత కొడుకన్న అపవాదుని జీవితమంతా మోస్తాడతడు. తల్లిదండ్రులు చేసిన పొరపాట్లకు బిడ్డలు ఎలా ఆహుతౌతారో, అవి జీవితాంతం వారినెలా వెంటాడతాయో అతడి జీవితం చెప్తుంది. తల్లి పట్ల ఉన్న ఈ అసాధారణమైన అనురాగం వల్ల దయానిధి తన జీవితంలో ప్రవేశించిన ఏ స్త్రీనీ ప్రేమించలేకపోతాడు. దగ్గర కాలేకపోతాడు. ఒక్క అమృతానికి తప్ప.

తల్లిలా తనపై అపారమైన కరుణ, దయ, ప్రేమ చూపెట్టింది కాబట్టే అమృతానికి సన్నిహితుడౌతాడు దయానిధి. "రాతి శిలల మధ్య ఉండాల్సింది అమృతం. ఎక్కడో ఏ హంపీ లోనో-అన్ని రాళ్ళు-భగ్న ప్రతిమలు.. ఒంటరిగా నిల్చిపోయిన స్థంభాలు.. ప్రేమ కోసం గుండె రాయి చేసుకున్న రాకుమార్తెల విగ్రహాలు అన్నీ శిధిలమైపోయి, ఏ అర్ధరాత్రో అడుగుల చప్పుడు, నిట్టూర్పూ వినబడితే కదులుతాయేమోననిపించే ప్రమాదస్థితిలో పడి ఉంటే, వాటి మధ్య అమృతం కూచుని, విషాదంలో నవ్వుతుంది... ఆనాడు సౌందర్యం తన యాత్ర ముగించుకుని ఆమెను శిలగా మార్చివేస్తుంది. ఏ రాతిని నిట్టూర్పుతో కదిల్చినా అమృతం కలలో కార్చిన కన్నీరల్లె నీరైపోతుంది." అనుకుంటాడొకచోట. రచయిత లోని భాషా సౌందర్యం ఇటువంటి మరికొన్ని వాక్యాల్లో వెల్లడవుతుంది.

ఈ 'Oedipus complex' ఉన్న వ్యక్తుల్లో ఎంతో మానసిక సంఘర్షణ ఉంటుంది. "చీకటి సమస్య" అధ్యాయంలో షేక్స్పియర్ నాటిక "హేమ్లెట్" ప్రస్తావన తెచ్చి హేమ్లెట్ పడిన మానసిక సంఘర్షణ గురించి వివరిస్తూ, అతడి సమస్యను గురించీ ఓ వ్యాసం రాస్తాడు దయానిధి. తన తల్లి పట్ల కూడా దయానిధికి అటువంటి ద్వేషం, ప్రేమ కలగలిసిన భావాలున్నాయని మనకు అర్థం అవుతుంది. హేమ్లెట్ పడ్డ యాతనే అతనూ పడ్డాడు. తల్లి పట్ల ఉన్న ఆ ద్వేషంతోనే చివరలో తన ఆశ్రయం కోరి వచ్చిన కోమలిని కూడా చంపాలనే ఆలోచన కలుగుతుంది అతడికి. కానీ చివరలో అతడి ఆలోచనలో మార్పు వస్తుంది. అంతవరకూ తల్లిని ద్వేషించిన సంఘాన్ని ద్వేషిస్తూ వచ్చిన అతడు ఆ ద్వేషాన్ని వదిలేస్తాడు. "తనకేం కావాలో తెలియనప్పుడు మానవుడు ద్వేషిస్తాడు" అంటాడు. జీవితానికి అర్థమేమిటో తెలియలేదని అన్నాళ్ళు బాధపడినవాడికి వైకుంఠం మాష్టారు రాసిన ఉత్తరం వల్ల జీవితానికి అర్థమేమీ లేదని తెలుస్తుంది. అర్థమేమీ లేనప్పుడు, సంస్కరించాల్సిందీ ఉండదు. అతడిలో ఆనందం ఉద్భవిస్తుంది.

"సంఘాన్ని మార్చలేడు. మనుషుల్ని మార్చలేడు. మారిస్తే బాధ? పగ? యుద్ధం. తనతో తాను సమాధానపడాలి. అది ఈనాటికి సాధించాడు. ఒక ప్రశాంతత, పవిత్రమైన మహత్తర ఆనందం అతనిలో ఉద్భవించింది". ఇక్కడ మనకు "అస్తిత్వవాదం" కనబడుతుంది. ఇదే రచయిత వినియోగించుకున్న మరో సిద్ధాంతం.. Existentialism! **సార్త్రె** విస్తరింపచేసిన 'అస్తిత్వవాదం' ప్రకారం మనిషి మనుగడలో అతడే కర్త అనీ, అతడి జీవితంలో జరిగే పనులకు ఏ మానవాతీతశక్తి ప్రమేయం లేదనీ, అతడి కర్మలకు అతడే బాధ్యుడనీ, దేవుడో, తలరాతో, పూర్వజన్మకృతమో కాదన్నది ఈ సిద్ధాంతవాదుల వాదం. ఇవే అభిప్రాయాలను దయానిధి వివాహ సమయంలో అతడి స్నేహితుడి సంభాషణల ద్వారా చర్చకు తెస్తారు రచయిత.

ఇక ఆత్మకథ రూపంలో దయానిధి చెప్పుకునే కథనంలో ఇతర పాత్రల వర్ణన, స్వభావాల వివరణల్లో ఎంతో మనస్తత్వ విశ్లేషణ కనబడుతుంది. దయానిధి పట్ల love-hate relationship చూపిన సుశీల, అగ్నిసాక్షిగా అతడి భార్య అయీ అతడి సహచారిణి కాలేకపోయిన అభాగిని ఇందిర, అతడి పట్ల ఆకర్షితురాలైన నాగమణి, వివాహిత ఐనా నిర్నిబంధమైన ప్రేమ చూపించే అమృతం, ఆమె భర్త కాంతారావు, వదిలి వెళ్ళిపోయీ.. మళ్ళీ తిరిగి వచ్చి తనలోని మార్పు వల్ల అతడి ప్రేమను పొందగలిగిన కోమలి, హుషారుగా కనబడే లోతైన

వ్యక్తిత్వమున్న జనార్ధనం, సౌందర్యరాహిత్య మనే మానసిక రుగ్మతతో బాధపడే శ్యామల, రాయలసీమలో ఆదరించి ఆవాసం కల్పించిన అనంతాచారిగారూ.. వారి కుటుంబ సభ్యులు, నమ్మినబంటు నారయ్య... మొదలైన పాత్రల నుంచి తెలుసుకోవలసిన సంగతులు ఎన్నో ఉన్నాయి. అతి చిన్న పాత్రలో కూడా మధనం..వారి ఆలోచనలు,స్వభావాలూ గుర్తుండిపోయేలా ఉంటాయి. రాయలసీమలో రేగిన విద్వేషాల్లో, దయానిధికి ఎదురైన అకారణ ద్వేషాల కారణంగా అతడిలో మనుషుల పట్ల, సంఘం పట్ల ఒక రకమైన నిర్వేదం ఏర్పడుతుంది. భార్య ఇందిర మరణించినప్పుడు అది బయటపడుతుంది.

"ఈ మనుషులు గోనిబస్తా మనుషులు. ఏ బస్తా ఖాళీగా ఉండకూడదు. అందులో పుష్పాలు వెయ్యాలి; లేకపోతే రాళ్ళు వెయ్యాలి; కట్టెలు వెయ్యాలి. ప్రతివాణ్ణీ ఆ బస్తాలో దిగేసి చెట్టు కొమ్మకు వ్రేళ్లాడ దీస్తారు.."

తండ్రి పట్టుదల వల్లే ఇందిర తన వద్దకు రాలేకపోయిందని అర్ధమౌతుంది దయానిధికి. "తల్లిదండ్రుల చెప్పుచేతల్లో పెరిగిన వ్యక్తిత్వం లేని అమాయకురాలు ఇందిర" అంటాడు. అందువల్ల వివాహం నిర్బంధ స్నేహమని అతనికి నమ్మకం ఏర్పడుతుంది. అమృతంతో జరిగిన పొరపాటు వల్ల శరీరాల స్నేహం పోను పోనూ ద్వేషంగా మారి ఆత్మలను చంపేస్తుందనే విశ్వాసం అతడిలో ఏర్పడుతుంది. ఒకరికొకరు అర్ధంకానంత వరకూ, శరీరాలు పరిచయం కానంతవరకూ ప్రేమ ఉంటుంది కాబట్టి శరీరాల జోలికి పోకుండా స్నేహంగా ఉంటే జీవితం కొత్తగా ఉంటుందనీ, బ్రతుకు మీద విసుగు పుట్టదనీ అతని భావన. "సంఘాన్ని గౌరవించే అవసరం నాకు కనబడలేదు. మరణించిన తరువాత కూడా, సంఘం తిడుతూనే ఉంటుంది. ఫలానా జిల్లా వాడిని అని రాజకీయంగా ద్వేషించింది సంఘం; ఫలానా తల్లి కొడుకుని అని నైతికంగా హింసించిందీ సంఘం.."

రచయిత ఈ నవలలో ఉపయోగించిన మరో శక్తివంతమైన సాహితీ ప్రక్రియ చైతన్య స్రవంతి పద్ధతి(Stream of conciousness technique). కథనమంతా దయానిధి తన స్వీయ చరిత్ర తానే చెప్పుకుంటున్నట్లు నడుస్తుంది.. మధ్య మధ్య దయానిధి స్వగతాలతో. ఆ స్వగతాలు కూడా మామూలు స్వగతాలు కావు. మనసులోని రహస్యాలను బయటపెట్టే అంతర్గత స్వగతాలవి. సభ్యాసభ్యతలను చూడకుండా, ఒక క్రమంలో ఉండకుండా, మనసులోకి వచ్చిన ఆలోచన వచ్చినట్లు బయటకు చెప్పేసే స్వగతాలవి. అలా ఎగుడుదుగుడుగా ఉంటాయి కాబట్టే చైతన్య స్రవంతిలో నడిచే కొన్ని రచనలు అయోమయంగా, అర్ధం కాకుండా కనిపిస్తాయి. కథనంలో దయానిధి చెప్పే స్వగతాలు కూడా ఇలాంటివి కాబట్టే అతని పాత్ర కొందరికి అయోమయంగా, గజిబిజిగానూ, అర్ధం కానట్లుగానూ అనిపిస్తుంది.

**దయానిధి గడ్డిపోచ వేదాంతం:**

"గడ్డిపోచ విలువెంత?" అనే మొదటి అధ్యాయంలో ఒంటరిగా కాలువ గట్టున ఆకాశం క్రిందన కూచుని ఆలోచనల్లో జీవన తత్వాన్ని వెతుక్కుంటూ ఒక గడ్డిపరకని వేలికి చుట్టుకుంటాడతను. అదే గడ్డి పరకను కోమలి తల్లో పెట్టబోతే.. "ఛీ పాడు.. గడ్డి..దాచుకో" అంటుందామె. గడ్డి పరక విలువ కోమలికి తెలీదు. ఆమె అతడ్ని గడ్డిపోచ క్రింద తీసిపారేసింది. కళంకితగా పరిగణించి గడ్డిపరకలా అతడి తల్లిని తీసిపారేస్తుంది సంఘం. కానీ ఆ గడ్డిపరకే అతడి జీవితానికి లంగరు. తల్లి మరణించినప్పుడు ఒంటరిగా కన్నీరు కార్చినప్పుడు,అతడి కన్నీటిలో గడ్డిపోచలు తడుస్తాయి. మృత్యువు తల్లిని గడ్డిపోచ క్రింద తీసిపారేసింది. "ప్రాణానికి ఎంత విలువ ఉంది? గడ్డిపోచకెంతో అంతే!" అనుకుంటాడు. అదే విధంగా తక్కువజాతి స్త్రీగా లోకులచే లోకువ కట్టబడిన కోమలి అతడికి అపురూపం అవుతుంది. "అట్లా గడ్డిపోచల మధ్య గంతులేస్తూ ఆకాశాన్నీ, భూమినీ బుజ్జగిస్తూ స్నేహం చేసుకుంటూ ఉండవలసిన వ్యక్తి కోమలి. ఆమె నిజస్థానం అది. పుట్టిల్లు పచ్చగడ్డి, అత్తిల్లు ఆకాశం, పిట్టలు పువ్వులు సంతానం. మనుషుల మధ్య ఇండ్లలో ఉండి ఎంగిళ్ళు ఎత్తవల్సిన మనిషి కాదు. కొందరు కొన్ని వాతావరణాల

కోసం ఉద్దేశింపబడతారు. ఆ వాతావరణం మధ్యనే వారికి పరిపూర్ణత ఉంటుంది" అంటాడొకచోట దయానిధి. మళ్ళీ అతడే అమృతంతో కోమలి గురించి చెప్తూ "దానికి మంచీ మర్యాదా తెలీదు. తలకాయ లేని శరీరం, ఆత్మ లేని అంగపుష్టి" అని గడ్డిపోచలానే తీసిపారేస్తాడు."అట్లాంటి పిల్ల నీకెల్లా నచ్చింది బావా?" అని ఆమె అడిగితే, "ఏమిటో అమృతం..దానికి సమాధానం తెలిస్తే, జీవిత రహస్యమే తెలిసిపోను" అంటాడు. బహుశా తల్లిలా గడ్డిపోచలా సంఘం తీసిపారేసింది కాబట్టే కోమలి పట్ల అంత ఆకర్షితుడయ్యాడేమో అతడు! చివరాఖరులో అదే కోమలితో నడిచి నడిచి అలసిపోయి కొండల మధ్యన, ఆకాశం క్రిందన..అదే గడ్డిలో పడుకుని మళ్ళీ మొదట్లో వేసుకున్న ప్రశ్నే వేసుకుంటాడు.. "జీవితానికి అర్థం ఏమిటి?" అని! "తడిసిన గడ్డిపోచ సూర్యుడి తాకిడికి తేరుకుంటుంది...ఏమీ ఐపోదు.." అని మొదట్లో అనుకున్నట్లే చివర్లోనూ అనుకుంటాడు.. తనలో "కొత్త బలం, వికాసం, ధృఢనిశ్చయం" ఉన్నాయని. దీన్నంతటినీ దయానిధి చెప్పే గడ్డిపోచ వేదాంతమనుకోవచ్చు!

మొదట్లో చెప్పుకున్నట్లు దయానిధి పాత్ర మహోన్నతమైనదేమీ కాదు. డాక్టర్ అయినా పెద్దగా సంపాదనాపరుడూ కాదు. మనిషిలో ప్రత్యేకతలు కూడా ఎక్కువ కనబడవు. నవలలో రచయిత దృష్టికోణం కేవలం దయానిధి మానసిక ఎదుగుదలపై ఉంటుంది. ఆలోచనాపరుడిగా, సంఘద్వేషి నుండి స్వేచ్ఛావాదిగా దయానిధి మారిన తీరు; అతడిలో కనబడే అస్తిత్వవాదాన్నీ, అతడి అంతర్గత ఎదుగుదలనే మనం చూడవలసినది. ఆ విధంగా చూసినప్పుడు మనకు కథలో కానీ, దయానిధిలో గానీ ఉన్న లోపాలు చిన్నవిగా, ఆ పాత్ర నుండి నేర్చుకోవాల్సిన పాఠాలు పెద్దవిగా కనబడతాయి.